ఆదివారం
గత వారం వారం వార్తల్లో ... (వార్త మేగజైన్)

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తాడేపల్లిగూడెం : fb.com/vaartha Digital

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

1-5-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 89 పేజీలు: 10+4 వెల: 6.50


భాక్రా మిగులు నీటిని మాకిచ్చేయండి: హర్యానా

వారం రోజులుగా సరిహద్దుల్లో పాక్ కవ్వింపు కాల్పులు

5లో



సింహాచల దేవస్థానంలో గోడ కూలి పలువురి మృతికి కారణమైన ప్రాంతంలో సహాయక చర్యలు కొనసాగుతున్న దృశ్యం

# చందనోత్సవంలో అపశ్రుతి

## గోడ కూలడంతో ఏడుగురు భక్తులు మృతి

## ఘటనలో ఐటీ ఉద్యోగులైన దంపతుల దుర్మరణం

## కోనసీమ జిల్లాకు చెందిన ఇద్దరు స్నేహితులు మృతి

**విశాఖపట్నం, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:** సింహాచలంలో జరిగిన చందనోత్సవంలో అపశృతి చోటు చేసుకుంది. స్వామి వారి నిజరూపాన్ని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు 300 రూపాయల లైన్లో ఉన్న సమయంలో గోడ కూలడంతో ఏడుగురు మృతిచెందగా పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. మృతులలో ముగ్గురు మహిళలు నలుగురు పురుషులు ఉన్నారు. బుధవారం వేకువ జామున 3 గంటల సమయంలో ఒక్కసారిగా గాలితో కూడిన భారీ వర్షం పడింది. దీంతో భక్తులు వర్షంలో తడిచిపోకుండా అవకాశం ఉన్నంతవరకు పరుగులు తీసి తలదాచుకున్నారు. అయితే షాపింగ్ మాల్ వెనక నుండి 300 రూపాయల దర్శనానికి ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. దీంతో ఆ టికెట్లు ఉన్నవారు ఆ లైన్ క్యూ లైన్‌లోకి వెళ్లారు భారీ వర్షం కారణంగా ఆ సిమెంట్ గోడ కూలి భక్తులపై పడింది.

దీంతో అప్రమత్తమైన ఆలయ అధికారులు పోలీసులు క్షతగాత్రులకు వైద్య సేవ నిమిత్తం అంబులెన్స్‌లకు సహాయార్థం ఎన్‌డిఎఫ్‌ఏ సిబ్బంది సహాయం తీసుకున్నారు. హోంమంత్రి వంగలపూడి అనిత, జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ సహాయ చర్యలను పర్యవేక్షించారు. మృతదేహాలను కెజిహెచ్ మార్చురీకి తరలించి, క్షతగాత్రులను వైద్య సేవ నిమిత్తం ఆస్పత్రులకు పంపించారు.

**ప్రమాదంలో స్నేహితులు మృతి**

సింహాచలం అప్పన్న సన్నిధిలో జరిగిన ప్రమాదంలో ఇంటీరియర్ డిజైనర్ పతి దుర్గ స్వామి నాయుడు (32) సహా అతని స్నేహితుడు కుంపట్ల మణికంఠ ఈశ్వర శేషారావు (29) ప్రాణాలు కోల్పోయారు దీంతో విశాఖ కెజిహెచ్ దగ్గర బంధువుల రోదనలు మిన్నంటాయి. గుండెలు పగిలేలా విలపిస్తున్నారు ఎంత మంది ఓదార్చినా ఎవరి తరం కావడం లేదు అంతగా కన్నీటి పర్యంతం అవుతున్నారు. చిన్న వయసులోనే ప్రాణాలు కోల్పోయారంటూ బంధువులు రోదిస్తున్నారు పతి దుర్గ స్వామి నాయుడు గత మూడేళ్లుగా విశాఖలోని సీతమ్మధారలో నివాసం ఉంటున్నాడు మృతుడు స్వగ్రామం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొర్లపాటివారిపాలెం >>2



# జనగణనతో పాటే కులగణన

## కేంద్ర సూపర్ కేబినెట్ ఆమోదం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 30:** జనాభా గణనలో భాగంగానే కులగణనను కూడా చేపట్టేందుకు ప్రధానిమోడీ ప్రభుత్వం నిర్ణయించింది. జనాభా గణనలోనే కులగణను అత్యంత పారదర్శకపద్ధతిలో చేరుస్తామని తేల్చింది. ప్రధానిమోడీ అధ్యక్షతన జరిగిన రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ రానున్న జనాభా గణనలో కులగణను చేర్చాలని నిర్ణయించింది. కులగణన చుట్టూనే ఉన్న రాజకీయ చర్చపై కేబినెట్‌లో చర్చజరిగింది. ఇండియా కూటమి ఈ కులగణను రాజకీయ సాధనంగా ఉపయోగించుకోడానికి ప్రయత్నిస్తోందని కూడా ప్రస్తావనకు వచ్చింది. కేబినెట్ వివరాలను కేంద్ర సమాచారమంత్రి అశ్వినివైష్ణవ్ మీడియాకు వివరించారు. కాంగ్రెస్ ఇండియా కూటమి భాగస్వాములు కులగణను రాజకీయ అస్త్రంగా మాత్రమే ఉపయోగిస్తున్నారని విమర్శించారు. ఇలాంటి సర్వేలు సమాజంలో పలు సందేహాలను లేవనెత్తాయని సామాజిక నిర్మాణం రాజకీయాల వల్ల చెదిరిపోకుం డాచూసుకోడానికి సర్వేలకు బదులుగా కులగణను జనాభా గణనలో >>2



# కులగణనకు కాంగ్రెస్ మద్దతు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్ ఏప్రిల్30:** దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయిస్తే, కాంగ్రెస్ పార్టీ సంపూర్ణంగా సహకరిస్తుందని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ఈ కీలక ప్రక్రియను ఎప్పటిలోగా పూర్తి చేస్తారో నిర్దిష్ట కాలపరిమితిని కేంద్రం ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. కులగణన చేపట్టాలనే ఆలోచన తమ పార్టీ దార్శనికతే అని, ఒత్తిడి కారణంగానే కేంద్రం ఈ దిశగా అడుగులు వేస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. బుధవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, కులగణన సమానత్వాన్ని సాధించే దిశగా వేసే మొదటి అడుగు అని అభిప్రాయపడ్డారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతోనే ఇది >>2

# ఢిల్లీ ఆప్ సర్కార్‌లో రూ. 2 వేల కోట్ల కుంభకోణం

## సిసోడియా, జైన్‌లపై మరోకేసు




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 30:** ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు, మాజీ మంత్రులు మనీశ్ సిసోడియా, సత్యేందర్ జైన్‌లకు మరో అవినీతి కేసు చుట్టుకుంది. ఢిల్లీవ్యాప్తంగా ఆప్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పాఠశాలలు, క్లాస్ రూంల నిర్మాణంలో భారీ కుంభకోణం జరిగిందని అవినీతి నిరోధకశాఖ (ఏసీబీ) ఆరోపించింది. ఆప్ హయాంలో మొత్తంగా 12 వేల స్కూళ్లు, క్లాస్ రూంల నిర్మాణం చేపట్టగా అందులో రూ.2 వేల కోట్ల అవినీతి జరిగిందని తేల్చింది. దీనిపై నాటి ఉప ముఖ్యమంత్రి, ఆప్ సీనియర్ నేత మనీశ్ సిసోడియా, మాజీ మంత్రి సత్యేంద్ర జైన్ లపై కేసు నమోదు చేసింది. ఆప్ ప్రభుత్వంలో మనీశ్ సిసోడియా ఉప ముఖ్యమంత్రిగా వ్యవహరించడంతో పాటు విద్యాశాఖ బాధ్య >>2

# సింహాచలం మృతుల కుటుంబాలు రూ. 25 లక్షల పరిహారం

## విచారణకు ముగ్గురితో కమిటీ

## మూడు రోజుల్లో నివేదిక

## సిఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్



**విజయవాడ,ఏప్రిల్30,ప్రభాతవార్తప్రతినిధి:** సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి చందనోత్సవంలో గోడ కూలి ఏడుగురు భక్తులు మృతి చెందడంపై సిఎం చంద్రబాబు తీవ్రదిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను కలచివేసిందన్నారు. భారీ వర్షాలతో గోడ కూలడంతో ఈ ప్రమాదం జరిగిందని చెప్పారు. మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మరోవైపు ఈ ఘటనలో మరణించిన వారి కుటుంబాలను పరామర్శించేందుకు ముఖ్యమంత్రి కెజిహెచ్‌కు వచ్చే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ మేరకు పోలీసులు భద్రత ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. సింహాచలం ప్రమాదంపై ఉన్నతాధికారులు, మంత్రులతో సిఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో మంత్రులు ఆనం రామ నారాయణరెడ్డి, డిబివి స్వామి, అనిత, అనగాని సత్యప్రసాద్, ఎంపీ భరత్, అశోక్ గజపతిరాజు పాల్గొన్నారు. ఘటనకు గల కారణాలు, క్షేత్రస్థాయిలో అందుతున్న సాయం తదితర అంశాలపై అధికారులు ఆయనకు వివరించారు. ఈ క్రమంలోనే మృతుల కుటుంబాలకు రూ.25లక్షలు, గాయపడిన వారికి రూ.3లక్షల చొప్పున పరిహారం అందజేయాలని చంద్రబాబు ఆదేశించారు. బాధిత కుటుంబ సభ్యులకు దేవాదాయశాఖ పరిధిలోని ఆలయాల్లో అవుట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగ అవకాశం కల్పించాలని చెప్పారు. గోడ కూలిన ఘటనపై ముగ్గురు సభ్యుల కమిటీతో విచారణకు సిఎం ఆదేశించారు. సింహాచలం ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఉండవల్లిలోని నివాసంలో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు డిజిపి, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఘటన జరిగిన తీరు, బాధితులకు సాయంపై సిఎంకు అధికారులు వివరించారు. దీనిపై విచారణకు ముగ్గురు ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటుకు చంద్రబాబు ఆదేశించారు. ఇందులో పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్, ఈగల్ చీఫ్ ఆకే రవి కృష్ణ ఇరిగేషన్ శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ వెంకటేశ్వర రావు ఉన్నారు. 72 గంటల్లో ప్రాథమిక నివేదిక ఇవ్వాలని కమిటీకి ముఖ్యమంత్రి ఆదేశాలిచ్చారు. ఈ ఘటనలో గాయాలైన వారికి అత్యవసర వైద్యసేవలు అందించాల్సిందిగా >>2

# నటి జిత్వానీ కేసులో ఐపిఎస్‌లకు సిట్ నోటీసులు

**విజయవాడ, ఏప్రిల్30, ప్రభాతవార్త ప్రతినిధి:** ముంబాయి నటి జిత్వాని కేసులో ఐపిఎస్ అధికారులు కాంతి రాణా టాటా, విశాల్ గున్నిలకు సిఐడి నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో మే 5వ తేదీన జరిగే విచారణకు హాజరుకావాలని జారీ చేసిన నోటీసుల్లో సిఐడి స్పష్టం చేసింది. ఇంటెలిజెన్స్ మాజీ బాస్ పీఎస్ఆర్ ఆంజనేయులును సిఐడి విచారణలో చెప్పిన అంశాలపై ఈ ఇరువురు అధికారులను సిఐడి ప్రశ్నించనుంది. అయితే గతంలో విశాల్ గున్ని ఇచ్చిన స్టేట్‌మెంట్‌లోని అంశాలు నిజం కాదని పిఎస్ఆర్ ఆంజనేయులు చెప్పినట్లు సమాచారం.

ఇక గతంలో విశాల్ గున్నిని సిఐడి విచారించింది. ఈ సందర్భంగా జత్వానీ కేసులో తనను అప్పటి ఇంటెలిజెన్స్ హెడ్‌గా ఉన్న పిఎస్ఆర్ ఆంజనేయులు పిలిస్తేనే తాను వెళ్లానని తెలిపారు. అందులోభాగంగానే నటి జిత్వానీని ముంబై నుంచి అరెస్ట్ చేసి తీసుకురావాలనే టాస్క్‌ను తనకు ఆయన అప్పగించారని చెప్పారు. మరోవైపు విశాల్ గున్నీతో తాను నిఘాకు సంబంధించి అంశాలు మాత్రమే మాట్లాడి ఉంటానని సిఐడి విచారణలో పిఎస్ఆర్ ఆంజనేయులు పేర్కొన్నారు. అలాగే తాను ఈ అంశంపై కాంతి రాణాతో సైతం మాట్లాడలేదని ఈ విచారణలో అధికారుల ఎదుటస్పష్టంచేశారు. ఈకేసులో గతంలో >>2



# మే 19న పిఎస్ఎల్‌వి-సి61 రాకెట్ ప్రయోగం

**శ్రీహరికోట (తడ), ఏప్రిల్ 30 ప్రభాతవార్త:** శ్రీహరికోట నుంచి మే 19న పిఎస్ఎల్‌వి-సి61 రాకెట్‌ను ప్రయోగించడానికి ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. ఈ రాకెట్ ద్వారా ఈఓఎస్-09 (ఆర్ఐఎస్ఎ శాట్-1బి) ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి ప్రవేశపెట్టనున్నారు. 2022లో రీశాట్-1ఎ ప్రయోగించి ఉన్నారు. ఈ >>2

# జాతీయ భద్రతా సలహాబోర్డు పునరుద్ధరణ



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 30:** పహల్గామ్ దాడితో భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలు కొనసాతున్న వేళ జాతీయ భద్రతా సలహా బోర్డును కేంద్రం పునరుద్ధరించింది. బోర్డు ఛైర్మన్‌గా రీసెర్చి అనాలిసిస్ వింగ్ మాజీ చీఫ్ అలోక్ జోషిని నియమించింది. ఏడుగురు సభ్యులతో ఏర్పాటు చేసిన ఈ బోర్డులో విశ్రాంత మిలిటరీ, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు ఉన్నారు. బోర్డు సభ్యులుగా శిలీ సిన్హా, తిరీ సింగ్, మోంటీ ఖన్నా, మాజీ ఐఎఎస్‌లు రాజీవ్ రంజన్ వర్మ, మన్మోహన్ సింగ్, మాజీ ఐఎఫ్ఎస్ అధికారి బి. వెంకటేశ్ వర్మలకు చోటు కల్పించింది. మరోవైపు పహల్గాం ఉగ్రవాద దాడి తరువాత ప్రధాని నరేంద్ర మోదీ నివాసంలో బుధవారం కేబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ(సిసిఎస్), రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సిసిపిఎ), ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సిసిఇఎ) సమావేశాలు జరిగాయి.

పాక్‌తో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో మోదీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాల్లో రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్, హోంమంత్రి అమిత్ షా, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తదితరులు పాల్గొన్నట్లు తెలుస్తోంది. భారత పర్యటకులపై పహల్గాంలో ముష్కరులు రెచ్చిపోయిన తర్వాత రెండోసారి కేబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ >>2

# నెల్లూరు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

## ఆరుగురు మృతి

## ధ్వంసమైన కారు, ఇల్లు



ప్రమాదంలో ధ్వంసమైన కారు

**కోవూరు (నెల్లూరు), ఏప్రిల్ 30, ప్రభాతవార్త :** అప్పటిదాకా ఓ ఫంక్షన్‌లో ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపిన మెడికో విద్యార్థులు గంట లోపల మృత్యువాత పడిన సంఘటన పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. కోవూరు సిఐ వి. సుధాకర్‌రెడ్డి సమాచారం మేరకు నెల్లూరులోని మెడికల్ కళాశాలకుచెందిన >>2

# ప్రధాని మోడీ పర్యటనకు ట్రాఫిక్ మళ్లింపు

**విజయవాడ,ఏప్రిల్30,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని పునర్నిర్మాణ పనుల శంకుస్థాపకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అమరావతికి వస్తున్న నేపథ్యంలో మే 2న ఉదయం 5 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు ట్రాఫిక్ మళ్ళింపులు ఉంటాయని డిజిపి హరీష్‌కుమార్ గుప్తా తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రధాని పర్యటన,బహిరంగ సభ కార్యక్రమం సజావుగా సాగేందుకు,జాతీయ,రాష్ట్ర రహదారులపై ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు వీలుగా ఈ చర్యలు చేపట్టాం.వాహనదారులు,ప్రయాణీకులు వీటిని గమనించి సహకరించాలని కోరారు

**వాహనాలు వెళ్ళాల్సిన మార్గాలు**

- చెన్నై నుండి విశాఖకు విజయవాడ మీదుగా వెళ్లే వాహనాలు,ఇబ్రహీంపట్నం,నందిగామ వైపుకు వెళ్లే భారీ సరకు రవాణా వాహనాలను ప్రకాశం జిల్లా త్రోవగుంట వద్ద నుంచి చీరాల బాపట్ల- రేపల్లె- అవనిగడ్డ- పామర్రు-గుడివాడ-హనుమాన్‌జంక్షన్ మీదుగా మళ్ళిస్తారు. విశాఖపట్నం నుండి చెన్నై వైపునకు వెళ్ళే వాహనాలూ ఇదే మార్గం మీదుగా వెళ్లాల్సి ఉంటుంది.
- చిలకలూరిపేట వైపు నుండి విశాఖపట్నం వైపు వెళ్లే వాహనలను చిలకలూరిపేట నుండి ఎన్‌హెచ్-16 మీదుగా పెదనందిపాడు, కాకుమాను, పొన్నూరు, చందోలు, చెరుకుపల్లి, భట్టిప్రోలు, పెనుమూడి వంతెన,అవనిగడ్డ,పామర్రు,గుడివాడ,హనుమాన్‌జంక్షన్ గుండా మళ్ళిస్తారు.
- చెన్నై నుండి విశాఖపట్నం వైపు వెళ్ళే వాహనాలను బోయపాలెం క్రాస్ నుండి ఉన్నవ, ఏబిపాలెం, వల్లూరు, పాండ్రపాడు, పొన్నూరు, చందోలు, చెరుకుపల్లి, భట్టిప్రోలు, >>2

# కల్తీ నెయ్యి కేసు

## 'సిట్' అదుపులో టిటిడి ఉద్యోగులు

**తిరుపతి,ఏప్రిల్ 30ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డూల తయారీకి కల్తీనెయ్యి సరఫరా చేసిన కేసులో అరెస్టయి సిబిఐ సిట్ అధికారుల కస్టడీలో విచారణ ముగిసిన ఇద్దరు నిందితుల బెయిల్ పిటిషన్ న్యాయమూర్తి తిరస్కరించారు. ఈ కేసులో విచారణ త్వరగా చేపట్టేందుకు నిందితుల నుండి వివరాలు సేకరించడంలో భాగంగా నిందితులకు బెయిల్ పై న్యాయస్థానం కూలంకుషంగా నిర్ణయం తీసుకుంటోంది. బోలేబాబా డెయిరీ జిఎం హరి మోహన్, ఆశిష్ అగర్వాల్ ఇద్దరూ సిట్ కస్టడీ ముగియడంతో కోర్టులో హాజరు పరిచారు. న్యాయమూర్తిమళ్లీ రిమాండ్‌కు >>2



# షర్మిల గృహ నిర్బంధం

## ఉద్దండరాయునిపాలెం వెళతానని పట్టు

**విజయవాడ,ఏప్రిల్30,ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపిసిసి చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి హౌస్ అరెస్ట్ అయ్యారు. ఉద్దండరాయుని పాలెంలో బుధవారం షర్మిల పర్యటించాలని నిర్ణయించారు. ఈ క్రమంలోనే ఎపిసిసి చీఫ్ నివాసం వద్ద భారీగా పోలీసులు మోహరించారు. 2015లో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఉద్దండరాయుని పాలెంలో శంకుస్థాపనచేశారు. ఈ క్రమంలో ఈ ప్రాంతంలో పర్యటించాలని షర్మిల నిర్ణయించారు.. అందుకు పోలీసులు ఆంక్షలు విధించారు. ఉద్దండరాయునిపాలెంలో పర్యటనకు అనుమతి లేదంటూ షర్మిల ఇంటి వద్ద పోలీసులు మోహరించారు. ఆ ప్రాంతానికి వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకున్నారు. షర్మిల ఇంట్లో నుంచి బయటకు రాకుండా ఆమె నివాసం వద్ద పోలీసులు >>2



# వేసవిలో విఐపి దర్శనాలు పూర్తిగా రద్దు!

## నేటినుండి ప్రోటోకాల్ విఐపిలకే ఉదయం బ్రేక్ దర్శనాలు

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** సాధారణ రోజుల్లోనే రోజుకు లక్షమంది వరకు భక్తులు తిరుమలకు వస్తుండటం.. మహాలఘువిధానంలోనే సరాసరి 70వేలమంది భక్తులకు ఏడుకొండల వేంకటేశ్వర స్వామి దర్శనం చేయించడం జరుగుతోంది. ఇప్పుడు దేశవ్యాప్తంగా వేసవిసెలవులు ఆరంభం కావడంతో ఈ రద్దీ మరింతగా పెరిగే అవకాశం ఉంది. సామాన్యభక్తులు గంటలతరబడి వైకుంఠమ్ కంపార్టుమెంట్లలో, వెలుపలక్యూలైన్లలో వేచివుండకుండా టిటిడి అధికారులు నూతన విధానాలు అమలుచేసేందుకు సిద్ధమయ్యారు. సామాన్య భక్తులే భగవంతునికి ప్రధానంగా చేరువచేయడానికి వీలైనంత త్వరగా ఆ దేవుని దర్శనం చేయించేలా కార్యాచరణ రూపొందించి >>2



చార్‌థామ్ యాత్రలో భాగంగా బుధవారం ఉత్తరాఖండ్‌లోని గంగోత్రి ఆలయం తెరుచుకోవడంతో తరలి వచ్చిన భక్తజన సందోహం

# చందనోత్సవంలో అపశ్రుతి

>> వాసి. ప్రస్తుతం సీతమ్మదారలో ఇంటీరియర్ డిజైన్ షాపు ఉంది కుంపట్ల మణికంత ఈశ్వర శేషారావు,పత్తి దుర్గా స్వామినాయుడు స్నేహితులు ఇద్దరూ కలిసి మంగళవారం సింహాచలం సింహాద్రి అప్పన్న చందనోత్స వం కార్యక్రమానికి హాజ రయ్యారు అర్ధరాత్రి కురిసిన వర్షానికి గోడ కూలి ఇద్దరూ కూడా ప్రాణాలు వదిలారు. దీంతో కొర్లపాటివారిపాలెంలో విషాదఛాయలు అలుము కున్నాయి. ఇక మృతుల కుటంబాలు కెజిహెచ్ దగ్గర ఆందోళన చేపట్టారు మృతుల కుటుంబాలకు రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు లేదంటే పోస్టుమార్టాన్ని అడ్డుకుంటా మని ఆందోళన చేపట్టారు.

**కోనసీమ జిల్లా వాసులు ఇద్దరు మృతి**

సింహాద్రి అప్పన్న చందనోత్స వంలో భారీ వర్షానికి గోడ కూలిన ఘటనలో ఇద్దరు అంబేద్కర్ నగర్ కోనసీమ వాసులు మృతి చెందారు. ఈ ప్రమాదంలో అంబాజీపేట కొర్లపాటి వారి పాలెంకు చెందిన కుంపట్ల మణికంత ఈశ్వర శేషారావు (26), పత్తి దుర్గాస్వామి నాయుడు (33) మృతి చెందారు. అంబాజీపేటలో తీవ్ర విషాదం నెలకొంది. మృతుడు పత్తి దుర్గా స్వామి నాయుడు జనసేన నాయకుడు పత్తి దత్తుడు చిన్న కుమారుడుగా గుర్తమచారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## సింహాచలం ఘటనలో ఐటీ ఉద్యోగులైన దంపతుల దుర్మరణం

### మృతులు మధురవాడ చంద్రంపాలెం వాసులు



మృతిచెందిన ఉమామహేశ్వర రావు, శైలజ (ఫైల్)

**విశాఖపట్నం, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:** సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ పరిసరాల్లో ఈ తెల్లవారుజామున జరిగిన గోడ కూలిన దుర్ఘటనలో విశాఖపట్నానికి చెందిన నవ దంపతులు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాద ఘటన స్థానికంగా తీవ్ర విచారాన్ని నింపింది. మృతులను విశాఖపట్నం మధురవాడ సమీపంలోని చంద్రంపాలెం గ్రామానికి చెందిన పిళ్లా ఉమా మహేశ్వరరావు (30), ఆయన భార్య శైలజ (26)గా అధికారులు గుర్తించారు. అధికారులు అందించిన వివరాల ప్రకారం, ఉమా మహేశ్వరరావు, శైలజ ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా హైదరాబాద్ లోని వేర్వేరు సంస్థల్లో పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఇద్దరూ ఇంటి నుంచే (వర్క్ ఫ్రమ్ హోం) విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. స్వామివారి దర్శనం కోసం తెల్లవారుజామున 2 గంటల సమయంలో రూ. 300 ప్రత్యేక దర్శనం క్యూలైన్‌లో వీరు వేచి ఉన్నారు. అదే సమయంలో అక్కడున్న ఒక గోడ ఒక్కసారిగా కూలి వారిపై పడటంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందారు. ఉమామహేశ్వరరావు, శైలజ దంపతులు ఎంతో అన్యోన్యంగా ఉండేవారని, అందరితో కలివిడిగా మెలిగేవారని స్థానికులు, బంధువులు చెబుతున్నారు. ఉన్నత చదువులు చదివి, మంచి ఉద్యోగాలు చేస్తూ స్థిరపడుతున్న సమయంలో ఇలా అర్ధాంతరంగా తనువు చాలించడం వారి కుటుంబ సభ్యులను, బంధుమిత్రులను తీవ్ర విషాదంలో ముంచెత్తింది. వారి స్వగ్రామమైన చంద్రంపాలెంలో విషాదఛాయలు అలుముకు న్నాయి. ఈ దురదృష్టకర సంఘటనపై పలువురు విచారం వ్యక్తం చేస్తున్నారు.

# రూ. 25 లక్షల పరిహారం

>> అధికారులను ఆదేశించారు. నూతనంగా నిర్మించిన గోడ వర్షానికి తడిసి కూలిన అంశంలో నిర్మాణ లోపాలనున్నాయనే విషయంలోను విచారణ జరగాలన్నారు.ఈ విషయాన్ని రాజకీయం చేయడానికి కొందరు చేసే ప్రకటనలకు తగినరీతిలో జవాబు ఇవ్వాలన్నారు.ఆలయానికి సంబంధించి ఇతరంశాలను తెలుసుకో వాలన్నారు. ఘటన గురించి తెలిసిన వెంటనే సిఎం చంద్రబాబు జిల్లా అధికారులు, మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, డోలా బాల వీరాంజనేయ స్వామి, అనిత, అనగాని సత్యప్రసాద్, ఎంపీ భరత్, సింహాచల దేవాలయ ధర్మకర్త అశోక్ గజపతి రాజుతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి, ఘటన జరిగిన తీరు, క్షతగాత్రులకు అందుతున్న వైద్య సాయం వివరాలు తెలుసుకున్నారు. గోడ కూలిన ఘటనపై ముగ్గురు సభ్యుల కమిటీతో విచారణకు ఆదేశించారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపిన సిఎం చంద్రబాబు, చనిపోయిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. బాధిత కుటుంబ సభ్యులకు దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో అవుట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. అలాగే, గాయపడిన వారికి రూ.3 లక్షల సాయం ఇవ్వాలని నిర్ణయించారు. బాధితకుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని సిఎం అన్నారు.

## రాకెట్ ప్రయోగం

>> రాడార్ ఇమేజింగ్ శాటిలైట్‌ను భూమిని.. ముఖ్యంగా దేశాల సరిహద్దులను జల్లెడ పట్టే సామర్థ్యం కలిగి ఉంది. ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న కొన్ని సమస్యలను ఈ ఉపగ్రహ ప్రయోగాలు ఉపయోగపడతాయని నమ్ముతున్నారు. శ్రీహరికోటలో చాలారోజులు తర్వాత రాకెట్ ప్రయోగానికి ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. పిఎస్ఎల్‌వి-సి61 ప్రయోగం తర్వాతే ఇస్రో, నాసాల సంయుక్త ఉపగ్రహం నిసార్ ప్రయోగం ఉంటుంది.

## సిట్ నోటీసులు

>> కాంతిరాణా, విశాల్ గన్నీలను సిఐడి అధికారులు విచారించారు. ఈ సందర్భంగా ఆ అధికారులు.. తాజాగా పిఎస్ఆర్ ఆంజనే యులును విచారించారు. ఈ సందర్భంగా ఈ ఇద్దరు చెప్పిన సమాధానాలకు, పీఎస్ఆర్ ఆంజనేయులు చెప్పిన జవాబులకు ఎక్కడ పొంతన కుదరడం లేదని సిఐడి అధికారులు భావించారు. ఈ నేపథ్యంలో ఈ ఇరువురు అధికారులను మళ్లీ పిలిచి విచారించాలని వారు నిర్ణయించారు. దీంతో వారికి మరోసారి నోటీసులు జారీ చేశారు.

## షర్మిల గృహ నిర్బంధం

>> బారికేడ్లను ఏర్పాటు చేశారు. పోలీసుల తీరుపై ఎపిసిసి చీఫ్ షర్మిల ఒక ప్రకటనలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. ఎలాగైన ఉద్దండరాయుని పాలెం వెళ్లి తీరుతానని షర్మిల స్పష్టం చేశారు. ఈ క్రమంలో షర్మిల నివాసం వద్ద హైటెన్షన్ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా షర్మిల మాట్లా డుతూ.. ఒక మహిళ మీద, అది కూడా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలిపై పోలీసులు జులం జరిగిందన్నారు. దీనికి చంద్రబాబు, హోం మంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తనను ఎందుకు హౌస్ అరెస్టు చేస్తున్నారో సమాధానం ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ పక్షాన కమిటీ వేసుకుని రాజధానిపై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామన్నారు. అక్కడ పరిస్థితులు పరిశీలనకు కమిటీ వేసుకుంటే ప్రభుత్వం ఎందుకు అడ్డుకుంటుందని అడి గారు. కాంగ్రెస్ పార్టీ తరపున తాము అడిగే ప్రశ్నలు, చేయాల్సిన కార్యక్రమాలు ఉన్నా యని తెలిపారు. అమరావతి క్యాపిటల్ కమిటి 28న వేస్తే... మీకెందుకు అంత భయం. అక్కడ ఏం దాయాలని చూస్తున్నారో ప్రభుత్వ పెద్దలు చెప్పాలి. మోడీ అమరావతి పర్యటనపై మా యాక్షన్ ప్లాన్ కోసం పార్టీ ఆఫీస్‌లో మీటింగ్ పెట్టాం. అక్కడకు వెళుతుంటే నన్ను అడ్డుకుంటున్నారు. రేపు మోడీ పర్యటనపై కాంగ్రెస్ యాక్షన్ ప్లాన్ ఉంటుంది. మన ఏపీలో ప్రజా సమస్యలపై మాట్లాడకూడదా. మీటింగ్‌లు పెడితేనే అడ్డుకుని, అరెస్టు చేస్తారా. ఇదేనా మీ కూటమి వైఖరినా పోలీసు వ్యాన్లలో పోలీసులను భారీగా దించారు. నా వల్లే లా అండ్ ఆర్డర్ సమస్య వస్తుందా. కమిటి వేస్తేనే అరెస్టు అంటే.. ఆందోళన చేస్తే మమ్మలను చంపేస్తారేమో. పోలీసులు కూడా చట్టబద్ధంగా పనిచేయండి. నా మీద చేయి కూడా వేశారు.. ఇది కరెక్ట్ విధానమా. ప్రజా స్వామ్యంలో పోరాటం చేసే హక్కు మాకు ఉంది. పోలీసులు ఆడవాళ్లను రక్షించడంలో దృష్టి పెట్టండి. నన్ను అడ్డుకుని... బయటకి రావద్దంటారా. ప్రభుత్వం, పోలీసులు మా హక్కులను కాల రాస్తే చూస్తూ ఊరుకోం. అరెస్టులతో మా పోరాటాలను ఆపలేరు, అడ్డుకోలేర్తు అంటూ షర్మిల స్పష్టం చేశారు.

# నెల్లూరు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

>> ద్వితీయ సంవత్సరం మెడికో విద్యార్థులు రెండు కార్లలో బుధవారం తమ సహచర విద్యార్థి అక్క నిశ్చితార్థ కార్యక్రమానికి బుచ్చిరెడ్డిపాలెంకు వెళ్లారు. తీరా అక్కడ కార్యక్రమాన్ని చూసుకుని తిరుగు ప్రయాణంలో రెండు కార్లు బయలుదేరాయి. ఈ నేపథ్యంలో ముందుకు ప్రయాణిస్తున్న కారులో సంగం మండలం సిద్ధిపురం గ్రామానికి చెందిన జి.జీవన్ చంద్రారెడ్డి(20) కారు డ్రైవింగ్ చేస్తుండగా.. అనంతరం గ్రామానికి చెందిన కె.అభిషేక్ రాజు(20), ధర్మవరంకు చెందిన ఎల్.నరేష్ నాయక్(20), తిరుపతికి చెందిన జి.అభిషీ పురుషోత్తం (20), ప్రకాశం జిల్లాకు చెందిన జి.యగ్నేష్(20), కడపకు చెందిన నవనీత్ శంకర్‌లు ప్రయాణిస్తున్నారు. వెనుక వస్తున్న కారులో మరో 5 మంది మెడికో విద్యార్థులు ఉన్నారు. పోతిరెడ్డిపాలెం గంగవరం కాలువ దగ్గరకు వచ్చే సరికి వీరు ప్రయాణిస్తున్న కారు మితిమీరిన వేగంతో ఉంది. ఈ నేపథ్యంలో అదుపు తప్పిన ఈ కారు రోడ్డు పక్కనే వ్యాపారం చేసుకుంటున్న వెంకటరమణయ్య షాపును అతివేగంగా ఢీకొంది. ఈ సంఘటనలో షాపు ముందు భాగం పూర్తిగా ధ్వంసం కాగా ఆ ప్రాంతంలో ఉన్న ఫ్రిజ్ అక్కడ నుంచి దూరంగా పడిపో యింది. ఈ సంఘటనలో షాపులో కూర్చుని ఉన్న వెంకటరమణయ్య (55) తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. ఈ నేపథ్యంలో వెనుక వస్తున్న కారులో వారు ప్రమాదంలో గాయపడిన ఆరు మందిని తమ కారులో తీసుకుని హుటాహుటిన నెల్లూరుకు బయలుదేరారు. వీరిలో జీవన్ చంద్రారెడ్డి, అభిషేక్ రాజు నెల్లూరులోని ఒక ఆస్పత్రిలో మృతిచెందగా.. నరేష్ నాయక్, అభిషీ, యగ్నేష్‌లు తీవ్రగాయాలపాలై మరో ఆస్పత్రిలో మృతిచెందారు. వీరిలో కడపకు చెందిన నవనీత్‌శంకర్ తీవ్రగాయాల పాలై ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. రమణయ్య మృతదేహం నెల్లూరులోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఉంది.

**సంఘటనా స్థలంలో..**

ప్రమాదం జరిగిన తీరు తెలుసుకున్న కోవూరు సీఐ వి. సుధాకర్‌రెడ్డి హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ మేరకు ట్రాఫిక్‌కు అంతరాయంగా ఉన్న కారును పక్కకు తరలించేలా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదానికి గల కారణాలను పరిశీలిస్తున్నామని, అసలు జాతీయ రహదారిలో మితిమీరిన వేగంతో ప్రయాణించడం ఎప్పటికైనా ప్రమాదమేనని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలిస్తే కారు అతివేగంగా ప్రయాణిస్తున్నట్లు తెలుస్తుందన్నారు. కారు ముందు సీట్‌లో ఉన్న ఎయిర్ బ్యాగ్ సైతం ధ్వసం కావడం ఈ వేగానికి నిదర్శనమన్నారు. ఈ మేరకు సంఘటనా స్థలంలో ఏఎస్సై సత్యనారాయణ, హెడ్ కానిస్టేబుల్ సతీష్, కానిస్టేబుల్స్ వేణు, రమేష్‌లు ట్రాఫిక్‌ను క్రమబద్ధీ కరించేలా చర్యలు చేపట్టారు.

# విఐపి దర్శనాలు పూర్తిగా రద్దు!

>> నేటి నుండి జులై 15వరకు నిరంతరాయంగా అమలుచేయనున్నారు. ఇందుకు అవసరమైన అన్ని ప్రణాళికలను టిటిడి ధర్మకర్తలమండలి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ శ్యామలరావు, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి, ఆలయ వర్గాలు అమలుచేసేందుకు నిర్ణయించారు. గురువారం ఉదయం నుండి పూర్తిగా సిఫార్సు లేఖలపై విఐపి బ్రేక్ దర్శనాలు, ఇతర ఆర్జిత సేవలు, ప్రత్యేక దర్శనాలను పూర్తిగా రద్దుచేశారు. రానున్న రెండున్నర నెలరోజులు ప్రోటోకాల్ పరిధిలోని విఐపిలకే స్వయంగా వస్తేనే బ్రేక్ దర్శనాలు కల్పించేలా నిర్ణయించి అమలుచేయనున్నారు. సామాన్యభక్తులకే ఏడుకొండల వెంకన్న దర్శనం చేయించాలనే ఆలోచనతో నూతన విధానం అమలుకు శ్రీకారం చుడుతున్నారు. గతంలో వేసవిసెలవుల్లో కేవలం వారాంతంలో శుక్ర, శని, ఆదివారాల్లో మాత్రమే సిఫార్సు లేఖలు రద్దుచేసేవారు. అయితే అందుకు భిన్నంగా ప్రస్తుత టిటిడి అధికారులు మంచి నిర్ణయంతో ముందుకు కదిలారు.

**నేటినుండి పూర్తిగా సిఫార్సులు రద్దు:**

వేసవిసెలవుల్లో ఇష్టదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం వస్తున్న భక్తుల రద్దీ అనూహ్యంగా పెరగడంతో విఐపి బ్రేక్ దర్శనాలను టిటిడి పూర్తిగా రద్దుచేసింది. మేనెల 1వతేదీ నుండి జులై 15వతేదీ వరకు పూర్తిగా సిఫార్సు లేఖలపై విఐపి బ్రేక్ దర్శనాలు రద్దుచేయడమేగాక ఇందుకు సహక రించాలని ప్రముఖులకు, ప్రజాప్రతినిధులకు చివరకు ట్రస్టుబోర్డు సభ్యులకు విజ్ఞప్తి చేశారు. టిటిడి అధికారుల వినూత్న నిర్ణయాన్ని బోర్డు కూడా స్వాగతి స్తోంది. ప్రస్తుతం ఉదయం 8గంటల నుండి ఏకంగా మధ్యాహ్నం 1గంట వరకు పూర్తిగా విఐపి బ్రేక్‌దర్శనాలకే సమయం సరిపోతోంది, దీనివల్ల సామాన్య భక్తులు కంపార్టుమెంట్లలో గంటల తరబడి వేచివుండి ఇబ్బంది పడుతున్నారు. ఆలయంలో పూర్తిగా మహాలఘు విధానం అమలుచేస్తున్నారు. గంటకు 4,500మంది భక్తులకు దర్శనం చేయిస్తున్నా 70వేలమందికి మించి దర్శనాలు చేయించలేని పరిస్థితి. ఇందుకు విఐపి బ్రేక్ దర్శనాలు, సిఫార్సులు రద్దుతో ఆ సమయం పూర్తిగా సామాన్యభక్తులకే కేటాయించనున్నారు. తిరుమలలో భక్తుల రద్దీ అనూహ్యంగా పెరగడంతో సామాన్యభక్తులు టైమ్‌స్లాట్ దర్శనాలకు వచ్చే వారు టోకెన్‌పై నిర్దేశించిన సమాయనికి వైకుంఠం క్యూలైన్లోకి ప్రవేశించాలని టిటిడి పేర్కొంది. వేసవిరద్దీతో క్యూలైన్లలో ప్రవేశించే అన్ని దర్శనాల టిక్కెట్లు, టోకెన్లు కలిగిన భక్తులకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నారు. ముందుగా వచ్చి తిరుమలలో ఇబ్బంది పడవద్దని, సమయానికి వచ్చి క్యూలైన్లో ప్రవేశిస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవని ప్రచారంచేస్తున్నారు. క్యూలైన్లలో భక్తులకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారు.



గురుగ్రాంలో బుధవారం ఐసిఎస్ఇ పదో తరగతి ఐఎస్‌సి పన్నెండో తరగతి పరీక్ష ఫలితాలు విడుదల కాండంతో విద్యార్థుల కోలాహలం

# రూ. 2 వేల కోట్ల కుంభకోణం

>> తలు కూడా నిర్వర్తించారు. సత్యేందర్ జైన్ ప్రజాపనులశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. ఆప్ హయాంలో మొత్తంగా 12,748 క్లాస్ రూంలు నిర్మించారు. ఈ పనులకు సంబంధించిన కాంట్రాక్టులు దక్కించుకున్న వారిలో ఎక్కువ మంది ఆమ్ ఆద్మీ పార్టీతో సంబంధం ఉన్న వారేనని ఏసీబీ ఆరోపించింది. నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయలేదని, దాంతో కాంట్రాక్ట్ వ్యయం ఏకంగా ఐదు రెట్లు పెరిగిందని పేర్కొంది. ఈ నిర్మాణ పనుల్లో అక్రమాలు జరిగాయని సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ కూడా నివేదిక ఇచ్చిందని, అయితే, ఆ నివేదికను ఆప్ సర్కారు దాదాపు మూడేళ్ల పాటు తొక్కిపెట్టిందని ఆరోపించింది. క్లాస్ రూం నిర్మాణ వ్యయం దాదాపుగా ఐదు రెట్లు పెరగడంపై బీజేపీ నేతల ఫిర్యాదుతో ఈ వివరాలు వెలుగులోకి వచ్చాయని సమాచారం. ఢిల్లీ ప్రభుత్వంలో కీలక శాఖలను నిర్వహించిన వీరిద్దరూ గత కొంతకాలంగా పలు ఆరోపణలపై చట్టపరమైన చర్యలను ఎదుర్కొంటున్నారు. ఢిల్లీ మద్యం పాలసీకి సంబంధించిన కేసులో సిసోడియా, మనీ లాండరింగ్ ఆరోపణలపై సత్యేందర్ జైన్ లు జైలుకు వెళ్లి వచ్చారు. ప్రస్తుతం ఈ ఇద్దరు నేతలు బెయిల్ పై బయట ఉన్నారు. ఈ పరిస్థితుల్లో వారిపై తాజా ఆరోపణలు, కేసు నమోదు కావడం ఆప్ వర్గాల్లో కలకలం రేపుతోంది.

# సలహాబోర్డు పునరుద్ధరణ

>> (సిసిఎస్) సమావేశం జరిగింది. అంతకుముందు ఏప్రిల్ 23న ఓసారి జరిగింది. జమ్ముకశ్మీర్‌లో విజయంతంగా ఎన్నికలు నిర్వ హించడం, అక్కడ అభివృద్ధి, ఆర్థిక వృద్ధి, స్థిరమైన పురోగతిని ఓర్వలేకే ముష్కరులు పహల్గాంలో రెచ్చిపోయారని అభిప్రాయపడ్డారు. ఆ తర్వాత పాకిస్థాన్ సీమాంతర ఉగ్రవాదానికి మద్దతు ఇస్తుందని, సింధూ జలాల ఒప్పందాల రద్దు సహా పలు కఠిన నిర్ణయాలు తీసుకున్నారు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో మంగళవారం కీలక భద్రత సమావేశం జరిగింది. ఈ మీటింగ్‌లో రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోబాల్, డిఫెన్స్ స్టాఫ్ చీఫ్ జనరల్ అనిల్ చౌహాన్‌తో పాటు త్రివిధ దళాల అధిపతులు పాల్గొన్నారు. ఈ క్రమంలో భారత సాయుధ దళాల సామర్థ్యంపై పూర్తి విశ్వాసం ఉందని ప్రధాని మోదీ తెలిపారు. ఉగ్రవాదాన్ని అణచివేసే విషయంలో సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నామని ప్రకటించారు.

# కులగణనకు కాంగ్రెస్ మద్దతు

>> విజయవంతమవుతుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని, అయితే దీని అమలుకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక, కాలపరిమితి అవసరమని నొక్కి చెప్పారు.ఇటీవల తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేను రాహుల్ గాంధీ ప్రస్తావించారు. దేశవ్యాప్తంగా చేపట్టే కులగణనకు తెలంగాణ సర్వే ఒక నమూనా లాంటిదని ఆయన అన్నారు. 'కులగణన అనేది సామాజిక న్యాయం దిశగా ఒక నూతన అభివృద్ధి నమూనా. ఇది మా దార్శనికతే. కేంద్రం దీనిని స్వీకరించడం స్వాగతించదగ్గ పరిణామం' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

# 'సిట్' అదుపులో టిటిడి ఉద్యోగులు

>> ఆదేశించడంతో నెల్లూరు కోర్టుకు తరలించారు.ఈ కేసులో టిటిడి మార్కెటింగ్ విభాగం ఉద్యోగులు నాగేందర్, శేఖర్‌లను సిట్ విచారణ చేసింది. వారి విచారణలో కల్తీనెయ్యి సరఫరాకు సంబంధించిన అంశాలు రాబట్టారనేది తెలుస్తోంది. తిరుమల లడ్డూ తయారీలో కీలకమైన ఆవునెయ్యి సరఫరాలో జంతువుల కొవ్వునూనె కలిపి, నాసిరకం నెయ్యి టిటిడికి అందించిన కేసులో ఇప్పటికే ప్రధాన ముద్దాయిలు ఆరుగురుతమిళనాడు ఏఆర్ డైరీ ఎండి రాజశేఖరన్, సరఫరా దారులు ఉత్తరప్రదేశ్‌కు, ఉత్తరాఖండ్ రూర్కే బోలేబాబా డైరీకి చెందిన అప్పటి డైరెక్టర్లు విపిన్‌జైన్, పోమిల్‌జైన్, వైష్ణవీడైరీ (పూనంబాక) సిఇఒ అపూర్వవినయ్‌కాంత్‌చావ్డా, ఆశిష్‌అగర్వాల్, హరిమోహన్‌లను సిబిఐ సిట్ అధికారులు అన్ని కోణాల్లో విచారణ చేసి సమాధానాలు రాబట్టారు. టిటిడికి నెయ్యి సరఫరాపేరుతో అడుగడుగునా గత మూడేళ్ళలో నిబంధనలు ఉల్లంఘించారనేది సిబిఐ అధికారులకు అందిన సమాచారం. తిరుపతిలోని భూదేవికాంప్లెక్స్‌లోని సిట్ కార్యాలయంలో మరింత లోతుగా టిటిడి ఉద్యోగు లను విచారణ చేస్తున్న సిట్ అధికారులు కీలక సమాచారం సేకరిస్తున్నారు.

**కల్తీనెయ్యి ఆధారాలతో నివేదికలు:**

తిరుమల వెంకన్న లడ్డూల తయారీకి గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వంలోని టిటిడి గత పాలకమండళ్ల ఛైర్మన్లు ఏకంగా నెయ్యి సరఫరాను ఇతర రాష్ట్రాలకు చెందిన డైరీలకు టెండర్లు కేటాయించడం, ఆ టెండర్లు మళ్లీ రెండవవ్యక్తి చేతులుమారడంతో కల్తీనెయ్యి సరఫరాజరిగింది. గత ఏడాది జూన్‌లో కల్తీ నెయ్యి బాగోతం వెలుగుచూడటం, ఇప్పుడు విచారణ 11నెలలు కావస్తుం డటంతో త్వరగా ముగించాలని తెలుస్తోంది. దాదాపు 10మంది టిటిడి ఉద్యోగుల ప్రమేయం ఉందనేది సిట్ తేల్చే పనిలో ఉంది.

తిరుమలకు లడ్డూల తయారీలో కల్తీనెయ్యి సరఫరా పాపంలో దోషులెవరనేది తేల్చే పనిలో ఢిల్లీనుండి, విశాఖపట్నం నుండి వచ్చిన నలుగురు సిబిఐ డిఎస్పీ స్థాయి అధికారులు,తిరుపతిలో జిల్లా అదనపు ఎస్పీతో కలసి సిట్ బృందం నిమగ్నమై ఆధారాలతో ముందుకు కదులుతున్నారు. గత పాలకమండళ్ళ కొనుగోలు కమిటీలో సభ్యులను, అధికారులను కూడా సిబిఐ విచారణ చేసి తదుపరి,వారందరికీ నోటీసులు జారీచేయనున్నారనేది సమాచారం.

## వారం - వర్జ్యం

తేది : 01-05-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, శుక్ల పక్షం
చవితి ఉ.11.28
మృగశిర మ.2.26
వర్జ్యం ఉ.10.18-11.49
దు.ఉ.9.58-10.49, 2) మ.3.03-3.54
శుభసమయం : ఉ.7.45-8.15
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం :** సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. ఆశ్చర్యకర విషయాలు తెలుసు కుంటారు. వస్తులాభం.

**వృషభం :** విద్యార్థులు కొత్త అవకాశాలు పొందుతారు. స్థిరాస్థి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి.

**మిథునం:** కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.

**కర్కాటకం :** ఉద్యోగాలలో మీదే పైచేయిగా వుంటుంది. బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారించుకుంటారు.

**సింహం:** నిరుద్యోగుల యత్నాలు ఫలించవు. ఆకస్మిక ప్రయాణాలలో తొందరపాటు వద్దు. వ్యయ ప్రయాసలు.

**కన్య :** వృత్తి, వ్యాపారాలలో తొందర పాటు వద్దు. ఉద్యోగాలలో కొత్త సమస్యలు ఎదురై చికాకులు పెడతాయి.

**తుల :** చేపట్టిన పనులలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తి చేస్తారు. గృహ నిర్మాణ ఆలోచనలు స్థిరంగా ఉండవు.

**వృశ్చికం:** కుటుంబ సభ్యులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారించుకుంటారు. ఉద్యోగాలలో కొన్ని చిక్కులు ఎదురవుతాయి.

**ధనుస్సు:** దూర ప్రాంతాల నుండి వచ్చిన వార్త కొంత ఊరట పొందుతారు. శ్రమకు ఫలితం కనిపించదు

**మకరం:** పనులలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తి చేస్తారు. కీలక నిర్ణయా లలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం.

**కుంభం:** వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ఆరోగ్యంపట్ల మెలుకువ అవసరం.

**మీనం:** ఉద్యోగాలలో వ్యతిరేక పరిస్థితులు ఏర్పడతాయి. యుక్తితో సమస్యల నుండి బయటపడతారు.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# జనగణనతో పాటే కులగణన

>> చేర్చాలని నిర్ణయించినట్లు ఆయన చెప్పారు.

జనాభాగణనలో ప్రతి వ్యక్తినుంచి డేటాను సేకరి స్తారని, అయితే సర్వేలో జనాభా నమూనా లేదా ఉపవిభాగాలనుంచి మాత్రమే డేటాను సేకరిస్తారని మంత్రి ఆరోపించారు. జనాభా, కులగణన అనేది కేంద్రం పరిధిలోనిది అయినాకూడా కొన్ని రాష్ట్రాలు సర్వేలపేరిటచేసి పారదర్శకత పాటించలేదని విమర్శించారు. భారత రాజ్యాంగంలోని 246 అధికరణం ప్రకారం జనాభాగణన ఏడవ షెడ్యూలు లోని యూనియన్ జాబితాలో 69వ స్థానంలో ఉందని గుర్తుచేసారు. కొన్ని రాష్ట్రాలు కులాలను లెక్కించేందుకు సర్వేలునిర్వహించాయని, మరికొన్ని రాష్ట్రాలు సత్ఫలితాలు సాధించాయన్నారు. కొవిడ్19 తర్వాత జనాభా గణన 2021లో వాయిదాపడింది. నాలుగేళ్ల తర్వాత ఆలస్యం తర్వాత ఈ ఏడాది కేంద్రం జాతీయ జనాభాగణను తిరిగి ప్రారంభిస్తోందని ఇప్పటికే 1951నుంచి ప్రతి దశాబ్దంలోనిర్వహిస్తున్న జనాభా గణన గణనీయమైన మార్పులు జరిగినట్లు మంత్రి వివరించారు. ఇతర వెనుకబడిన తరగతుల ఓబిసి జనాభా గురించి స్పష్టమైన అవగాహనకోసం కాంగ్రెస్‌తో సహా రాజకీయ పార్టీలు కుల ఆధారిత జనాభా గణనకోసం వాదిస్తున్నాయి. కులగణనతోపాటే 2025 సీజన్‌లో చెరకు కనీస మద్దతుధరను 4.41శాతంపెంచి క్వింటాలుకు 3.55కి పెంచింది. అలాగే భూగర్భజలాలను పెంపొందించేందుకుగాను పిఎం కెఎస్‌వై కింద పైపులద్వారా పొలాలకు నీటిసరఫరాకోసం 1600 కోట్ల పథకాన్ని కూడా ఆమోదించింది. మూడు రాష్ట్రాల్లో 18,658 కోట్ల విలువైన నాలుగు రైలుప్రాజెక్టులకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

# పర్యటనకు ట్రాఫిక్ మళ్లింపు

>> పెనుమూడి వంతెన,అవనిగడ్డ,పామర్రు,గుడివాడ,హనుమాన్‌జంక్షన్ మీదుగా మళ్ళిస్తారు.

- గుంటూరు నండి విశాఖపట్నం వైపు వెళ్ళే వాహనాలను బుడంపాడు క్రాస్ నుండి తెనాలి, వేమూరు, కొల్లూరు,వెల్లటూరు జంక్షన్,పెనుమూడి వంతెన, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, హనుమాన్ జంక్షన్ మీదుగా మళ్ళిస్తారు.
- గన్నవరం వైపు నుండి హైదరాబాద్‌కు వెళ్ళే వాహనాలు అగిరిపల్లి, శోభనాపురం, గణపవరం, మైలవరం,జి.కొండూరు,ఇబ్రహీంపట్నం మీదుగా వెళ్లాల్సి ఉంటుంది.
- విశాఖపట్నం నుండి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు హనుమాన్‌జంక్షన్ నుండి నూజివీడు, మైలవరం, జి.కొండూరు,ఇబ్రహీంపట్నం మీదుగా వెళ్లాలి. హైదరాబాద్ నుండి విశాఖపట్నం వైపు వెళ్ళే వాహనాలు కూడ ఇదే మార్గంలో ప్రయాణించాల్సి ఉంటుంది.

**మల్టీ యాక్సిల్ రవాణా వాహనాలు నిలిపివేత**

మల్టీ యాక్సిల్ సరకు రవాణా వాహనాలకు ఈ మళ్లింపు మార్గాలు వర్తించవు. వాటిని నిర్ధేశిత ప్రదేశాల్లో నిలిపివేస్తారు. మే 2న రాత్రి 9 గంటల తర్వాతే వాటిని ముందుకు కదలటానికి అనుమతిస్తారు. చెన్నై నుండి విశాఖపట్నం వైపు వెళ్లే వాహనాలను చిలకలూరిపేట,ఒంగోలు,నెల్లూరు వద్ద జాతీయ రహదారి వద్ద నిలిపివేస్తారు. విశాఖపట్నం నుండి చెన్నై వైపు వెళ్లే వాహనాలను హనుమాన్ జంక్షన్, పొట్టిపాడు టోల్‌గేట్ వద్ద జాతీయ రహదారి వద్ద ఆపేస్తారు.

**రాజధాని సభకు బొట్టుపెట్టి ఆహ్వానం**

అమరావతి పనుల పునఃప్రారంభ సభకు రాజధాని రైతులను ప్రభుత్వ ప్రత్యేకంగా ఆహ్వానిస్తోంది. వంశపారంపర్యంగా వచ్చిన భూములను రాష్ట్ర హితం కోసం రాజధాని నిర్మాణానికి త్యాగం చేసిన రైతులను తగిన రీతిలో గౌరవిస్తోంది. గత వైఎస్సార్సీ హయాంలో గడ్డు పరిస్థితులు ఎదుర్కొన్న వీరికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్య ఇస్తోంది. ప్రధాని మోడీ పాల్గొనే సభకు కుటుంబ సమేతంగా రావాలంటూ భూములిచ్చిన రైతుల ఇంటికెళ్లి మరీ సిఆర్‌డిఎ సిబ్బంది ప్రత్యేక ఆహ్వాన పత్రికలు అందచేస్తున్నారు. ఈ పత్రికలపై అమరావతి రైతు అని ముద్రించారు. సభలో పాటించాల్సిన సూచనలూ అందులో పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటల్లోపు వచ్చి కేటాయించిన స్థానాల్లో కూర్చోవాలని, పత్రికతో పాటు తప్పనిసరిగా ఫొటో గుర్తింపు కార్డునూ తీసుకురావాలని పేర్కొన్నారు. మంగళవారం రాజధాని గ్రామాల్లో ఈ ఆహ్వాన పత్రికల పంపిణీ చేపట్టారు. పలుచోట్ల బొట్టు పెట్టి మరీ ఆహ్వానిస్తున్నారు. సోమవారం ఉండవల్లి లోని సిఎం నివాసంలో రైతులతో జరిగిన సమావేశంలో కుటుంబంతో సహా రావాలని చంద్రబాబు కోరారు. సభా వేదిక వద్ద కూడ రైతులకే ప్రత్యేకంగా 3 గ్యాలరీలు కేటాయించారు.



## సింహాచలం చందనోత్సవంలో గోడ కూలిన ఘటన బాధాకరం - ప్రధానమంత్రి నరేంద్రమోడీ

**విజయవాడ,ఏప్రిల్30,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ సింహాచలం చందనోత్సవం సందర్భంగా గోడ కూలిన ఘటనపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పందించారు. ప్రాణనష్టం జరగడం చాలా బాధాకరమని, మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపం తెలియజేశారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నానని అన్నారు. మృతుల కుటుంబాలకు పీఎంఎన్ఆర్ఎఫ్ నుండి రూ. 2 లక్షల పరిహారం ప్రకటించారు. అలాగే గాయపడిన వారికి రూ. 50,000 అందజేస్తామని ప్రధాని మోదీ వెల్లడించారు. ఘటన పట్ల విచారాన్ని వ్యక్తం చేసిన విపక్షనేత రాహుల్‌గాంధీ సింహాచలం ఆలయ ప్రాంగణంలో గోడ కూలి.. పలువురు మృతిచెందిన ఘటనపై పార్లమెంట్ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. పలువురు మృతి చెందడం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు.మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపం తెలియజేసినట్లు సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ఆయన పేర్కొన్నారు.

## కమ్మవారి సేవాసమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడిగా మండవ మురళీకృష్ణ ఏకగ్రీవ ఎన్నిక

**ఒంగోలు, ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమ్మ పెద్దలు మంగళగిరిలోని రాయల్ బ్యాంకెట్ హాలులో బుధవారం సమావేశము ఏర్పాటు చేసారు. ఈ సమావేశములో రాష్ట్ర కమ్మ సామజిక వర్గం అవసరాలు దృష్ట్యా కమ్మవారి సేవా సమాఖ్యఆ ంధ్రప్రదేశ్ " పేరిట ఒకట్రస్టును కమ్మ వారి సేవా సమాఖ్య ఆంధ్రప్రదేశ్" ఏర్పాటు చేశారు. ఆ ట్రస్టుకు గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ గని భాస్కరరావుని, అధ్యక్షులుగా మండవ మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా కొత్త పల్లి రమేష్ చంద్ర, కోశాధికారిగా గూడూరి నాగ నాగ కోటేశ్వరరావు, కార్యదర్శిగా సూరపనేని స్వరూపారాణిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ట్రస్టును ఏర్పాటు చేసిన గూడూరు సత్యనారాయణకు రాష్ట్ర కమ్మ సంఘం ప్రతినిధులు కృతజ్ఞతలు తెలియ జేసారు. ఈ కార్యక్రమంలో మందలపు జగదీష్, టిటిడి అక్కిన ముని కోటేశ్వరరావు, గ్రేటర్ విజయవాడ కమ్మవారి సేవాసమితినఉన్నారు.

# వీలైనంత త్వరగా చేనేత సహకార ఎన్నికలు

## జౌళి మంత్రి సవిత

**విజయవాడ,ఏప్రిల్30,ప్రభాతవార్తప్రతినిధి:** చేనేత సహకార సంఘాల ఎన్నికలకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. ఇటీవల చేనేత జౌళి శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శిగా ఇటీవల నియమితులైన ఆర్పీ సొసిడియా మర్యాపూర్వకంగా అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి సవితను ఆమె కార్యాలయంలో బుధవారం కలిశారు. ఈ సందర్భంగా చేనేతల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. మంత్రి సవిత మాట్లాడుతూ, చేనేతలకు 365 రోజుల పాటు పని కల్పించడంతో పాటు ఆత్మగౌరవంతో జీవనం సాగించడమే సీఎం చంద్రబాబునాయుడు ధ్యేయ మన్నారు. ఇందుకనుగుణంగా పలు పథకాలను రూపొందించారన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నుంచి వీలైనంత ఎక్కువ ప్రాజెక్టులు, నిధులు రాబట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆప్కో ద్వారా విక్రయాలు పెంచండి.ఆప్కోలో ప్రక్షాళన చేపట్టాలని, చేనేత వస్త్రాలు విక్రయాలు పెరిగేలా చేనేత బజార్లు విస్తృతంగా నిర్వహించాలని స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్పీ సిసోడియాకు మంత్రి సూచించారు. ప్రభుత్వ డిపార్ట్ మెంట్ల ఆర్డర్ల మేరకు త్వరితగతిన ఆప్కో ద్వారా క్లాత్ సప్లయ్ చేయాలన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే సాంఘిక, గిరిజన సంక్షేమ హాస్టళ్లకు దుప్పట్లు, టవళ్లు, ఇతర అవసరాలకు అవసరమయ్యే క్లాత్ ను అందజేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు అవసరమైన క్లాత్ కు సంబంధించి ఆర్డర్లు సేకరించి, ఆప్కో ద్వారా సప్లయ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంతో పాటు జాతీయ స్థాయిలో పెద్ద పెద్ద నగరాల్లో చేనేత బజార్లు నిర్వహించారు. రాష్ట్రంలో క్లస్టర్ల ఏర్పాటుకు తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. చేనేత సహకార సంఘాల ఎన్నికలు వీలైనంత త్వరగా నిర్వహణకు సిద్ధమవ్వాలన్నారు. ఇందుకు కోసం సొసైటీ బలోపేతంపై దృష్టి పెట్టాలన్నారు. చేనేతలు ఆత్మ గౌవరంతో జీవనం సాగించాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమని, ఆయన ఆశయ సాధనకు ప్రాధాన్యమివ్వాలని మంత్రి సవిత స్పష్టం చేశారు. రాష్ట్రంలో హస్త కళల అభివృద్ధికి ప్రభుత్వం పీట వేస్తోందని మంత్రి సవిత తెలిపారు. దీనిలో భాగంగా లేపాక్షిని అన్ని విధాలా అభివృద్ధి చేయాలని తెలిపారు. కస్టమర్లకు ఆకట్టుకునేలా హస్త కళారూపాల తయారీకి కళాకారులను అవసరమైన నైపుణ్య శిక్షణ అందజేయాలన్నారు. ముఖ్యంగా వెదురు, అరటి ఫైబర్ తో తయ్యారయ్యే కళారూపాలను నేటి అభిరుచులకు అనుగుణంగా రూపొందించేలా చూడాలని మంత్రి సవిత ఆదేశించారు.

# బుడమేరు మరమ్మత్తులకు టెండర్ల ప్రక్రియ పూర్తి: మంత్రి నిమ్మల

**విజయవాడ ఏప్రిల్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతి సచివాలయంలో బుడమేరు ఆధునీకరణ పోలవరం ఎడమ కాలువ పనులపై ఇరిగేషన్ అధికారులతో మంత్రి నిమ్మల రామానాయుడు సమీక్ష. హాజరైన ఈఎన్సీ ఎం.వెంకటేశ్వరరావు ఆయా ప్రాజెక్టుల సీఈలు, ఎస్ఈలు, ఈఈలు, ఏజెన్సీల ప్రతినిధులు మరియు ఇతర ఉన్నతాధికారులు, బుడమేరు మూడు గండ్లు మరమ్మత్తుల కోసం టెండర్ల ప్రక్రియ పూర్తవ్వడంతో , పనులు వెంటనే మొదలు పెట్టి, సీజన్ మొదలయ్యేలోగా పూర్తిచేయాలని అధికారులకు ఆదేశం. బుడమేరు డైవర్షన్ కెనాల్‌ను 37,500 క్యూసెక్కులకు పెంచేలా పెండింగ్ పనులు పూర్తి చేయడానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి. బుడమేరు వరద ఎనికేపాడు మీదుగా కొల్లేరు, ఉప్పుటేరు నుండి సముద్రంలో కలిసేలా డీపీఆర్ తయారు చేసి నివేదిక అందించాలని అధికారులకు ఆదేశం. బుడమేరు ఓల్డ్ ఛానెల్‌కు సమాంతరంగా మరొక కొత్త ఛానెల్ ను కూడా 10 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు, బుడమేరు వరదల నియంత్రణకు డిజాస్టర్ మానేజ్మెంట్ కింద, కేంద్రం సహకారంతో ముందుకు వెళ్ళేలా ప్రపోజల్స్ తయారు చేసాం.

## నెల్లూరు కారు ప్రమాదంలో ఆరుగురి మృతిపై సిఎం విచారం..

**విజయవాడ ఏప్రిల్ 30,ప్రభాతవార్త ప్రతినిధి:** నెల్లూరు జిల్లా కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం వద్ద ఇంట్లోకి కారు దూసుకెళ్లిన ఘటనలో ఆరుగురు మృత్యువాత పడటంపై సీఎం చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనలో మృతుల కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని వెల్లడించారు.

# సింహాచలం ఘటన దురదృష్టకరం : మాజీ సిఎం జగన్

**విజయవాడ,ఏప్రిల్ 30,ప్రభాతవార్త ప్రతినిధి:** విశాఖ జిల్లా సింహాద్రి అప్పన్న స్వామి చందనోత్సవంలో గోడ కుప్పకూలి యాత్రికులు మృతి చెందడంపై వైకాంగ్రెస్‌పార్టీఅధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వైఎస్. జగన్ ఈరోజు మధ్యాహ్నం విశాఖ కు వెళ్లి సింహాచలం ఘటనలో బాధిత కుటుంబాలను పరామర్శించను న్నారు. క్యూలైన్ పై గోడ కుప్పకూలి ప్రజలు మృత్యువాత పడటంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
నిట్ నం.2/టి.ఓ/2025-26, ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన తేది: 28.04.2025
పశ్చిమగోదావరి జిల్లాలో 1 పనికి ఆన్‌లైన్ టెండర్లు ఆహ్వానించబడుచున్నవి. అంచనా విలువ: రూ.50.00 లక్షలు. టెండరుదారులు టెండరు షెడ్యూళ్లను తేది: 05.05.2025 మ.3.00 గం. నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. టెండర్లు స్వీకరణకు చివరి తేది: 12.05.2025, మ.3.30 గం. వరకు. తదుపరి వివరాలను http://tender.apeprocurement.gov.in నందు చూడవచ్చును. సం/- పర్యవేక్షక ఇంజనీరు (ర.భ), ఏలూరు సర్కిల్, ఏలూరు
DIPR.No.16251/CL/Advt/1/1/2022-23, తేది: 30.04.2025

కెనరా బ్యాంక్ Canara Bank
గుడివాకలంక బ్రాంచ్
గుడివాకలంక, ఏలూరు మండలం, ఏలూరు జిల్లా-534004. ✆8331015663

**స్థిరాస్తులు అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన**

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002 లోని 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన కెనరా బ్యాంక్, గుడివాకలంక బ్రాంచ్ వారికి ఋణగ్రహీత(లు): శ్రీ మోరు నాగేంద్రబాబు, తండ్రి: మోరు కొండలరావు, డి.నెం 2-77, పెదచింతపాడు, ఏలూరు మండలం, ఏలూరు జిల్లా. మరియు శ్రీ మోరు కొండలరావు, తండ్రి: మోరు తిరుపతయ్య, డి.నెం 2-77, పెదచింతపాడు, ఏలూరు మండలం, ఏలూరు జిల్లా. మరియు శ్రీ మోరు శ్రీమన్నారాయణ, తండ్రి: మోరు తిరుపతయ్య, డి.నెం 2-77, పెదచింతపాడు, ఏలూరు మండలం, ఏలూరు జిల్లా. వారు తేది 22.01.2025 నాటికి చెల్లించవలసిన బకాయి రూ. 19,56,509.14 (అక్షరాల పంతొమ్మిది లక్షల యాభై ఆరు వేల ఐదు వందల తొమ్మిది రూపాయలు మరియు పద్నాలుగు పైసలు మాత్రమే) + తదుపరి వడ్డీ, ఖర్చులు, ఛార్జీలు కలిపి మొత్తమును రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్, గుడివాకలంక బ్రాంచ్ అధీకృత అధికారిచే నిర్మాణాత్మక/భౌతిక స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన దిగువ వివరించిన స్థిరాస్తిని తేది 31.05.2025 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని యావన్మంది ప్రజానీకానికి మరియు ముఖ్యంగా పైన తెలిపిన ఋణగ్రహీత & హామీదారులకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

**ఇ-వేలం తేది & సమయం: 31.05.2025, మ॥ 02.00 గం. నుండి మ॥ 04.00 గం.ల వరకు**

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును ఆర్.టి.జి.ఎస్ / నెఫ్ట్ / ఫండ్ ట్రాన్స్‌ఫర్ ద్వారా కెనరా బ్యాంక్, కోరుకొండ రోడ్డు బ్రాంచ్ అకౌంట్ నెం: 209272434, IFSC Code: CNRB0013267 వారికి తేది: 30.05.2025, మ॥ 12.00 గం.ల లోపుగా చెల్లించవలెను.

ఆస్తి నెం-1: ఏలూరు జిల్లా, కామవరపు కోట, ఆర్.ఎస్.నెం.798/2, ఎల్.పి. నెం. 48/2013R, "సౌభాగ్య వింటేజ్" లే-అవుట్‌లో ప్లాట్ నెం. 374లో గల 266.66 చ॥గ॥ల ఖాళీ స్థలం. హద్దులు: ఉత్తరం: ప్లాట్ నెం. 375, దక్షిణం: ప్లాట్ నెం. 373, తూర్పు: 33 అ॥ వెడల్పు రోడ్డు, పడమర: ప్లాట్ నెం. 377. టైటిల్ హోల్డర్: శ్రీ మోరు కొండలరావు.

**రిజర్వు ధర: రూ. 16,00,000/- ధరావత్తు సొమ్ము: రూ. 1,60,000/-**

ఆస్తి నెం-2: ఏలూరు జిల్లా, కామవరపు కోట, ఆర్.ఎస్. నెం.798/2, ఎల్.పి. నెం. 48/2013R, "సౌభాగ్య వింటేజ్" లే-అవుట్‌లో ప్లాట్ నెం. 373లో గల 266.66 చ॥గ॥ల ఖాళీ స్థలం. హద్దులు: ఉత్తరం: ప్లాట్ నెం. 374, దక్షిణం: ప్లాట్ నెం. 372, తూర్పు: 33 అ॥ వెడల్పు రోడ్డు, పడమర: ప్లాట్ నెం. 378. టైటిల్ హోల్డర్: శ్రీ మోరు శ్రీమన్నారాయణ.

**రిజర్వు ధర: రూ. 16,00,000/- ధరావత్తు సొమ్ము: రూ. 1,60,000/-**

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింకును రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, గుడివాకలంక బ్రాంచ్, మేనేజర్ గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్: 8331015663
ఇ-వేలం విధానం కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్ (Baanknet), వెబ్‌పోర్టల్ https://baanknet.com, హెల్ప్‌డెస్క్: 8291220220, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com.
తేది: 28-04-2025, ప్రదేశం: గుడివాకలంక సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

# నిర్లక్ష్యం వహించిన మంత్రులు అధికారులపై చర్యలు తీసుకోవాలి : మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి

**విశాఖపట్నం, ఏప్రిల్ 30, ప్రభాతవార్త** చందనోత్సవంలో గోడ కూలి మరణించిన వారి కుటుంబ సభ్యులను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి పరామర్శించారు.మధురవాడ సమీపంలోని చంద్రంపాలెం గ్రామానికి చెందిన ఉమామహేష్, శైలజ భౌతికకాయాలను సందర్శించి నివాళులు అర్పించారు.మృతుల కుటుంబాలను ఓదార్చి.. వారికి ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లక్షల మంది భక్తులు వస్తారని తెలిసిన భద్రత ఏర్పాట్లు నిర్లక్ష్యం వహించారని ఆయన ఆరోపించారు. గతంలో తిరపతి సంఘటన నేడు సింహాచలం సంఘటన ఇదే కోవలో కనిపిస్తుందని వైయస్ జగన్ చెప్పారు. వారం రోజుల క్రితం గోడ కట్టి మొదలు పెట్టారని రెండు రోజుల క్రితం పూర్తి చేశారని పది అడుగులు ఎత్తు 70 అడుగులు వెడల్పు నిర్మాణం చేసిన ఎక్కడ నిబంధనలు పాటించలేదని ప్రశ్నించారు. కాంక్రీట్ గోడ నిర్మించవలసిన చోట సిమెంట్ ఇటుకులతో నిర్మించి టెండర్లు లేకుండా అవినీతికి పాల్పడ్డారని అన్నారు. చందనోత్సవం ఎప్పుడు జరుగుతుందో చంద్రబాబుకు తెలియదా అంటూ ప్రశ్నించారు. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందనడానికి ఇదొక సంఘటన కనిపిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ,ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ ,మాజీ మంత్రి కురసాల కన్న బాబు ,మాజీ మంత్రి అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షులు గుడివాడ అమర్నాథ్ ,శాసనమండలి సభ్యురాలు వైఎస్ఆర్సిపి రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కళ్యాణి ,విజయనగరం జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ, జిల్లా పార్టీ అధ్యక్షులు

మజ్జీ శ్రీనువాసురావు(చిన్న శ్రీను),ఎమ్మెల్సీ డా.కుంభారవిబాబు ,విశాఖ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర ,విశాఖపట్నం జిల్లా పార్టీ అధ్యక్షులు, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె రాజు, మహిళా విభాగం అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అండగా వైఎస్సార్సీ

## - రాజ్యసభ సభ్యుడు వైవి సుబ్బారెడ్డి



**మద్దిపాడు, ఏప్రిల్ 30, ప్రభాతవార్త** కూటమి ప్రభుత్వం కళ్లు మూసుకుపోయి రైతులను పట్టించుకోకుండా గాలికి వదిలివేసిందని రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం ఆయన ప్రకాశం జిల్లా మండలంలోని వెల్లంపల్లి గ్రామంలోని పొగాకు వేలం కేంద్రానికి వచ్చి అక్కడ పొగాకు కొనుగోళ్లు జరుగుతున్న తీరును ప్రత్యక్షంగా పరిశీలించి రైతులను వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ పొగాకు రైతులు పడుతున్న ఇబ్బందులను చూసి మరి ముఖ్యంగా కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత పొగాకు రైతులే కాకుండా, వరి పండించిన రైతులు, మిర్చి పంట వేసిన రైతులు శనగలు పంట వేసిన రైతులు చాలా కష్టాలు పడుతున్నారని, కూటమి ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో వైఫల్యం చెందినందువలన రైతులు నష్టపోతున్నారని అన్నారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పొగాకు రైతులు పడుతున్న కష్టాలను గత సంవత్సరం పొగాకు కొనుగోళ్లు ఏ విధంగా జరిగాయి. ప్రస్తుతం ఏ విధంగా జరుగుతున్నాయి అన్న అంశాలను రైతులతో మాట్లాడి తెలుసుక్కోవడానికి వెల్లంపల్లి వేలం కేంద్రానికి రావడం జరిగిందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేక ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందని అన్నారు. కోస్తా జిల్లాలో వరి పంట వేసిన రైతులు కానీ, పత్తి పంట వేసిన రైతులు గాని మిర్చి రైతులు కానీ పొగాకు పంట వేసిన రైతులు కానీ, కంది పంట వేసిన రైతులు కాని ఏ ఒక్కరూ ప్రశాంతంగా లేరని అన్నారు. ఏ పంటకు గిట్టుబాటు ధర రాకపోగా ఆదుకోవాల్సిన కూటమి ప్రభుత్వం రైతులను గాలికి వదిలేసిందన్నారు. ఈ పరిస్థితుల్లో ఆయా పంటల రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు ఏర్పడ్డాయని ఆయన అన్నారు. ఈ క్రమంలో ప్రకాశం, గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలలో పొగాకు పంట వేసిన రైతులకు అదే పరిస్థితి వచ్చిందని అన్నారు. అందుకే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతుల పక్షాన నిలిచి కూటమి ప్రభుత్వం కళ్లు తెరిపించి పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు తమ పార్టీ నిలిచిందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా ప్రతి పక్షంలో ఉన్నా ఎల్లప్పుడూ రైతుల పక్షాన నిలుస్తుందని ఆయన తెలిపారు. ఈ సంవత్సరం పొగాకు పంట దిగుబడి 150 మిలియన్ కేజీల పొగాకు పంట పండిందని ఈ రోజుకు ఒక్క మిలియన్ కేజీలు కూడా కంపెనీలు కొనని పరిస్థితులు నెలకొన్నాయన్నారు.

గత సంవత్సరం కేజీ పొగాకు ధర రూ.360 రూపాయలు ఉంటే ఈ సంవత్సరం కేవలం రూ.250 రూపాయలకు కొనుగోలు చేస్తున్నారని అన్నారు. ఒక్క ఎకరా పొగాకు పంటకు సుమారుగా రెండున్నర నుండి మూడు లక్షల రూపాయలు వరకు ఖర్చులు అవుతాయని కౌలుకు తీసుకున్న రైతుకైతే మరో యాభైవేల రూపాయలు అదనంగా అవుతాయని అన్నారు.

## సింహాచలం ఘటన దురదృష్టకరం - మంత్రి కొలుసు పార్థసారధి

**విజయవాడ,ఏప్రిల్ 30,ప్రభాతవార్తప్రతినిధి:** సింహాచలం శ్రీ లక్ష్మీ వరాహ నరసింహ స్వామి ఆలయంలో గోడ కూలి ఎనిమిది మంది భక్తులు మరణించిన ఘటన దిగ్భ్రాంతికరమని రాష్ట్ర గృహ నిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి వర్యులు కొలుసు పార్థసారథి వ్యాఖ్యానించారుఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ ఈ ఘటనలో గాయపడిన వారికి ప్రభుత్వం పూర్తిస్థాయి వైద్య సేవలు అందిస్తోందన్నారు.

పవిత్రమైన చందనోత్సవంలో పాల్గొనడానికి వేలాది మంది భక్తులు ఉత్సాహంగా వస్తున్న వేళ ఇటువంటి ఘటన జరగటం బాధాకరం.

ప్రభుత్వం బాధితులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలియచేసారు.

# సింహాచలం ఘటనపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విచారం

**విశాఖపట్టణం, ఏప్రిల్ 30: ప్రభాతవార్త** సింహాచలం ఆలయ ప్రాంగణంలో గోడ కూలిన ఘటనలో పలువురు మృతి చెందిన ఘటన తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. పవిత్రమైన అక్షయతృతీయ సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు రావడం, ఈ సందర్భంలో గోడ కూలి ప్రాణనష్టం జరగడం విచారకరమని అన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నానని కిషన్ రెడ్డి అన్నారు.

## సింహచలం ఘటన స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తీవ్ర దిగ్భ్రాంతి

శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో సింహాచలంలోని రూ. 300 క్యూ లైన్ లో జరిగిన దుర్ఘటనపై స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసారు.

మంగళవారం కురిసిన భారీ వర్షానికి గోడకూలి ఏడుగురు భక్తులు ప్రాణాలు కోల్పోవడం మరి కొంతమందికి గాయాలు అవ్వడం అత్యంత దురదృష్టకరమన్నారు. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానన్నారు. గాయపడిన వారికీ తక్షణమే మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.బాధితుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు..

# సింహాచలం దుర్ఘటన దురదృష్టకరం

## - డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

సింహాచలంలో గోడ కూలడం మూలంగా క్యూ లైన్ లో ఉన్న ఎనిమిది మంది భక్తులు మృతి చెందారని తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యానట్లు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు.ఆ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేసారు. చందనోత్సవ సమయాన ఈ దుర్ఘటన చోటు చేసుకోవడం దురదృష్టకరం. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాను. వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుంది. విశాఖపట్నం జిల్లా అధికారుల నుంచి ఈ ఘటన వివరాలు తెలుసుకున్నాను. భారీ వర్షాల మూలంగా గోడ కూలిందని తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించాను.

## సింహాచలంలో గోడకూలిన ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేసిన హోంమంత్రి అనిత

**సచివాలయం,ఏప్రిల్ 30,ప్రభాతవార్త :** గోడ కూలిన ఘటన జరిగిన వేంటనే హుటాహుటిన రంగంలోకి దిగిన హోంమంత్రి వంగలపూడి అనిత,రాత్రి 3గంటల సమయంలో మృతదేహాలు వెలికి తీసేందుకు స్వయంగా రంగంలోనికి దిగిన మంత్రి అనిత,సహాయక చర్యలు ముమ్మరం చేయాలని అధికారులకు ఆదేశాలిస్తూ స్వయంగా పర్యవేక్షణ చేశారు.ముఖ్యమంత్రి చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేష్ ఆదేశాలతో పర్యవేక్షిస్తున్నారు.

BAJAJ FINSERV

**బంగారు ఆభరణాల వేలం కోసం దిన పత్రిక ప్రకటన**
బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్
రిజిస్టర్డ్ కార్యాలయం: ముంబయి-పూణె రోడ్డు, అకుర్డి, పూణె - 411035

గోల్డ్ లోన్ పొందే సమయంలో, ఆయా రుణ ఖాతాలలో మరియు రుణ మొత్తాన్ని చెల్లించలేకపోయిన డీఫాల్టర్స్ లేదా కావలసిన లాభాన్ని కేటాయించడంలో విఫలమైనవారు, నోటీసులను పునరావృతంచేసినా కూడా రుణగ్రహీతలుచే సెక్యూరిటీగా ఉంచబడిన గోల్డ్‌జ్యువెలరీ "యధాతథంగా మరియు ఎక్కడైతే మరియు ఎలా ఉందో దాని ఆధారంగా" వేలం వేయబడుతుందని ఇందుమూలముగా బీఎఫ్ఎల్ సంబంధిత రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి తెలియచేస్తోంది. బిడ్డర్స్ ఈ క్రింది నియమాలను అనుసరించాలని అభ్యర్థిస్తున్నాము:

(a) ప్రకటన గురించి పూర్తి వివరాలు తెలుసుకోవడానికి (లోన్, జ్యువెలరీ, స్థూల బరువు, ప్రదేశం మరియు వేలం వేసే తేదీ) ప్రక్కన ఉన్న QR కోడ్ స్కాన్ చేయాలి;
(b) ఈ ప్రకటనకు సంబంధించిన బిడ్డర్ నియమాలు, షరతులు గురించి పూర్తిగా చదవడానికి ("నియమాలు & షరతులు") వెబ్‌లింక్ http://172.30.1.235:3000/?WOUB2QG9WU పై క్లిక్ చేయాలి;
(c) నియమాలు & షరతులు అర్థం చేసుకోవడానికి, తదుపరి ధరావతు సొమ్ము రూ.25,000/- ను వేలం వేసే తేదీ నాడు లేదా అంతకు ముందు ఫండ్ ట్రాన్స్‌ఫర్ (ఎన్ఈఎఫ్టీ/ఆర్‌టీజీఎస్/బజాజ్ గోల్డ్ ఆక్షన్ యాప్) ద్వారా డిపాజిట్ చేయడానికి;
(d) ఉదయం 10 గంటలకు వేలం వేసే వేదిక వద్దకు వ్యక్తిగతంగా హాజరవ్వాలి; మరియు
(e) వేలం వేసే వేదిక వద్దకు తమ చెల్లుబాటయ్యే గుర్తింపు & చిరునామాను తీసుకురావాలి.
(f) వేలం వేసే వేదిక వద్ద తమ చెల్లుబాటయ్యే గుర్తింపు మరియు చిరునామా ప్రూఫ్ తీసుకువెళ్లాలి వేలం వేసే తేదీ నాడు మధ్యాహ్నం 12 గంటలు తరువాత వేలం వేసే ప్రక్రియలో పాల్గొనడానికి బిడ్డర్స్ అనుమతించబడరు.
(g) ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (EMD) చెల్లింపు తరువాత కూడా నిర్దేశించబడిన టైమ్ పరిమితి లోగా పాల్గొనని బిడ్డర్స్ ను తిరస్కరించడానికి లేదా అనుమతించడానికి బ్రాంచ్ మేనేజర్/వేలందారుకు హక్కు గలదు.

నన్ను స్కాన్ చేయండి

వేదికలో మరియు వేలం వేసే తేదీలో ఏవైనా మార్పులు ఉంటే, వేలం వేసే వేదిక వద్ద ప్రదర్శించబడతాయి. మీరు బిడ్ సమర్పించడం పైన చెప్పిన నియమాలను మీరు ఆమోదించినట్లుగా భావించబడుతుంది. ప్రజా వేలం సేల్‌ను రద్దు చేయడం/ఆపు చేయడం చేసినట్లయితే బీఎఫ్ఎల్ రుణగ్రహీత (లు) యొక్క విషయంలో కూడా ప్రైవేట్ సేల్ ద్వారా జ్యువెలరీని విక్రయించే హక్కు బీఎఫ్ఎల్ కు ఉంది. మీకు ఏవైనా సందేహాలు ఉంటే మీరు మమ్మల్ని ఈ మెయిల్ ఐడీ పై సంప్రదించవచ్చు - gold.auction@bajajfinserv.in

(12-05-25) అనకపల్లి - భార్గవి ప్లాజా; PBV8SGL11008386, 1105074, 1145534, 1183977, 1204490, 1345370, 1364508. అనంతపుర్ - కల్యాణ్‌దుర్గ్ రోడ్; PIV9SGL11197632. అనంతపుర్ - సుభాష్ రోడ్; PGA7SGL11148942, 1286394, 1331480, 1359014. భీమవరం - ప్రకాష్ చౌక్; PEG7SGL11253267. బొబ్బిలి - పెద్ద బజార్ మైన్ రోడ్; PKI4SGL10995340, 1123414, 1251082, 1341877. చిరాల - సంత బజార్; PEJ9SGL11024484, 1055918, 1315230, 1315516. ఏలూరు - వసంత మహల్ స్ట్రీట్; PEG8SGL10958165, 1107541, 1127341, 1157889, 1202555. (13-05-25) గుడివాడ - విజిఎల్; P563SGL6282590, 1266535. గూడూర్; P5N7SGL10115490, 0801855, 0940907, 1077555. గుంటూర్ - కొత్తపేట; P73FSGL11075820. హిందూపూర్ - ధన లక్ష్మీ రోడ్; PEG4SGL10986772, 1041509, 1133288, 1253220, 1330652, 1360677. జంగారెడ్డిగూడెం - ఏలూరు మెయిన్ రోడ్; PGH1SGL11226281. కదిరి - ఎన్‌టీఆర్ సర్కిల్; PIW8SGL11059932, 1088912, 1086579, 1147519, 1208616, 1200661. కాకినాడ - జగన్నాయకపుర్; PBW1SGL10957188, 1054829, 1311141, 1324215, 1359516. (14-05-25) మదనపల్లె - ఎన్‌టీఆర్ సర్కిల్; PEG6SGL11042378, 1042214, 1075704, 1076035, 1126604, 1134598, 1151242, 1191296, 1225087. మర్కాపుర్; PW03SGL10853131. నంద్యాల్ - శ్రీనివాస్ నగర్; PEO1SGL10934972, 0961334, 0974377, 0975582, 0975186, 0974882, 0989122, 1018883, 1174036, 1285465, 1284035, 1323744, 1343303, 1342474, 1366138. నరసరావుపేట్ - అరుందేల్‌పేట్; PEO2SGL11021850, 1108937, 1129636. నర్సీపట్నం - మైన్ రోడ్; PIW7SGL11307172. నెల్లూర్ - వీజీఎల్; P468SGL10954933, 1187639. నెల్లూర్ - కనకమహల్ సెంటర్; P19ISGL11085439, 1202505, 1233711. (15-05-25) నెల్లూర్ - నవాబ్‌పేట్; PXB4SGL11051299, 1086033, 1295394. నెల్లూర్ - వేదయపాలెం; PXB5SGL10956691, 0996297, 1134771, 1133629, 1137882, 1133900, 1134295, 1229054, 1285565, 1348911. ఒంగోలే అద్దంకి - బస్ స్టాండ్ సెంటర్; PEJ8SGL11150436, 1247676, 1265460, 1365857, 1365441. రైల్వే - కోడూరు నేతాజీ రోడ్; PGC5SGL10941205, 0935582, 0937784, 0934165, 0959823, 0974069, 0973682, 1038417, 1125533, 1123568, 1206213, 1233411, 1273757. రాయచోటి - బంగ్లా రోడ్; PBW4SGL10853386, 0852756, 0935605, 0989252, 1099599, 1185280, 1198202, 1227049, 1266573, 1273383, 1291393, 1293434, 1327808, 1341439. శ్రీకాకుళం - రామలక్ష్మణ్ జంక్షన్; PBW5SGL11085425, 1201291, 1311913. శ్రీకాళహస్తి - మైన్ రోడ్; PGC6SGL11103887, 1190989, 1236014, 1366593. (16-05-25) Srungavarapu - Kota; శృంగవరపు - కోట; PBW6SGL10980102, 0974103, 1027594, 1068275. సూళ్ళూర్‌పేట - పాండు రంగ స్ట్రీట్; PBW7SGL10939348, 1205310. తాడిపత్రి - యల్లనూర్ రోడ్; PBW8SGL11041175, 1032770, 1091777, 1091408, 1360615, 1361068. తణుకు - వేల్పూరు రోడ్; P6I4SGL10990861. తేనాలి - గాంధీ చౌక్; PEK2SGL11284845. తగరపువలస - భీమిలి రోడ్; PIW6SGL11062227, 1129123. తిరుపతి - బైరాగి పట్టెడ; PMB8SGL10943911, 1039256, 1204878, 1358134. (17-05-25) తిరుపతి - వీజీఎల్; P442SGL11190218, 1209332, 1307919. తిరుపతి - ఆర్‌సి రోడ్; PNB2SGL11024377, 1024754. తిరుపతి - తిలక్ రోడ్; PMB9SGL11277639. తుని - సినిమా రోడ్; PBW9SGL10961531, 0979681, 1107413, 1320237. విజయవాడ - అజీత్ సింగ్ నగర్; PLB9SGL11165731, 1185473, 1252710, 1291870. విజయవాడ - భవానిపురం; PMB1SGL10782490, 1306679, 1325602, 1346473. విజయవాడ - చిట్టి నగర్; PMB3SGL11171442, 1227509, 1257540, 1257841, 1295723, 1311505. (19-05-25): విజయవాడ - ఏలూరు రోడ్; PMB2SGL11290616. విజయవాడ - ఇబ్రహింపట్నం; PMB6SGL10601477, 0776789, 0818874, 0955584, 0992343, 0991884, 0992103, 1094366, 1234268, 1250973. విజయవాడ - మొగల్‌రాజ్‌పురం; PGA8SGL10969938, 0970248, 0988337, 1061977. విజయవాడ - సత్యనారాయణపురం; PMB4SGL11313213, 1303642. వైజాగ్ - అక్కయ్యపాలెం; PI90SGL11124678, 1301825, 1328942, 1342294. వైజాగ్ - వీజీఎల్; P408SGL10962399, 1171969, 1312753. వైజాగ్ - దాబాగార్డెన్స్; PI55SGL11234110, 1363658. (20-05-25) వైజాగ్ - ద్వారకానగర్; PI52SGL11037300, 1087515, 1257288, 1275151, 1329568. వైజాగ్ - గోపాలపట్నం; PB91SGL10702634, 0979471, 1041887, 1197132, 1272714, 1315616, 1303990. వైజాగ్ - కంచర పాలెం; PI54SGL11093470, 1117213, 1257198, 1295943. వైజాగ్ - కూర్మన్నపాలెం; PI57SGL11012629, 1012445, 1016966, 1073582, 1292039, 1305544, 1304507, 1362093. వైజాగ్ - మధురవాడ; PI93SGL11086246. వైజాగ్ - మద్రిపాలెం; PI94SGL10937831, 1246171, 1347971. వైజాగ్ - కొత్త గాజువాక; PI53SGL10986237, 1075462, 1367692. (21-05-25) అమలాపురం - మెయిన్ రోడ్; PGC2SGL10937708, 1109391, 1151775. వైజాగ్ - పెద్దవాల్తైర్; PI56SGL10992815, 1021435, 1061911, 1169582, 1273448, 1286995, 1359124. వైజాగ్ - పెందుర్తి; PI92SGL11008201, 1041718, 1071101, 1070434, 1147543, 1276130, 1312346, 1363682, 1363478, 1363870. వైజాగ్ - రవీంద్ర నగర్; PI95SGL10995287, 1007597, 1170806, 1328448, 1328270, 1322063, 1339002. విజయనగరం - ఫోర్ట్ ఏ జె రోడ్; PBX1SGL10585025, 0661026, 0971212, 0994622, 0994906, 0989129, 0994244, 1006995, 1076817, 1137196, 1137549, 1361004. విజయనగరం - ఎంజి రోడ్; PCZ4SGL11227577, 1343794.

బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్

నాయ్యం గెలవడానికి ఒక్క కారణం చాలు.
అన్యాయం నిలవడానికి సవాలక్ష సాకులు కావాలి.

-తిరుక్కురళ్

# అష్ట దిగ్బంధం !

దాయాది దేశాల మధ్య యుద్ధం తథ్యమని దాదాపు ఖాయమని తేలిపోయింది. భారత్‌తో తలపడక తప్పదని ముందస్తుగానే పాక్ యుద్ధ వ్యూహాన్ని అమలు చేస్తోంది. సిమ్లా ఒప్పందం రద్దు చేసుకున్నట్లు ప్రకటించింది. సరిహద్దుల్లో సైన్యాన్ని మొహరించింది. వాటి కవ్వింపు చర్యలను భారత్ నిలువరిస్తోంది. ఫిరంగులు గర్జిస్తున్నాయి. పాక్ దుష్కృత్యాలకు ఎదురు వ్యూహం చేయడం భారత్‌కు తప్ప లేదు. ఒకవైపు పాక్‌కు భయాందోళనలు ఉన్నా మేక పోతు గాంభీర్యం ప్రదర్శిస్తోంది. పాక్ ఆర్మీ చీఫ్ భారత్‌ను రెచ్చగొట్టే ప్రసంగం మానలేదు. పహల్గాంలో ఉగ్రవాదుల దుశ్చర్యలను దాదాపు అగ్రదేశాలు సైతం ఖండించాయి. చైనా ఒకటే వారి పట్ల మెతక వైఖరి వహిస్తోంది. పహల్గాం దుశ్చర్యకు దీటైన సమాధా నం ఇచ్చేందుకు ప్రధాని మోడీ భేటీలో త్రివిధ దళాలు సర్వ సన్నద్ధులవుతున్నారు. సైన్యానికి పూర్తి స్వేచ్ఛనిస్తూ ప్రధాని నిర్ణయం తీసుకున్నారు. తాజా వ్యవహారంలోనూ శత్రు దేశం ఉగ్రవాదం జోలికి పోబోమని రాజీకి వచ్చే వరకు భారత్ పట్టు విడచేటట్లులేదు. దేనికైనా సిద్ధమన్న పాక్ అధినేత ష హబాజ్ ఒకపక్క బింకం ప్రదర్శిస్తూనే, మరో పక్క ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనీ గుటెరస్ జోక్యం కోరుతున్నారు. ఆయన అంగీకరించారు కూడా. దేశ జనులంతా ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్న ఈ దశలో ఎవరేం చెప్పినా భారత్ వెనకడుగు వేసే పరిస్థితి. కేంద్ర హోం సెక్రటరీ పారా మిలటరీ చీఫ్‌తో కూడా సమాయత్తత గురించి భేటీ అయ్యారు. సరిహద్దు గ్రామాల ప్రజల భద్రత కోసం బంకర్లు నిర్మించారు. బ్రిటన్ పార్లమెంటు, కొన్ని దేశాల పార్ల మెంట్లు, కాశ్మీర్ అసెంబ్లీతోసహా చాలా దేశాలు మొన్నటి ఉగ్రవాద చర్యలను ఖండించాయి. భారత్ తన ప్రతీకార చర్యలను ముమ్మరం చేసింది. గగనతల నిషేధం, భారత్‌లో పాక్ పౌరుల ఏరివేత, అట్టారీ వాఘా సరిహద్దుల మూసివేత వంటి చర్యలు చేపట్టింది. ఒకపక్క యుద్ధ వ్యూహం అమలు చేస్తూనే మరోపక్క పాక్‌ను ఆర్థికంగా బలపడనీయకుండా ప్రయత్నాలు చేస్తోంది. పాక్‌కి మంజూరు చేసిన 7 మిలియన్ డాలర్ల ప్యాకేజీని బెయిల్ ఔట్ చేయొద్దని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థకు భారత్ విజ్ఞప్తి చేసింది. సదరు నిధులను పాక్ ఉగ్రవాద విస్తరణ కార్యకలాపాలకే వినియోగిస్తోం దని స్పష్టం చేసింది. ఇంత క్రితం ఉగ్రవాద నివారణ కోసం అమెరికా అందించిన నిధులను పాక్ ఉగ్రవాద కార్యకలాపాలకే వినియోగిస్తోందని తెలిసి ఆ నిధులను ఆపేసిందన్న విషయాన్ని ఏకరువు పెట్టారు. ఇదిలా ఉంటే ఇన్నాళ్లూ అమెరికా పశ్చిమ దేశాల కోసమే తాను ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్నట్లు, చెత్త పనులు చేస్తున్నట్లు పాక్ రక్షణమంత్రి ఖ్వాజా ఆసిఫ్ బహిరంగంగానే అంగీకరించారు. ఆది నుంచిఉగ్రవాదుల శిక్షణ విషయమై అనేక సార్లు, అనేక సందర్భాల్లో బుకాయించిన పాక్ భారత్ కత్తి ఎత్తి పెట్టేసరికి పాక్ నేతల నోటినుంచి నిజాలు తన్నుకుంటూ వచ్చేసాయి. ఆ నేపథ్యంలోనే నెల రోజుల క్రితం ముజా హిదిన్‌లు కాశ్మీర్‌పై దాడిచేసే అవకాశం ఉందన్న హెచ్చరికలు ఆ దేశ ఆర్మీ పాక్‌చీఫ్ నోట వినవచ్చాయి. ఆ తర్వాత కాశ్మీర్ తమ వశమవుతుందనికూడా ఆ హెచ్చరికల్లో ఉంది. దాదాపు చాలా దేశాలు భారత్‌లో జరిగిన పెహల్గాం దుశ్చర్యను ఖండిస్తుంటే, కొన్నిదేశాలు మాత్రమే అవకాశవాదంతో మాట్లాడుతున్నాయి. నియంత్రణరేఖకు ఆవల పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ఉగ్రవాద శిక్షణ శిబిరాలు నిర్వహిస్తోందని పాక్‌కు వ్యతిరేకంగా భారత్ ఏనాడో ఆరోపించింది. కానీ ఎటూస్పందన లేదు. తమ వద్దనున్న 130అణు బాంబులు భారత్ పై ఎక్కుపెట్టామని, ఎటు పక్కనుంచి ఇటు పక్కకు ఏ నిమిషంలో పేలుతాయో చెప్పలేమన్న ధోరణిలో పాక్ మంత్రి హనీఫ్ అబ్బసీ బాహాటంగానే హెచ్చరించారు. పరోక్షంగా భారత్ పై కాలు దువ్వుతున్నట్లుగానే కనపడుతోంది. సీమాంతర ఉగ్రవా దాన్ని ప్రోత్సహిస్తున్న పాక్‌ను చూసి క్షమించే పరిస్థితి లేదు. దానికితోడు ఇప్పుడు విపక్షాలతో సహా ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు లభించింది. ఉగ్రవాదం పై పోరాటంలో జవాన్లకు పూర్తిస్వేచ్ఛగా వ్యవహరించాలని ప్రధాని ఆదేశించారు. ఉగ్రవాదులకు జన్మలో మర్చిపోలేని గుణపాఠం చెప్పితీరాల్సిందే. ఇది ఇప్పుడు అందరి నోట వినిపిస్తున్న మాట. ఇదే సందర్భంలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ కూడా మోడీతో సమావేశం అయ్యారు. పాక్‌తో పోరులో ఏమాత్రం తగ్గవలసిన అవసరం లేదని సూచించినట్లు తెలుస్తోంది. ప్రధానితో బిఎస్ఎఫ్, ఎస్ ఎస్పీ ,అస్సాం రైఫిల్స్, కీలక దళాలు కూడా ఈ భేటీలో పాల్గొనడం విశేషం. భారత్ నుంచి పాక్‌ను ఎదుర్కొనే తరుణం లాంటి దౌత్యపరమైన చర్చలు జరగలేదు. కాశ్మీర్‌లో 45 పర్యాటక ప్రాంతాలు దాదాపు మూసివేసారు. బుధవారం ఉదయంనుంచీ వరుసగా జరిగిన జాతీయ భద్రతా వ్యవ హారాల కేబినెట్ సమావేశాల్లో భవిష్యత్ కార్యాచరణ మీదనే చర్చ సాగినా పాలనాసంబంధిత వివరాలనే బయటకు విడుదల చేయడం వెనుక సస్పెన్స్ ఉందని అర్థమవుతుంది. జూలైలో జరిగే అమర్‌నాథ్ యాత్రకు ముందే ఉగ్ర చర్యలకు చెక్ పెట్టాలనే యోచన చేస్తున్నట్టు సమాచారం. కాశ్మీర్‌లో మరిన్ని ఉగ్రవాద దాడులు జరిగే అవకాశముందని నిఘా వర్గాలు వెల్లడి చేస్తున్నందున ఆ సందర్భంలోనే యుద్ధవ్యూహాలు అమలు చేసేందుకు భారత్ సైన్యం ముందుకురుకుతోంది. భారత నావికాదళం అయితే తమ ప్రతాపం చూపించేందుకు ఆరాటపడుతోంది.

గొప్ప లక్ష్యాన్ని సాధించాలని ప్రయత్నించి విఫలం కావడం నేరం కాదు. గొప్ప లక్ష్యం లేకపోవడం నేరం.



లోవెల్

మనలో చాలా మందికి ఏమీ తెలియదు. తెలిసిన కొద్దిపాటి జ్ఞానంతో మనల్ని మనం గొప్పగా ఊహించుకుంటాం. ఇదే మన అజ్ఞానం.



సోక్రటీస్

## ప్రజావాక్కు



### ఐక్యరాజ్యసమితి జోక్యం అవసరం

భారత ప్రభుత్వం పహల్గామ్ దాడికి కారణమైన వారిపై కఠినంగా బదులు తీర్చుకునేందుకుత్రివిధ దళాధిపతులకు సంపూర్ణ స్వేచ్ఛను ఇచ్చింది. వీరు కార్యాచరణను ఎప్పుడు మొదలు పెడతారో ఇంకా నిర్ణయం తీసుకోవాలి. అటు పాకిస్థాన్ కూడాయుద్ధానికి సన్నాహాలు చేస్తోంది. చైనా, తుర్కియే దేశాలు ఇప్పటికే పాక్ కు అండగా ఉంటాయని హామీలు ఇచ్చాయి. యుద్ధం అంటే మాటలుకాదు. ప్రాణ నష్టం, ఆస్తినష్టం అపారంగా ఉంటుంది. ఆర్థిక వ్యవస్థలు తీవ్రంగా కుంటుపడతాయి. మిగిలిన స్నేహ బంధం ఉంటే అదికూడాతెగిపోతుంది. అణుయుద్ధ పర్యవసానాలు ఎంత ఘోరంగాఉంటాయో జపాన్‌లోనిహిరోషీమా, నాగసాకిలు ప్రత్యక్ష సాక్షులు. భారత్ మన సైనికులకు యుద్ధానికి సంబంధించి పూర్తి అధికారాలు యిచ్చినా, ఫలితాల బాధ్యత అంతా ప్రభుత్వానిదే. యుద్ధాలలో గెలుపు ఓటమిలను పక్కన పెడితే అయ్యేది మాత్రం సర్వనాశనమే.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### అబల కాదు సబల

దేశ స్వాతంత్ర్యం కోసం వీరనారీమణులు ప్రాణాలు సైతం పణంగా పెట్టిన సందర్భాలు అనేకం. ఇంటా బయటా పెను సవాళ్లను ఎదుర్కోని పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం కూడా అమ్మాయిలదే పై చేయిగా ఉంటోంది. మగవారి విజయం వెనుక స్త్రీ పాత్ర ఉంటుందన్న విషయం జగమెరిగిన సత్యం. ఇక కుటుంబ వ్యవహారాల్లో కూడా ఓర్పు, నేర్పు, సహనం, చాకచాక్యంగా నిర్ణయాలు తీసుకోవడంలో అబలకాదు, సబల అని నిరూపించుకుంటున్నారు.

-ఆర్.వెంకటేష్ చరన్, బెంగళూరు

### శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేయాలి

వేసవిలో ఉష్ణోగ్రతల తాకిడికి, వడగాలులు వంటి వాటి నుండి వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవడానికి ప్రభుత్వం విద్యాశాఖ ద్వారా విజ్ఞానానికి సంబంధించిన వినోదానికి సృజనాత్మకతకు, సంస్కృతిక కార్యక్రమాలు, ఆటలుపాటలు డ్రాయింగ్ వంటిసబ్జెక్టులను కొంత జ్ఞానం సంపాదించడానికి గాను ప్రత్యేకక్లాసులు అవసరం. విద్యార్థులకు ఆసక్తికలిగిన నైపుణ్యాలను పెంచుకోవడానికి ప్రతి గ్రామంలో వేసవి శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేయాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ

### ఆదర్శ నేతలు అవసరం

నిజమే లోక్‌సభ స్పీకర్‌గా విధులు నిర్వర్తించిన సోమ్‌నాథ్ చటర్జీ లాంటి నేతల అవసరం ఉంది. ప్రస్తుత ఉపరాష్ట్రపతి సుప్రీంఅధికారాలను వికట్టహాసం చేస్తూ మాట్లాడారు. తమిళనాడు ప్రభుత్వం గవర్నర్ ఆర్ఎన్ రవి వ్యవహారం ముదిరి పాకానపడడంతో సుప్రీం తమసంపూర్ణ అధికారాలను ఉపయోగించుకొని బిల్లులు పాస్ అయ్యేట్టు చూసారు. అందులో తప్పేమీ రాజ్యాంగం తమకు కల్పించిన అధికారాలను వాడుకోవడం కూడా ఉప రాష్ట్రపతి మనసులో తప్పు అయితే ఎట్లా పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా పని చేసినప్పుడు కూడా ఇదే రాజకీయ పోకడలకు ఉపరాష్ట్రపతి శ్రీకారంచుట్టారు. అయితే ఇక్కడ గమనించవలసిన అంశం ఏమిటి? ఉపరాష్ట్రపతి కానీ గవర్నర్ కానీ ప్రభుత్వానికి మార్గదర్శకంగా ఉండాలి తప్ప రాజకీయ పోకడలకు పోకూడదు. ఆదర్శ భావాలు కలిగిన నేతలను ఈ దేశం చూసింది కావున ఇప్పుడు అలాంటి నేతల అవసరం ఉంది.

- భారత అవినాష్, జనగామ

### ఉద్యోగుల విన్నపం

తెలంగాణ రాష్ట్రప్రభుత్వం సమ్మర్‌లో విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం సమ్మర్ కోచింగ్ క్యాంపులు ఏర్పాటు చేస్తుంది. వికలాంగులైనలెక్చరర్స్, టీచర్స్ గురుకులాలలోనూ పాఠశాల కళాశాలలోనూ సబ్జెక్టులు బోధిస్తున్నారు. ఇంటర్మీడియేట్ ఫెయిల్ అయిన వారికి ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ గురుకులాలలో సమ్మర్ క్యాంపలలో వేసవి సెలవులలో అదనపు విధులు నిర్వహిస్తున్న వికలాంగులైన లెక్చరర్స్ టీచర్స్‌కు అదనపు విధుల కింద పరిక నుంచి అదనపు ఎర్నుడు లీవ్స్‌లలో వీరికి టీఏ, డీఏలు, అదనపు అలవెన్స్‌లు మంజూరు చేయాలి.

-రాపాక రవీందర్, జనగాం

### పెరుగుతున్న అపరిష్కృత కేసులు

ఏపి రాష్ట్ర హైకోర్టు, ఏఎన్‌యు నిర్వహించిన కార్యకలాపాల వివరాల ప్రకారం దేశంలో అపరిష్కృత కేసుల సంఖ్య ఐదు కోట్లకుదాటడం ఆందోళన కలిగిస్తుంది. సమాజంలో వ్యక్తుల మధ్య సంఘీభావం పూర్తిగా కొరవడటం, ప్రతీకారధోరణి, ఆధిపత్య ధోరణి, అమానుష చర్యలు చాలా వరకు కేసుల పెరుగుదలకు కారణం. గ్రామ స్థాయిలోనే పెద్దల సమక్షంలో వివాదం తేల్చుకోవచ్చు. పంతాలు, పట్టింపులు ఎక్కువై పైస్థాయికి వెళ్తున్నారు. ధనం, కాలం, శ్రమపూర్తిగా ఇరుపక్షాలకు నష్టమే. వివాదం లేకుండా ప్రవర్తించడం సమస్యను జటిలం చేస్తుంది.

-కె.రామకృష్ణ, హైదరాబాద్

మన వి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఉపాధి పనుల నిధుల్లో కోత

**లిబ్టెక్ ఇండియా సంస్థ 2024ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు చేసిన సర్వే రాష్ట్రంలోని 27 జిల్లాలకు గాను 17 జిల్లాల్లో ఉపాధిపని తగ్గిందని, ప్రతికుటుంబం సగటున 6 శాతం పనిదినాలు కోల్పోయింది. ఇదేపరిస్థితి అనేక రాష్ట్రాల్లో ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల ఫలితంగా ఉపాధిపనుల ఎడల కూలీల్లో విముఖత ఏర్పడి, పనులకు వెళ్లేవారి సంఖ్య తగ్గుతూ ఉంది. కేంద్ర ప్రభుత్వానికి కావాల్సింది ఇదే. ఉపాధి కూలీల వెడల కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ, జాబ్కార్డుకి దరఖాస్తు చేసుకున్న అందరికీ పనులు కల్పించాలి. కనీస వేతనం 500 రూపాయలు ఇవ్వాలి. పనిచేసే ప్రదేశాల్లో కనీస వసతులు కల్పించాలి. స్త్రీ కూలీల అవసరాలకు అనుగుణంగా వారికి ఏర్పాట్లు చేయాలి. ప్రతివారం వేతనాలు చెల్లించాలి. ఇందుకోసం ఉపాధి కూలీలు ఉద్యమించాలి.**

**బొల్లిముంత సాంబశివరావు**

పేదల ఆర్థిక పరిస్థితులను మెరుగుపర్చి వారి జీవితాల్లో వెలుగును నింపేందుకు మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిపథకాన్ని ప్రవేశపెట్టి అమలు జరుపుతున్నట్లు యూపీఏ, ఎన్డీఏ కూటమి పార్టీలు ప్రచారం చేసుకుంటున్నాయి. ఆచరణలో మాత్రం పథకాన్ని నిర్వీర్యం చేసే విధానాలనే అమలు చేశాయి, చేస్తున్నాయి. యూపీఏ ప్రభుత్వంతో ప్రారంభమైన ఈవిధానం, ఎన్డీఏ ప్రభుత్వ పాలనలో తీవ్రమైంది. మోడీ నాయకత్వాన ఉన్న కూటమి ప్రభుత్వం పని దినాలు తగ్గించటం, బడ్జెట్ కేటాయింపుల్లో కోత విధించటం, కూలీలకు వేతన బకాయిలుపెట్టటం, కూలీల హాజరుకు నిబంధనలు వంటి చర్యలతో ఉపాధి పనులనుంచి కూలీలు తప్పుకునేలా చేసిపథకాన్ని నిర్వీర్యం చేయదలచింది. దేశవ్యాప్తంగా గ్రామీణ ఉపాధి పథకం జాబ్ కార్డులు కలిగిన కుటుంబాలు 15కోట్ల, 3లక్షలమంది. యాక్టివ్ కార్డులు కలిగిన వారు 8కోట్ల, 18లక్షలమంది. మొత్తం కూలీలు 25 కోట్ల, 92లక్షలమంది. యాక్టివ్కూలీలు11 కోట్ల, 66 లక్షలు. ఈ పథకం ద్వారా గ్రామీణ పేదలకు కొంతమేర పనులు దొరుకుతున్నాయి. ఈపథకం పనుల్లో 45శాతం మహిళలు ఉపాధి పొందుతున్నారు. కోవిడ్ కాలంలో పట్టణాల నుంచి గ్రామాలకు వచ్చిన పేదలకు ఈపథకమే ఉపాధి పనులు కల్పించింది. పథకం ప్రారంభమైన దగ్గర నుంచి, దాన్ని నీరుకార్చే విధానాలు పాలకులు చేపట్టారు. నేడు ఎన్డీఏ ప్రభుత్వం ఒకపద్ధతి ప్రకారం పథకాన్ని బలహీనపర్చటానికి అన్నివిధాల ప్రయత్నిస్తున్నది. సమయానికి వేతనాలు జమచేయటం లేదు. చట్టప్రకారం 15 రోజుల్లో వేతనాలు జమచేయకపోతే, రోజువారి లెక్కలప్రకారం పరిహారం ఇవ్వాలి. దీన్ని అమలు జరపటంలేదు. ఆధార్ నంబర్ లాంటి సాంకేతిక అంశాలను అడ్డుపెట్టుకుని పథకాన్ని నీరుగారుస్తున్నది. జాబ్‌కార్డుకి, బ్యాంకు అకౌంట్‌కి ఆధార్ అనుసంధానం చేయటం, పేర్లు, పుట్టిన తేదీల్లోని వివరాలు సరిపోకపోవటం లేదంటూ 6కోట్ల, 70 లక్షల మందిని ఉపాధి పథకానికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం దూరం చేసింది. చాలామందికి తమ పేర్లు జాబితాలో ఎందుకు లేదో కూడా తెలియదు. 71 శాతం మంది కూలీలకు సరైన సమయంలో వేతనాలు అందించలేకపోయింది. బెంగాల్ రాష్ట్రంలో గత మూడు సంవత్సరాలుగా ఉపాధి పనులు నిలిచిపోయాయి. ఈ పథకం అమలు కోసం రాష్ట్రాలకు నిధుల విడుదలలో కేంద్రం వివక్షచూపుతున్నది. ఎన్డీఏకి వ్యతిరేకమైన తెలంగాణ, తమిళనాడు, బెంగాల్, కేరళ రాష్ట్రాలకు నిధుల విడుదలలో తీవ్రజాప్యం చేస్తున్నది. బెంగాల్ రాష్ట్రానికి గత మూడు సంవత్సరాలుగా ఒక్కరూపాయి విడుదలచేయలేదు. పథకానికి కూడా నిధులు తగ్గిస్తూఉంది. 2021-22బడ్జెట్లో 98 కోట్లు కేటాయించిన కేంద్రం, 2022-23 బడ్జెట్లో 73 వేల కోట్లు, 2023-24లో 61కోట్లు మాత్రమే కేటాయించింది. సాధారణ ఎన్నికల దృష్ట్యా ప్రయోజనం పొందేందుకు 2024-25లో 86వేలకోట్లు కేటాయించింది. నిధులు తగ్గింపు ద్వారా ఉపాధి పథకాన్ని అడ్డుకోవాలనిచూస్తున్నది. గ్రామీణ ఉపాధిహామీ పథకం పనిదినాల్లో కేంద్రప్రభుత్వం భారీగా కోతపెడుతున్నది. 2025-26 ఆర్థికసంవత్సరానికి12 కోట్లపనిదినాలు కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వం కోరగా, 6.5కోట్లపని దినాలు మంజూరు చేసింది. గత ఆర్థికసంవత్సరం 8కోట్ల పనిదినాల కేటాయింపు జరిగింది. దీన్ని గమనిస్తే పనులు పెంచకపోగా తగ్గించటం జరిగింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి 2023-24లో 21.50 కోట్ల పని దినాలు కేటాయించగా, 2024-25లో 8కోట్ల పనిదినాలు మాత్రమే కేంద్రం కేటాయించింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి 12 కోట్ల పనిదినాలు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపగా, 6.5 కోట్లపనిదినాలనే మంజూరు చేసింది. భారీగా రెండు రాష్ట్రాల్లో ఉపాధి పని దినాలు తగ్గిపోయాయి. కేంద్రం నుండి రాష్ట్రాలకు రావాల్సిన ఉపాధి పనుల బకాయిలు 26 వేలకోట్లు. దీన్ని రాజ్యసభలో సిపియం సభ్యుడు అడిగిన ప్రశ్నకు కేంద్రగ్రామీణ అభివృద్ధి మంత్రిత్వశాఖ ఇచ్చిన సమాధానంలో చెప్పటం జరిగింది. ఈమొత్తంలో కార్మికుల వేతనాల కింద 15,277 కోట్లు, పాలనాపరమైన ఖర్చులకింద 10,820 కోట్లుగాఉంది.



2025 మార్చి21 నాటికి కేంద్రం రాష్ట్రాలకు ఇవ్వాల్సిన బకాయిల వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు 2,030.47 కోట్లు, కేరళ 1,055.82 కోట్లు, రాజస్థాన్‌కు 2,129.51 కోట్లు, ఉత్తరప్రదేశ్‌కు 3,668.29కోట్లు, మధ్యప్రదేశ్‌కు 1,151.35 కోట్లు, తమిళనాడుకి3,725.11 కోట్లు, మహారాష్ట్రకి 2,825.46కోట్లు, కర్ణాటకకి 609.98 కోట్లు, ఒడిశాకు 586.68 కోట్లు, బీహార్కి 2,849.35 కోట్లు, జార్ఖండ్‌కి 662.88 కోట్లు, తెలంగాణ 577.89 కోట్లు, అస్సాంకి 538.47కోట్లు, ఛత్తీస్‌గఢ్‌కి 586.82 కోట్లు, పంజాబ్‌కి 243.84కోట్లు, హిమాచల్‌ప్రదేశ్‌కి 292.13 కోట్లు, హర్యానాకి 161.34 కోట్లు కేంద్రం ఇవ్వవలసిన బకాయిలున్నాయి. కనీస వేతనచట్టంలో వ్యవసాయ కూలీలకు ఇచ్చేవేతనాలు ఉపాధికూలీలకు ఇవ్వటం లేదు. 2024 25 సంవత్సరంలో కనీస ఉపాధి కూలి 300 రూపాయలు కాగా, 2025-26 సంవత్సరంలో 307 రూపాయలుగా ఉంది. పెరుగుదల 7రూపాయలు మాత్రమే. నేటి నిత్యావసర ధరల దృష్ట్యా ఈవేతనం సరిపోదు. కనీసం 500 రూపాయల వేతనం ఉండాలి. దేశంలోని చాలారాష్ట్రాల్లో నెలలతరబడి కూలీలకు వేతనాలు అందక కుటుంబ పోషణ కష్టంగా మారింది. ఆంధ్రప్రదేశ్లో 47 లక్షల కుటుంబాలకు చెందిన 75 లక్షల మందికి ఉపాధి పనులే జీవనాధారం. వీరికి 60 రోజులపైగా వేతనాలు అందలేదు. ఇన్నిరోజులు వేతనాలు అందకపోవటంతో కూలీల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతూ వేతనాల కోసం ఎదురుచూస్తున్నారు. లిబ్టెక్ ఇండియా సంస్థ 2024ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు చేసిన సర్వే రాష్ట్రంలోని 27 జిల్లాలకు గాను 17 జిల్లాల్లో ఉపాధిపని తగ్గిందని, ప్రతికుటుంబం సగటున 6 శాతం పనిదినాలు కోల్పోయింది. ఇదేపరిస్థితి అనేక రాష్ట్రాల్లో ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల ఫలితంగా ఉపాధిపనుల ఎడల కూలీల్లో విముఖత ఏర్పడి, పనులకు వెళ్లేవారి సంఖ్యతగ్గుతూ ఉంది. కేంద్రప్రభుత్వానికి కావాల్సింది ఇదే. ఉపాధికూలీల వెడల కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ, జాబ్కార్డుకి దరఖాస్తు చేసుకున్న అందరికీ పనులు కల్పించాలి. కనీస వేతనం 500రూపాయలు ఇవ్వాలి. పనిచేసే ప్రదేశాల్లో కనీస వసతులు కల్పించాలి. స్త్రీకూలీల అవసరాలకు అనుగుణంగా వారికి ఏర్పాట్లు చేయాలి. ప్రతివారం వేతనాలు చెల్లించాలి. ఇందుకోసం ఉపాధికూలీలు ఉద్యమించాలి. ●

# తాగునీటి కష్టాలు తీరేదెన్నడు?

**డాక్టర్ మోటె చిరంజీవి**

ఒకప్పుడు ఊళ్లో ఉన్నటువంటి ప్రజలంతా మంచినీళ్ల బాయి కాడికి వెళ్లి, బాయినీళ్లు తాగే వాళ్ళం. తర్వాత నల్లా నీళ్లు తాగడం ఆరంభించాం. తరువాత మినరల్ వాటర్‌కి అలవాటుపడ్డారు. ఇప్పటికీ కొన్నిచోట్ల నల్లా ద్వారా వచ్చే నీటినే పట్టుకొని మంచినీటిగా తాగుతున్నారు ప్రజలు. చాలావరకు గ్రామాలలో మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకొని, వాటిద్వారా మినరల్ వాటర్‌ను తాగుతున్నారు. అంతలా మినరల్ వాటర్‌కు అలవాటు పడ్డారు. క్యాన్ల ద్వారా తీసుకపోయే వాటర్‌పోయి, వాటర్ బాటిల్స్ ద్వారా నీటిని తాగుతున్నారు. ఈ బాటిల్స్‌కూడా 200 ఎంఎల్, 500 ఎంఎల్, 1లీటర్, 2లీటర్స్, 5లీటర్స్, 20లీటర్స్‌గా అందుబాటులో ఉన్నాయి. ఆయా కంపెనీలను బట్టి మినరల్ వాటర్ లీటర్‌కు రూ.20 నుండి రూ.1500 వరకు ప్రజలు కొనుక్కొని తాగుతున్నారు. నీటి వ్యాపారం కాసుల వర్షం కురిపిస్తుంది. విచ్చలవిడిగా ఆర్‌ఓ ప్లాంట్లు ఏర్పాటు చేసి నీటిశుద్ధి పేరుతో సాధారణ నీటిని నింపి ప్రజల గొంతును తడుపుతున్నారు. నిబంధనలకు నీళ్లు వదిలి ప్రమాణాలకు పాతరేస్తున్నారు. అత్యధిక శాతం కుటుంబాలు మినరల్ వాటర్ తాగడానికి అలవాటు పడడం వ్యాపారులకు వరంగా మారింది. గ్రామస్థాయి నుండి పట్టణస్థాయి వరకు ప్రతి ఒక్కరూ మినరల్ వాటర్‌నే తాగుతున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సుమారు 1000 నుంచి ఈ 2000 లీటర్ల సామర్థ్యం కలిగిన ఆర్‌ఓ ప్లాంట్లు గ్రామీణ స్థాయిలో తక్కువగాను, పట్టణ స్థాయిలలో ఎక్కువగానుఉన్నాయి. నీటి శుద్ధి పేరుతో గ్రామస్థాయిలో అయితే రూ.10మించకుండా, పట్టణాల్లో అయితే లీటర్‌కు రూ.15 చొప్పున సరఫరా చేయగా వేసవిలో రూ.20కి పెంచి విక్రయించారు. పట్టణ ప్రాంతాల్లో ప్రతి వార్డుకు, ప్రతి డివిజన్‌కు పదుల సంఖ్యలో ఆర్వో ప్లాంట్‌లు పుట్టుకొచ్చి నీటి వ్యాపారం జరుపుతున్నారు. చాలా చోట్ల అనుమతి లేకుండానే నీటిని విక్రయిస్తున్నారు. నీటి శుద్ధి పేరిట వ్యాపారం చేస్తున్నటువంటి వారిపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని అంటున్నారు జనం. ఆర్వో (రివర్స్ అస్మసిస్) ప్లాంట్ల నిర్వాహకులు నిబంధనలు పాటించకుండా శుద్ధ నీటిపేరుతో మోసం చేస్తున్నారు. మైక్రో బయాలజీ, కెమిస్ట్రీ అర్హతకలిగిన వారిని టెక్నీషియన్‌గా నియమించాలి. పీహెచ్ (పొటెన్షియల్ ఆఫ్ హైడ్రోజన్) స్థాయి పదికంటే తగ్గకుండా చూడడంతో పాటు క్యాల్షియం, మెగ్నీషియం ఎంత మోతాదులో ఉందో గమనించాలి. శుద్ధి చేసిన నీటిలో టీడీఎస్ (టోటల్ డిజాల్వ్ సాలిడ్స్) స్థాయి గరిష్టంగా లీటర్‌కు 500 మిల్లీ గ్రాములలోపు ఉండాలి. టీడీఎస్ సమతుల్యత పాటించకుండా నిర్దేశిత స్థాయిలో నీటిశుద్ధి చేయకుండానే నీటిని అమ్ముతున్నారు. తాగునీటిలో టీడీఎస్‌లో లెడ్, ఫ్లోరిన్, నైట్రేట్, క్లోరైడ్ వంటివి స్థాయి ఎక్కువగా ఉంటే దీర్ఘకాలంలో కాలేయం, జీర్ణకోశ, నరాల సంబంధిత వ్యాధులు వచ్చేప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు. గత 70 సంవత్సరాల్లో ప్రపంచ జనాభా మూడు రేట్లు పెరగగా, నీటి వాడకం ఆరు రెట్లు పెరిగింది. ప్రైవేటు కంపెనీలు అత్యధిక లాభాలకు నీటిని అమ్మడం అంటే అది మానవ జీవనానికి ఇబ్బందే.




75శాతం వరకు నీటి వ్యాపారం కొన్ని యూరోపియన్ దేశాలు, అమెరికా బహుళ జాతి కంపెనీల అదుపులో ఉంది. ఈ కంపెనీలు వివిధ దేశాల ప్రభుత్వాలపై నీటిని, నీటి నిర్వహణను ప్రైవేట్ పరం చేయాలని ఒత్తిడి తీసుకు వచ్చి విజయం సాధించాయి. 2002లో భారత ప్రభుత్వం జాతీయ జల విధానాన్ని అమల్లోకి తెచ్చింది. జల విధానం రాకముందే భారత దేశంలో 1990లో జలవనరుల ప్రైవేటీకరణ ప్రారంభమైంది. ఇదే సంవత్సరం పార్లే కంపెనీ మన దేశంలో బిస్లరీ పేరుతో వాటర్ బాటిల్స్‌ను ప్రవేశపెట్టింది. ప్రస్తుతం మనదేశంలో సుమారు 3000 వరకు అనుమతి పొందిన ,12 వేలవరకు అనుమతి పొందని వాటర్ బాటిల్ కంపెనీలు ఉన్నాయని అంచనా ఉంది. ఇవేకాక పెప్సీ, కోకోకోల వంటి బహుళ జాతి కంపెనీలు బ్రాండ్లతో నీటి వ్యాపారం చేస్తున్నారు. 2022 సంవత్సరంలో రూ.43,663 కోట్ల నీటి వ్యాపారం జరగగా, 2024 నాటికి రూ.50వేల కోట్లకు పైగా నీటివ్యాపారం జరుగుతుందని అంచనాఉంది. ప్రకృతి సహజమైన నీరు సకల ప్రాణులకు ఏ విధంగా లభిస్తుందో, వాటర్ ప్లాంట్ ద్వారా కూడా సహజ సిద్ధమైన వాటర్ మాదిరిగా లభించేలా ఆర్వో ప్లాంట్ల పైన అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉండాలి. వాటర్ ప్లాంట్ ద్వారా తాగునీటిని అధికరేట్లకు సరఫరా చేస్తున్నటువంటి వారిపై ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకున్నప్పుడే శుద్ధమైన నీటిని ప్రజలకు అందించగలుగుతాం. పాలకులు కూడా గ్రామ, పట్టణ ప్రాంతాలలో తాగునీటి సమస్యను అధిగమించడానికి ఉచితంగా మంచినీటిని సరఫరా చేసేందుకు ఉచితంగా సరఫరా చేసే మినరల్ వాటర్‌ప్లాంట్లను ఏర్పాటు చేయాలి. నల్లాల ద్వారా విడుదల చేసేటువంటి నీటిని శుద్ధిచేసి ప్రతి ఇంటికి సరఫరా చేయాలి. అధికంగా మొక్కలు పెంచుతూ, పర్యావరణాన్ని కాపాడుకున్నప్పుడు మాత్రమే నీటికాలుష్యం తగ్గి, శుద్ధ మైన నీరు ప్రజలకు అందుతుంది. ●

# కార్మికుల హక్కుల విజయం మేడే

**వీరబోయిన రామాంజనేయులు యాదవ్**

శ్రామికులు శ్రమ దోపిడీకి చరమగీతం పాడి, కార్మికులు తమ హక్కుల కోసం చేసిన సుదీర్ఘ, నిరంతర పోరాటాల త్యాగాల విజయం ఈ మేడే. శతాబ్దాల తరబడి అణచివేతకు గురైన శ్రామికవర్గం 20 గంటల పని భారం విముక్తి నుండి 8గంటల పనిదినాలు సాధించి తమ హక్కులు సాధించుకున్న విజయాల సందర్భంగా ప్రపంచ కార్మిక లోకం మొత్తం మే 1వ తేదీని ప్రపంచ కార్మిక దినోత్సవంగా జరుపుకుంటుంది. 19వ శతాబ్దంలో పారిశ్రామిక విప్లవం కారణంగా అమెరికా, ఐరోపా దేశాల్లో అనేక పెద్ద పరిశ్రమలు స్థాపించబడ్డాయి. దీంతో పెట్టుబడిదారులు, కార్మికులు రెండు వర్గాలుగా ఏర్పడ్డాయి. 'ప్రపంచ కార్మికులారా ఏకంకండి.. పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప' అని కార్ల్‌మార్క్స్ ఇచ్చిన నినాదం యావత్ ప్రపంచం మొత్తం కార్మికులను ఉత్తేజపరిచి పోరాటాన్ని మరింత ముందుకు నడిపించింది. అమెరికా చికాగో నగరం, హేమార్కెట్ స్క్వేర్లో 1886 మే 1న పెద్దఎత్తున కార్మికులు సమ్మె చేపట్టి పని గంటలు 20నుండి 8 గంటలకు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఆగ్రహించిన పెట్టుబడిదారులు, పోలీసులతో కలిసి మే 4న కార్మికులపై కాల్పులు జరపగా కార్మికులు కొందరు ప్రాణాలు వదిలారు. దీనితో ప్రపంచ కార్మికులు మొత్తం ఉద్యమించారు. 1889 పారిస్లో జరిగిన రెండవ అంతర్జాతీయ సమావేశంలో హే మార్కెట్ అల్లర్లలో ప్రాణాలు కోల్పోయిన కార్మికులకు గుర్తుగా 'అంతర్జాతీయ కార్మిక దినోత్సవంగా' గుర్తించారు. చికాగోలో హే మార్కెట్ స్క్వేర్లో కార్మికుల స్మారక చిహ్నం ఏర్పాటు చేశారు. భారత దేశంలో 1923 మే 1 మద్రాస్లో అంతర్జాతీయ కార్మిక దినోత్సవం జరిపారు. భారతదేశంలో కార్మికుల హక్కులను పరిరక్షించడానికి అనేక చట్టాలు వచ్చాయి అవి: కనీస వేతన చట్టం (1948), వేతనాల చెల్లింపుల చట్టం (1936), పారిశ్రామిక వివాదాల చట్టం (1947), కార్మిక సంఘాల చట్టం (1926), పారిశ్రామిక ఉపాధి చట్టం (1946), వెట్టి చాకిరీ వ్యవస్థ నిర్మూలన చట్టం (1976), బాల కార్మిక నిరోధక చట్టం (1996), మెటర్నిటీ బెనిఫిట్ చట్టం (1961), కార్మాగారాల చట్టం (1948), ప్లాంటేషన్ కార్మికుల చట్టం (1951), గనుల చట్టం (1951), బోనస్ చెల్లింపుల చట్టం (1965), అంతర్రాష్ట్ర వలస కార్మికుల చట్టం (1979), మోటార్ రవాణా కార్మిక చట్టం (1961). భారత రాజ్యాంగంలోని నాలుగో భాగంలో ఉన్న ఆదేశిక సూత్రాలు/ నిర్దేశిక నియమాల్లో కార్మికుల సంక్షేమం గురించి పేర్కొన్నారు. ఆర్టికల్ 39 (డి) స్త్రీ పురుషులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి. ఆర్టికల్ 39 (ఇ) కార్మికులు వారి శారీరక దారుఢ్యానికి మించి పని చేయకుండా చూడాలి. ఆర్టికల్ 42 కార్మికులకు పని ప్రదేశాలలో గౌరవప్రదమైన వాతావరణాన్ని కల్పించాలి. భారత దేశంలో ముఖ్యంగా 12 ట్రేడ్ యూనియన్లు కేంద్ర ప్రభుత్వంచే గుర్తించబడ్డాయి. బి.ఎం. ఎస్., ఐ.ఎన్.టి.యు.సి., ఎ.ఐ.టి.యు.సి, హెచ్.ఎం.ఎస్. సి.ఐ.టి.యు.సి, ఎ.ఐ.యు.టి.యు.ఎ.సి., టి.యు.సి.సి., యస్.ఇ.వి.ఎ., ఎ.ఐ.సి.సి.టి.యు., ఎల్.పి.ఎఫ్., యు.టి.యు.సి., ఎన్.ఎఫ్.ఐటి.యు., వీటితో పాటు రైల్వే కార్మిక సంఘాలు, బ్యాంకు ఉద్యోగుల సంఘాలు, పారిశ్రామిక కార్మిక సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు పని చేస్తున్నాయి. కార్మికులకు అనారోగ్యం, ప్రసూతి, ఉద్యోగం కారణంగా గాయపడిన సందర్భాలలో కొన్ని కొన్ని ప్రయోజనాలను




అందించడానికి రూపొందించబడిన చట్టం. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్లు భారత దేశంలోని కార్మిక చట్టాలను ఏకీకృతం చేయడానికి క్రమబద్ధీకరించడానికి ఉద్దేశించబడ్డాయి. ఇవి కార్మికుల, యాజమాన్యాల మధ్య సంబంధాలను నియంత్రిస్తాయి. ఈకోడ్లు కార్మికులపై వివిధ రకాల ప్రభావం చూపుతాయి. కొన్ని అనుకూలమైనవిగా, మరికొన్ని ప్రతికూలమైనవిగా ప్రభావం చూపుతాయి. 29 పాత కార్మిక చట్టాల స్థానంలో నాలుగు లేబర్ కోడ్లనుప్రవేశ పెట్టడం జరిగింది. అవి వేతనాల కోడ్ (2019), పారిశ్రామిక సంబంధాల కోడ్(2020), సామాజిక భద్రత కోడ్(2020), వృత్తి పరమైన భద్రత, ఆరోగ్యం పని పరిస్థితుల కోడ్ (2020). ఈ కోడ్లు కార్మిక చట్టాలను సరళీకృతం చేయడం ద్వారా వ్యాపారం సులభతరం చేయడమే కాకుండా, కార్మిక హక్కులను కూడా పరిరక్షిస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. అయితే కొన్ని కార్మిక సంఘాలు ఈకోడ్లలోని కొన్ని నిబంధనలు కార్మికులకు వ్యతిరేకంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేంద్రప్రభుత్వం కార్మికుల కోసంవారి సామాజిక భద్రత, ఆరోగ్యం, విద్య, నైపుణ్యాభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను కేంద్ర కార్మిక మంత్రిత్వశాఖ ద్వారా ప్రవేశపెట్టింది. అవి ప్రధాన మంత్రి శ్రమ యోగిమాన్ ధన్ యోజన పథకం, నేషనల్ పెన్షన్ స్కీం ఫర్ ట్రేడర్స్ సెల్ఫ్ ఎంప్లాయిడ్ పర్సన్స్, ఎంప్లాయిడ్ పెన్షన్స్ స్కీం, అటల్ బీమ్ వ్యక్తి కళ్యాణ్ యోజన, ఈశ్రామ్ పోర్టల్, ఎం.జి.ఎన్.ఆర్.ఈ.జి.ఎస్., ఆయుష్మాన్ భారత్, గరీబ్ కళ్యాణ్ రోజ్ గార్ అభియాన్. కార్మికుల సంక్షేమం, ఉపాధి కల్పన కోసం రికార్డ్‌స్థాయిలో 32,646 కోట్లు కేటాయించబడ్డాయి. వీటిని గిరి కార్మికులకు సామాజిక భద్రత కల్పించడం, పట్టణ కార్మికుల కోసం జీవనోపాధిని మెరుగుపరచడం కోసం ఉపయోగించారు. ఈ మే డే సందర్భంగా కార్మికుల తరపున వారి హక్కుల పరిరక్షణకు నిరంతరం కృషి చేద్దాం, పోరాడుదాం, వారి త్యాగాలను స్మరించుకుందాం. పారిశ్రామిక అభివృద్ధికి తోడ్పాటునందిద్దాం. ●



# భాక్రా మిగులునీటిని మాకిచ్చేయండి

### పంజాబ్‌కు హర్యానా సర్కారు విజ్ఞప్తి

**చండీఘర్, ఏప్రిల్ 30:** పంజాబ్‌వద్ద భాక్రా రిజర్వాయర్‌లో అదనంగా మిగిలిపోయిన తాగునీరు తమకు ఇవ్వాలని హర్యానా అభ్యర్థిస్తోంది. లేకపోతే ఆ నీరు పాకిస్థాన్‌కు వెళ్లడం మినహా ప్రయోజనం ఉండదని వెల్లడించింది. భారత్ సింధూజలాల ఒప్పందం నిలిపివేత క్రమంలో హర్యానా సిఎం నాయబ్‌సింగ్ సైనీ కీలకప్రకటనచేసారు. సింధుజలాల ఒప్పందంపరిధిలోని అతిపెద్ద ఆనకట్టల్లో భాక్రా ఒకటి. జూన్‌నాటికి భాక్రానంగల్ ఆనకట్టను ఖాళీ చేయడం అవసరం. అప్పుడే వర్షాకాలంలో నదీజలాలు నిల్వచేసుకోవచ్చు. రిజర్వాయరులో నీరులేకపోతే అదనపు జలాలు హరి-కె-పట్టాన్‌నుంచి పాకిస్థాన్‌లోకి వెళ్లిపోతాయని, అటు పంజాబ్ ఇటు హర్యానాకు ఎలాంటి మేలు జరగదని నాయ్‌సింగ్ చెప్పారు. ఢిల్లీలో ఆమ్ ఆద్మీపార్టీ అధికారంలో ఉన్నరోజులన్నీ నీటి విడుదలకు పంజాబ్ ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరాలులేవు. ప్రస్తుతం అక్కడ ఆప్‌ప్రభుత్వం లేదు. అలాంటి సమయంలో ఢిల్లీప్రజలను శిక్షించేలా అలాంటిప్రకటనలు ఎందుకుచేస్తున్నారు. అసలు హర్యానాకు రావాల్సిన వాటా జలాలే అందుబాటులోకి రాలేదు. గతనెల భాక్రాబేస్‌మేనేజ్‌మెంట్‌బోర్డు విడుదలచేసిన నీటిలో పంజాబ్, రాజస్థాన్, ఢిల్లీకి పోగా హరియానాకు మిగిలింది కేవలం 6800 క్యూసెక్కులుమాత్రమే ఉంది. ఇక న్యాయంగా హర్యానాకు వాటా ఇచ్చినా అది భాక్రా ప్రాజెక్టులో నిల్వ ఉండే నీటిలో 0.0001శాతంతో సమానం అని నాయబ్‌సింగ్ అన్నారు.

## మోస్ట్‌వాంటెడ్ హాఫీజ్ సయీద్‌కు

# పాక్ పటిష్టభద్రత!





**లాహోర్, ఏప్రిల్ 30:** జమ్ము కశ్మీర్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతం పెహల్‌గామ్ ఉగ్రదాడి వెనుక పాకిస్థాన్‌కు చెందిన నిషేధిత ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా టాప్ కమాండర్ హాఫీజ్ సయీద్ హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ దాడికి పాల్పడింది తామే అని 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్)' ప్రకటించినప్పటికీ.. దీని వెనుక హాఫీజ్ హస్తం ఉందని ఇప్పటికే పలు కథనాలు వెలుగులోకి వచ్చాయి. అయితే, ఈ కరుడు గట్టిన ఉగ్రవాదికి పాకిస్థాన్ ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రతను కల్పిస్తుండటం గమనార్హం. హాఫీజ్ మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది అయినప్పటికీ రహస్య ప్రదేశంలో కాకుండా లాహోంలోని జోరమ్ తౌమ్ అనే అత్యంత రద్దీ ప్రాంతంలో తన ఫ్యామిలీతో కలిసి నివాసం ఉంటున్నాడు. అతడికి పాక్ ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రతను కల్పిస్తుండటం గమనార్హం. హాఫీజ్ నివాసం వద్ద పాక్ ప్రభుత్వానికి చెందిన సెక్యూరిటీ సిబ్బంది నిరంతరం భద్రత కల్పిస్తున్నట్లు నిఘా సంస్థలు గుర్తించాయి. ఇందుకు సంబంధించిన ఉపగ్రహ చిత్రాలు కూడా ప్రస్తుతం బయటకు వచ్చాయి. హాఫీజ్ ఇంటి వద్ద 24 గంటలూ ప్రభుత్వం భద్రత కల్పిస్తున్నట్లు సమాచారం. అతని ఇంటి వద్ద పార్క్, మసీదు, మదర్సాలు కూడా ఉన్నట్లు ఉపగ్రహ చిత్రాల ద్వారా తెలుస్తోంది. భవనం కింద ఓ బంకర్ కూడా ఉందని నిఘా సంస్థలు పసిగట్టాయి. అయితే పాక్ ప్రభుత్వం మాత్రం హాఫీజ్ జైల్లో ఉన్నాడంటూ బుకాయిస్తుండటం ఆందోళన కలిగించే విషయం. ఉగ్ర సంస్థకు నిధులు సమకూర్చిన కేసులో అతడికి 31 ఏళ్ల జైలు శిక్ష పడిందని, అతడు జైల్లోనే ఉన్నాడని వాదిస్తోంది. కానీ, హాఫీజ్ మాత్రం చాలా ఏళ్లుగా బహిరంగంగా ప్రజల మధ్యలోనే స్వేచ్ఛగా తిరుగుతున్నట్లు నిఘా సంస్థలు చెపుతున్నాయి. లష్కరే తోయిబాకు అనుబంధంగా ఉండే కరుడుగట్టిన ఉగ్రవాదుల బృందం ఈనెల 22న బైసరాన్‌లో నిర్దాక్షిణ్యంగా 26 మంది అమాయకులను పొట్టనపెట్టుకున్న విషయం తెలిసిందే. నిఘా వర్గాల సమాచారం ప్రకారం ఆ బృందంలో ప్రధానంగా విదేశీ ఉగ్రవాదులు ఉంటారు. ఆ ఉగ్రవాదులకు స్థానిక ఉగ్రవాదులతోపాటు కశ్మీర్‌లో మద్దతుదారులు కొందరు సహకరించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పాకిస్థాన్ ప్రభుత్వ మద్దతుతో హాఫీజ్ సయీద్, అతడి ముఖ్య అనుచరులు ఈ ఉగ్రమూకలకు నేరుగా సాయపడి ఉండవచ్చని నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి. ముంబైలో 26/11 దాడికి కారకుడైన హాఫీజ్ సయీద్ ఈ దాడిలో పాల్గొన్న టెర్రరిస్టులకు కూడా అన్ని రకాలుగా సహాయసహకారాలు అందించి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉగ్రదాడికి పాల్పడిన బృందం చాలాకాలంగా కశ్మీర్ లోయలో క్రియాశీలకంగా ఉన్నట్టు నిఘా వర్గాలు చెబుతున్నాయి. గత ఏడాది సోనామార్గ్, బూతాపత్రీ, గండేర్బల్ దాడుల్లో ఈ బృందమే పాలుపంచుకున్నట్లు తెలిసింది. గత అక్టోబర్‌లో బూతాపత్రిలో జరిగిన దాడిలో ఇద్దరు ఆర్మీ జవాన్లు సహా మొత్తం నలుగురు మృతి చెందారు. అదే నెలలో సోనామార్గ్ టెన్నెల్ కార్మికులను టార్గెట్ చేస్తూ జరిగిన దాడిలో ఆరుగురు కార్మికులతో పాటు ఓ డాక్టర్ మరణించారు. ఇక సయీద్‌ను భారత్ మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్‌గా ప్రకటించింది. ఐక్యరాజ్య సమితి కూడా అతడిని అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించింది. అతడి తలపై అమెరికా 10 మిలియన్ డాలర్ల రివార్డ్ ప్రకటించింది.



## వారంరోజులుగా సరిహద్దుల్లో పాక్ కవ్వింపు కాల్పులు

### తిప్పికొడుతున్న భారత్ బలగాలు

**శ్రీనగర్, ఏప్రిల్ 30:** పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్, భారత్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో సంయవనం పాటించాల్సిన పాకిస్థాన్ సరిహద్దులో వక్రబుద్ధిని ప్రదర్శిస్తోంది. నియంత్రణ రేఖ వద్ద దుశ్చర్యకు పాల్పడుతోంది. గత ఐదు రోజులపాటు సరిహద్దులోకాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిన దాయాది దేశం తాజాగా బుధవారం 6వ రోజు కూడా భారత సైన్యంపై కాల్పులకు తెగబడింది. దీంతో పాక్‌భారత్ సరిహద్దులో రెండు దేశాల మధ్య ఏం జరుగుతోందో అన్న భయాందోళనలు నెలకొన్నాయి. గతఅర్ధరాత్రి జమ్ముకశ్మీర్‌లోని నాలుగు సరిహద్దు జిల్లాల్లో పలు సెక్టార్లలో భారత సైన్యం పైకి కాల్పులు జరిపింది. అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఉన్న పరగ్వాల్ సెక్టార్‌తో పాటు రాజౌరీ జిల్లాలోని సుందర్‌బనీ, నౌషెరా, అఖ్నూర్ సెక్టార్లలో పాక్ సైన్యం కాల్పులు జరిపినట్లు సైనిక వర్గాలు తెలిపాయి. అయితే భారత సైన్యాన్ని లక్ష్యంగా చేసుకొని పాకిస్థాన్ కాల్పులకు పాల్పడినట్లుగా పేర్కొన్నాయి. అటూ బారాముల్లా, కుప్వారా జిల్లాల్లోనూ కవ్వింపు చర్యలకు దిగినట్లుగా తెలుస్తోంది. శత్రువుల దాడికి మన బలగాలు సమర్థమంతంగా తిప్పికొట్టాయని సైనిక వర్గాలు తెలిపాయి. ఏప్రిల్ 24 అర్ధరాత్రి నుంచి వరుసగా ప్రతిరోజూ పాక్ సైన్యం భారత దళాలపై ఎల్ఓసీ వెంబడి కాల్పులు జరుపుతున్నాయి. దీటుగా భారత్ ఆర్మీ బదులిస్తోంది. బుధవారం అర్ధరాత్రి అనేక రౌండ్ల కాల్పులు జరిగినట్లు శబ్దాలు వినిపించాయని పరగ్వాల్ స్థానికులు చెబుతున్నారు. దాదాపు 1012 రౌండ్ల కాల్పులు జరిగాయని, అందుకు భారత సైన్యం ప్రతీకారం తీర్చుకుందని పరగ్వాల్ నివాసి అంకుర్ సింగ్ తెలిపారు. అయితే దాదాపు 78 సంవత్సరాల తర్వాత ఈ రకమైన కాల్పుల విరమణ ఉల్లంఘన జరగడం చూశామని తెలిపారు. ప్రస్తుతం మేం హై అలర్ట్‌లో ఉన్నామని తెలిపారు.

# మాదేశంపై సైనిక చర్యకు భారత్ కుట్రలు

### పాక్ మంత్రి అతవుల్లా తరార్



**ఇస్లామాబాద్, ఏప్రిల్ 30:** పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ పాక్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. ఇప్పటికే సింధూ జలాలను నిలిపివేసిన మోడీ సర్కారు ఏ క్షణమైనా ఉగ్రమూకలకు సహకరించిన వారికి బుద్ధిచెప్పాలని భావిస్తోంది. మరోవైపు ఉగ్రవాదాన్ని అణచివేసే విషయంలో సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నామని ప్రధాని నరేంద్రమోడీ ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే పాకిస్థాన్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేసింది. రానున్న 24 గంటల్లో తమ దేశంపై భారత్ సైనిక చర్య చేపట్టేందుకు ప్రణాళికలు రచిస్తోందని పాకిస్థాన్ సమాచార మంత్రి అతవుల్లా తరార్ పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతిస్పందనగా భారత్ సైనిక చర్య తీసుకునేందుకు భారత్ ప్రణాళికలు రచిస్తోంది. అందుకు కచ్చితమైన నిఘా సమాచారం మా దగ్గరఉంది. రానున్న 24నుంచి 36 గంటల్లో సైనిక చర్యలు తీసుకుంటుంది. మేంకూడా ఉగ్రవాద బాధితు లమే. బాధ్యతయుతమై దేశంగా పహల్గాం దాడికి సంబంధించి వాస్తవాలను తెలుసుకునేందుకు తటస్థ, పారదర్శక, స్వతంత్ర దర్యాప్తునకు సహకరిస్తామని ఇప్ప టికే చెప్పాం. అయినా సరే మా దేశంపై భారత్ సైనిక చర్యకు సిద్ధమవుతోంది. ఒకవేళ దాడికి పాల్పడితే ప్రతి చర్య తీవ్రంగా ఉంటుంది. దానికి భారత్ పూర్తి బాధ్యత వహిస్తుంది అని తరార్ వ్యాఖ్యలు చేశారు.

పహల్గామ్ ఉగ్రదాడి త్వరాత భారత్‌పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలను తీవ్రతరంచేయవద్దని అమెరికా పిలుపు నిచ్చింది. కశ్మీర్ పరిస్థితులపై మాట్లాడేందుకు అమెరికా, భారత్‌పాక్ రెండు దేశాలను సంప్రదిస్తున్నట్లు అమెరికా విదేశాంగ ప్రతినిధి టామీ బ్రూస్ తెలిపారు. వచ్చే రెండు రోజుల్లో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో భారత్, పాకిస్థాన్‌కు సంబంధించిన విదేశాంగ మంత్రులతో మాట్లాడతారని తెలిపారు. ప్రస్తుతం పరిణామాలను ఎప్పటికప్పుడు గమనిస్తూనే ఉన్నామని అన్నారు.

మరోవైపు యూకే ప్రభుత్వం కూడా భారత్, పాకిస్థాన్ ప్రశాంతంగా ఉండి, రెండు దేశాల చర్చల ద్వారా ఉద్రిక్తతలను తగ్గించుకోవాలని పిలుపునిచ్చింది. పహల్గాంలో ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రవాదులు జరిపిన పాశవిక దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో భారత్, పాక్ మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. ఈ క్రమంలోనే పలు కీలకనిర్ణయాలు తీసుకుంది. సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేయడం, పాక్ పౌరులు భారత్‌ను విడిచి వెళ్లాలని గడువు విధించడం వంటి చేసింది. ఈ చర్యలతో పాకిస్థాన్ అక్కసు వెళ్లగక్కింది. సిమ్లా ఒప్పందంతో పాటు మిగిలిన ద్వైపాక్షిక ఒప్పందాలను పక్కనబెడుతున్నట్లు ప్రకటించింది. తమ గగనతలంలో భారత్‌కు చెందిన విమానాలకు అను మతిని నిలిపేస్తున్నట్లు వెల్లడించింది.



# ప్రపంచ ఆధ్యాత్మిక చార్‌ధామ్ యాత్ర ప్రారంభం

**డెహ్రాడూన్, ఏప్రిల్ 30:** ప్రఖ్యాత ఆధ్యాత్మిక యాత్ర చార్ ధామ్ ప్రారంభమైంది. అక్షయ తృతీయను పురస్కరించుకొని గంగోత్రి, యమునోత్రి ధామ్‌ల తలుపులు తెరవడం వల్ల చార్ ధామ్ యాత్ర అధికారికంగా ప్రారంభించినట్లయింది. గంగోత్రి ధామ్ తలుపులు ఉదయం 10:30 గంటలు తెరుచుకోగా, యమునోత్రి ధామ్ తలుపులు ఉదయం 11:55 గంటలకు పూజారులు ఓపెన్ చేశారు. అనంతరం రెండు పుణ్యక్షేత్రాల్లో పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. యాత్రను పురస్కరించుకొని రెండు ఆలయాలను పూల దండలతో అలంకరించారు. యమునా దేవి శీతాకాల నివాసం ఖర్సాలి నుంచి పల్లకీని యమునోత్రి ధామ్‌కు తీసుకొచ్చారు. యమున మాతా పల్లకీ ఉదయం 8.30 గంటలకు చేరుకున్నది. పూజ కార్యక్రమాల అనంతరం 11.55 గంటలకు ఆలయ తలుపులు తెరుచుకున్నాయి. అంతకుముందు పల్లకీ భైరవ ఆలయం నుంచి గంగాదేవీ పల్లకీ ఉదయం 8:30 గంటలకు గంగోత్రికి వచ్చింది. పూజ కార్యక్రమాల తర్వాత ఉదయం 10:30 గంటలకు వేద మంత్రాల నడుమ ఆలయ తలుపులు తెరిచారు. ఉత్తరాఖండ్‌లోని నాలుగు ప్రముఖ ఆలయాలైన గంగోత్రి, యమునోత్రి ఆలయాలు బుధవారం తెరుచుకున్నాయి.

ఇక కేదార్‌నాథ్ ఆలయం మే 2న, బద్రీనాథ్ ఆలయం మే 4న తెరుచుకోనున్నాయి. శీతాకాలం సందర్భంగా ఆరు నెలల పాటు ఆలయాల తలుపులు మూసివేశారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఈసారి చార్‌ధామ్ యాత్ర కోసం పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. భారత్ నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా ప్రతి సంవత్సరం భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. భక్తుల ప్రయాణం, దర్శనం సజావుగా, సురక్షితంగా సాగేలా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. భక్తుల యాత్ర సజావుగా జరిగేందుకు వివిధ ప్రదేశాల్లో సీసీటీవీ కెమెరాలను అమర్చారు. అంతేకాకుండా ట్రాఫిక్‌ను నిర్మూలించేందుకు డ్రోన్లు కూడా ఉపయోగిస్తున్నారు. ఈ ప్రాంతాన్ని జోన్లు, సెక్టార్లుగా విభజించి భారీగా పోలీసు బలగాలను మోహరించినట్లు అధికారులు తెలిపారు. భక్తులకు సాయం చేసేందుకు అదనంగా ఐదు పర్యటక పోలీసు కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు.

# కోల్‌కతా హోటల్‌లో భారీ అగ్నిప్రమాదం

### 14 మంది మృతి, పలువురికి గాయాలు

**కోల్‌కతా, ఏప్రిల్ 30:** బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని ఓ హోటల్‌లో మంగళవారం రాత్రి భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో 14మంది మృతి చెందినట్లు ఓ సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. మరికొంత మందిని రెస్క్యూ బృందాలు రక్షించినట్లు పేర్కొన్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం, ఫల్పట్టి మచ్చువ అనే ప్రాంతంలో ఉన్న రితురాజ్ హోటల్‌లో మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో అగ్నిప్రమాదం సంభవిం చింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే 10 అగ్నిమాపక యంత్రాలు ఘటనాస్థలికి చేరి 8 గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. అనేక మంది రక్షించారు. ఈ ఘటనలో దాదాపు 14మరణిం చగా, 13మంది గాయపడ్డారు. మృతుల్లో హోటల్ సిబ్బంది, మహిళ, ఇద్దరు చిన్నారులు ఉన్నట్లు సమా చారం. సహాయక చర్యలు ఇంకా కొనసాగు తున్నాయని కోల్‌కతా పోలీసు కమిషనర్ మనోజ్ కుమార్ వర్మ తెలిపారు.

## వాణిజ్య ఒప్పందం దిశగా

# భారత్ యుఎస్ చర్చలు

**వాషింగ్టన్, ఏప్రిల్ 30:** యూఎస్, భారత్ మధ్య వాణిజ్య సుంకాలపై చర్చలు చాలా బాగా జరుగుతున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. త్వరలో భారత్‌తో వాణిజ్య ఒప్పందం జరిగే అవకాశం ఉందన్నారు. వైట్‌హౌస్ వద్ద విలేకరులతో సమావేశంలో సుంకాలు, భారత్ అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం గురించి ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు భారత్‌తో సుంకాల చర్చలు బాగా జరుగుతున్నాయి. ఇండియాతో వాణిజ్య ఒప్పందం ఉంటుందని భావిస్తున్నాను. భారత ప్రధాని నరేంద్ర మోడీ మూడు వారాల క్రితం అమెరికాకు వచ్చారు. ఆ సమయంలో సుంకాలపై ఒక ఒప్పందం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఏమి జరుగుతుందో చూద్దాం అని ట్రంప్ వ్యాఖ్యానించారు. మరోవైపు, భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందంపై అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ స్పందించారు. ఇరుదేశాల మధ్య టారిఫ్ చర్చల్లో పురోగతి కనిపిస్తోందని తెలిపారు. భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి కుదుర్చుకోవడానికి అమెరికా చాలా దగ్గరగా ఉందన్నారు. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భారత పర్యటనలో ప్రధాని మోడీతో వాణిజ్య చర్చలు జరిగాయని పేర్కొన్నారు. దీనిపై త్వరలో ఢిల్లీ ఒక ప్రకటన చేసే అవకాశం ఉందన్నారు. ఇతర దేశాలతో పోలిస్తే ఇండియా వంటి సానుకూలమైన దేశాలతో చర్చలు జరపడం సులభమని కొనియాడారు. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భారత్ పర్యటన తర్వాత అమెరికా ఇండియా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కోసం జరిగిన చర్చల్లో గణనీయమైన పురోగతి లభించిందని వాన్స్ కార్యాలయం ప్రకటించింది. చర్చల కోసం నిబంధనలను ఖరారు చేస్తున్నట్లు ప్రకటించింది. ఉమ్మడి ఆర్థిక ప్రాధాన్యతల గురించి మరిన్ని చర్చలకు రోడ్ మ్యాప్‌ను కూడా నిర్దేశించింది. పరస్పర ప్రయోజనకరమైన రీతిలో ద్వైపాక్షిక వాణిజ్యంపై చర్చలు జరుగుతాయని వెల్లడించింది. ఏప్రిల్ ప్రారంభంలో ట్రంప్ పలు దేశాలపై టారిఫ్‌ల మోత మోగించారు. అయితే 90 రోజుల పాటు ఈ సుంకాల అమలుకు అమెరికా బ్రేక్ ఇచ్చింది. ట్రంప్ విధించిన సుంకాలపై చాలా దేశాలు ప్రతీకార చర్యలకు దిగాయి. అయితే, భారత్ మాత్రం ఆచితూచి వ్యవహరించింది. ప్రతీకార సుంకాలకు బదులుగా అగ్రరాజ్యంతో ద్వైపాక్షిక ఒప్పందం కుదుర్చుకోవడంపై దృష్టి పెట్టింది. ఇటీవల ప్రధాని మోడీ అమెరికా పర్యటన సందర్భంగా ఇరుదేశాల మధ్య వాణిజ్య ఒప్పందానికి అడుగులు పడ్డాయి.

## భారత్‌లో ఐస్‌క్రీమ్‌లు అమ్ముకుంటున్న పాక్‌మాజీ ఎంపి

**ఫతేబాద్(హర్యానా), ఏప్రిల్ 30:** పాకిస్థాన్ మాజీ ఎంపీ ప్రస్తుతం భారత్‌లో ఐస్‌క్రీములు అమ్ముకుంటున్నారు. పాక్ మాజీప్రధాని బెనజీర్ భుట్టో ప్రభుత్వ హయాంలో ఎంపీగా ఉన్న దివాయా రామ్, హరియాణాలోని ఫతేబాద్‌లో ఐస్‌క్రీమ్ వ్యాపారం చేసుకుంటున్నారు. 25ఏళ్ల క్రితం భారత్‌కు వచ్చిన ఆయన ఇక్కడే స్థిరపడిపోయారు. తాజాగా భారత్ పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో వీసాలు రద్దు చేయగా ఈయన వ్యవహారం ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. పాకిస్థాన్‌కు చెందిన దివాయా రామ్ 1989లో మైనార్టీల రిజర్వ్ స్థానంలో ఎంపీగా ఎన్నికయ్యారు. అయితే, పార్లమెంట్ సభ్యులుగా ఉన్నా ఆయన కుటుంబంపై దాడులు మాత్రం ఆగలేదు. ఒకసారి దివాయా రామ్ కూతురిని కిడ్నాప్ చేసినా, ఆయన ఏం చేయలేకపోయారు. దీంతో ఆవేదన వ్యక్తం చేసిన ఆయన, ఎంపీ పదవికి రాజీనామా చేసి కుటుంబంతో సహా భారత్‌కు వచ్చేశారు. భార్య రాజో రాణి, 8మంది కుమారులు, ఇద్దరు కూతుళ్లు సహా 13 మంది వచ్చారు. ఆ తర్వాత ఒక కుమార్తె జన్మించగా, ప్రస్తుతం వీరి కుటుంబ సభ్యుల సంఖ్య 30కి చేరింది. తొలుత నెల రోజుల టూరిస్ట్ వీసాతోవచ్చిన ఆయన, తర్వాత ప్రతి ఏడాది రెన్యూవల్ చేసుకుంటూ వస్తున్నారు. అనంతరం ఐదేళ్లకు ఆయన వీసాను 2018 వరకు పొడిగించారు. 2018 వరకు వీసాతో ఉన్న దివాయా రామ్ కుటుంబం శరణార్థిగా భారత్‌లోనే ఉంటున్నారు. అనంతరం 2018లో వీసా గడువు పెంపునకు దరఖాస్తు చేసుకున్నారు. ఆ తర్వాత తన వీసాగడువు పెంచడానికి స్థానిక నేతలతో పాటు అందరిచూట్టూ తిరిగారు. భారత పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకుని ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం వీరి దరఖాస్తులు పరిశీలనలో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. బిజెపి నేతలనుకలిసి రామ్ ఈ నేపథ్యంలోనే పౌరసత్వం కోసం దివాయా రామ్ బీజేపీ అధ్యక్షుడు మోహన్‌లాల్ బరోలిని కలిశారు. తన కుటుంబం పాకిస్థాన్ తిరిగి వెళ్లేందుకు సిద్ధంగా లేదని పౌరసత్వం ఇప్పించేందుకు సాయం చేయాలని కోరారు. అక్కడికి వెళ్తే తన కుటుంబాన్ని అక్కడి ముస్లింలు వేధిస్తారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## పాక్‌లో 50 డిగ్రీలకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు



**ఇస్లామాబాద్, ఏప్రిల్ 30:** పొరుగు దేశం పాకిస్థాన్‌లో ఎండలు మండిపోతున్నాయి. ఈ వారం ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో 50 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకోవచ్చని, ఇది ఏప్రిల్ నెలకు సంబంధించి ప్రపంచ రికార్డును బద్దలు కొట్టవచ్చని అంచనాలు వెలువడుతున్నాయి. పాకి స్థాన్ వాతావరణ శాఖ ఇప్పటికే ఏప్రిల్ 26 నుంచి 30 వరకు దేశంలో తీవ్ర వడ గాల్పుల పరిస్థితులు నెలకొంటా యని హెచ్చరికలు జారీ చేసింది. గత వారాంతంలోనే పాకిస్థాన్‌లోని మధ్య, దక్షిణ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 48 డిగ్రీల సెల్సియస్‌ను తాకాయి. బుధ, గురువారాల్లో ఇది 49 డిగ్రీల సెల్సియస్‌కు పెరిగే అవకాశం ఉందని ప్రముఖ ఇసిఎండబ్ల్యూఎఫ్ వాతావరణ నమూనా అంచనా వేస్తోంది. అయితే, గత వారాంతపు ఉష్ణోగ్రతలను ఇదే మోడల్ సుమారు 2 నుంచి 3 డిగ్రీలు తక్కువగా అంచనా వేసిందని, అందువల్ల వాస్తవ గరిష్ట ఉష్ణోగ్రత 50 డిగ్రీల మార్కును దాటే అవకాశం ఉందని అంతర్జాతీయ ఆంగ్లపత్రిక ప్రత్యేక కథనం ప్రచురించింది. ప్రజలు అత్యవసర మైతేతప్ప బయటకు రావొద్దని, తగిన జాగ్రత్తలు తీసుకో వాలని పాకిస్థాన్ వాతావరణశాఖ పిఎండి సూచించింది. ఈ తీవ్రమైన వేడి ప్రభావం కేవలం పాకిస్థాన్‌కే పరిమితం కాలేదని తెలుస్తోంది. ఈ వారం పాకిస్థాన్‌తో పాటు భారత్, ఇరాన్, కువైట్, సౌదీఅరేబియా, ఇరాక్, ఖతార్, సుడాన్, యూఏఈ, ఒమన్, దక్షిణసుడాన్, బహ్రె యిన్, మాలి, సెనెగల్, చాద్, ఇథియోపియా, నైగర్, ఎరిత్రియా, నైజీరియా, బుర్కినా ఫాసో సహా మొత్తం 21 దేశాల్లో ఉష్ణోగ్రతలు 43 డిగ్రీల సెల్సియస్ అంటే 110డిగ్రీల ఫారెన్‌హీట్ కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశంఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## పహల్గాం దాడి సూత్రధారి లష్కరే కమాండర్ ఫరూఖ్



**శ్రీనగర్; ఏప్రిల్ 30:** జమ్ముకశ్మీర్‌లోని పెహల్‌గాంలో మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన బైసరాన్ వ్యాలీలో ఉగ్రవాదులు నరమేధం సృష్టించిన విషయం తెలిసిందే. టూరిస్ట్‌లే లక్ష్యంగా విచక్షణా రహితంగా కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై దర్యాప్తు ముమ్మరంచేసిన ఎన్ఐఏ (జాతీయ దర్యాప్తు సంస్థ)కు కీలక విషయాలు వెల్లడవుతున్నాయి. తాజాగా పెహల్‌గామ్ ఉగ్రదాడి వెనుక లష్కరే తోయిబా కమాండర్ ఫరూక్ అహ్మద్ కీలక పాత్ర పోషించినట్లు ఎన్ఐఏ అనుమానిస్తోంది. పెహల్‌గామ్ దాడి తర్వాత కశ్మీర్ లోయలో భద్రతా బలగాలు ఉగ్రవాదుల కోసం వేట మొదలు పెట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా పలు జిల్లాల్లోని ఉగ్రవాదులు, అనుమానితుల ఇళ్లను బాంబులతో పేల్చేస్తున్నాయి. కుప్వారాలోని ఫరూక్ అహ్మద్ ఇంటిని కూడా భద్రతా దళాలు ఇటీవలే కూల్చేశాయి. అహ్మద్ ప్రస్తుతం పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉన్నట్లు తెలుస్తోంది.

తన స్లీపర్ సెల్ నెట్‌వర్క్ ద్వారా గత రెండేళ్లుగా కశ్మీర్‌లో పలు ఉగ్రదాడులు నిర్వహించడంలో అహ్మద్ కీలక పాత్ర పోషించినట్లు ఎన్ఐఏ గుర్తించింది. వీటిలో తాజాగా జరిగిన పెహల్‌గామ్ దాడి ఒకటి. ఇక పాకిస్థాన్‌లోని మూడు సెక్టార్ల నుంచి కశ్మీర్‌లోకి ఉగ్రవాదులు చొరబడేందుకు అహ్మద్ సహకరిస్తున్నట్టు ఎన్ఐఏ వర్గాలు తెలిపాయి. ఈ లష్కర్ కమాండర్‌కు లోయలోని పర్వత మార్గాల గురించి విస్తృతమైన పరిజ్ఞానం ఉందని పేర్కొన్నాయి. నిఘా వర్గాల అంచనాల ప్రకారం అహ్మద్ 1990 నుంచి 2016 వరకూ పాక్ - భారత్ మధ్య పలుమార్లు ప్రయాణించినట్లు గుర్తించారు. పెహల్‌గామ్ దాడి తర్వాత ఫరూక్ అహ్మద్ సహాయకులను భద్రతా దళాలు అదుపులోకి తీసుకున్నాయి. గత రెండేళ్లుగా అహ్మద్ పాకిస్థాన్ నుంచి పనిచేస్తూ కశ్మీర్‌లోని తన నెట్‌వర్క్‌ను సంప్రదించడానికి సురక్షిత కమ్యూనికేషన్ యాప్‌లను ఉపయోగిస్తున్నట్లు కూడా నిఘా వర్గాలు తెలిపాయి.

పశ్చిమగోదావరి,ఏలూరు
వార్త

# ప్రశాంతంగా పోలీస్ సెట్ పరిశీలించిన కలెక్టర్

**భీమవరం ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** జిల్లాలో పోలీసెట్ ప్రవేశ పరీక్షలను ప్రశాంతంగా పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి భీమవరం విష్ణు కాలేజీ బి.సీతా పాలిటెక్నిక్ కాలేజీ నందు ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులు పరీక్షలు రాయడాన్ని స్వయంగా పరిశీలించారు. విష్ణు కాలేజీ సెంటర్ కు ఎంతమందిని కేటాయించారు, ఎంతమంది హాజరయ్యారు తదితర వివరాలను చీఫ్ కోఆర్డినేటర్ ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ పోలీసెట్ -2025 ప్రవేశ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాటులను చేయడం జరిగిందన్నారు. జిల్లాలో మొత్తం 18 సెంటర్లలో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేయడం జరిగిందని, వీటిలో భీమవరంలో 4, తాడేపల్లిగూడెంలో 2, తణుకులో 8, నరసాపురంలో 4 పరీక్ష కేంద్రాలు ఉన్నాయన్నారు. జిల్లాలో 4,354 మంది విద్యార్థులు, 2,917 మంది విద్యార్థినులు మొత్తం 7,254 మంది పోలీసెట్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా, 6,489 మంది పరీక్షలకు హాజరయ్యారని, 782 మంది పరీక్షలకు గైర్హాజర్ అయినట్లు తెలిపారు. బుధవారం ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు ఆయా సెంటర్లో పరీక్షలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద తగిన పోలీసు బందోబస్తు, వేసవిని దృష్టిలో ఉంచుకొని వైద్య శిబిరాలు, త్రాగునీటి సదుపాయాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రశాంత వాతావరణంలో పోలిసెట్ ప్రవేశ పరీక్షల నిర్వహణను పూర్తిచేసిన అధికారులు, పోలీసులు, ఇతర సిబ్బందిని జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంలో చీఫ్ కోఆర్డినేటర్ సిహెచ్ నల్లపు రాజు, సహాయ కోఆర్డినేటర్ రామకృష్ణ, తదితరులు ఉన్నారు.



# గ్రూపులు కడితే కొత్త నాయకుడిని తయారు చేస్తా

## - మంత్రి పార్థసారథి హెచ్చరిక

**చాట్రాయి, ఏప్రిల్ 30, ప్రభాతవార్త :** చాట్రాయి మండలంలో పలు గ్రామాలలో తెలుగుదేశం పార్టీలో గ్రూపులు కొడుతూ పార్టీని అప్రతిష్ట పాలు చేయడంతో పాటు పార్టీకి నష్టం చేసే విధంగా ప్రవర్తిస్తే ఆయా గ్రామాలలో కొత్త నాయకుడిని తయారుచేసి రంగంలోకి దింపుతానని రాష్ట్ర గృహ నిర్మాణం మరియు సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి హెచ్చరించారు. చాట్రాయి మండలం పోలవరం గ్రామంలో తెలుగుదేశం పార్టీలో గ్రూపు తగాదాలు తారాస్థాయికి చేరడంతో మంత్రి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆ గ్రామంలో మండల తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షుడు మరిడి చిట్టిబాబు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు యర్రా హేము మధ్య పచ్చ గడ్డి వేస్తే బొగ్గు మంటోంది. ఇటీవల మట్టితోలకాలలో ఇద్దర మధ్య విభేదాలతో పోలీసులు ట్రాక్టర్లు జెసిబి లు సీజ్ చేసే పరిస్థితి వరకు వచ్చింది. దీనిపై ఆగ్రహించిన మంత్రి పోలవరం గ్రామంలో ఇరువు వర్గాల్లో సమన్వయం చేసేందుకు మంగళవారం చిట్టిబాబు ఇంటి వద్ద కూర్చుని మాట్లాడేందుకు రంగం సిద్ధం చేశారు. ఆ ఇంటికి రావటానికి హేము వర్గం వ్యతిరేకించడంతో ఇద్దరితో విడివిడిగా చర్చలు జరిపారు. దీనిపై ఆగ్రహానికి గురైన మంత్రి ఏ గ్రామంలో గ్రూపు కట్టిన కొత్త నాయకుడిని తయారు చేస్తానని హెచ్చరికలు జారీ చేశారు.



**మండలం మొత్తం గ్రూపు తగాదాలే**

చాట్రాయి మండలంలో 18 గ్రామపంచాయతీలు ఉండగా దాదాపు 14 గ్రామపంచాయతీలలో గ్రూపు తగాదాలు ఉన్నాయని చెప్పాలి. పార్టీ అధికారంలో రాకముందు నుండే గ్రూపు కొన్ని గ్రామాల్లో తగాదాలు ఉండగా పార్టీ అధికారంలోకి వచ్చాక ఆధిపత్య పోరుతో మరిన్ని గ్రామాలలో గ్రూపులో అధికమయ్యాయి. మండల కేంద్రమైన చాట్రాయి విషయానికొస్తే ఏ కార్యక్రమం జరిగినా రెండు గ్రూపులు విడివిడిగా చేయటం ఆనువాయితీగా వస్తోంది. పార్టీ కార్యాలయాలు కూడా రెండుగా విభజించుకుని కార్యకర్తలను పంచుకుంటున్నారు. అదేవిధంగా బూరుగుగూడెం, పర్వతాపురం, నరసింహారావు పాలెం, చనుబండ, కృష్ణారావు పాలెం, చీపురుగూడెం, కొత్తగూడెం, తుమ్మ గూడెం, జనార్ధన వరం తదితర గ్రామాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొని ఉంది. పంచాయతీ ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో గ్రూపు తగాదాలను సమన్వయం చేయటంలో విఫలమైతే పార్టీకి మరింత నష్టం జరిగే అవకాశాలు ఉన్నాయని నిబద్ధత కలిగిన కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రూపుల వల్ల పార్టీకి నష్టం జరిగే ప్రతిపక్ష వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మేలు జరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయని పలువురు భావిస్తున్నారు. ఒక పోలవరం మీదే మంత్రి పార్థసారథి ఎందుకు దృష్టి పెట్టారు అనేది అర్థం కాని విషయం. అన్ని గ్రామాలలో గ్రూపులను సమన్వయం చేసేందుకు పార్టీని ఏకతాటిపై నడిపేందుకు సమర్థవంతమైన నాయకుడిని మండల పార్టీ అధ్యక్షుడిగా నియమిస్తే పార్టీ గాడిలో పడే అవకాశాలు ఉన్నాయని మేధావులు భావిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి పది మాసాలు పూర్తవుతున్నప్పటికీ పార్టీ నడవడికలో ఎటువంటి మార్పు కనపడటం లేదు. దీనిపై మంత్రి పార్థసారథి దృష్టి సారించి మండలంలోని అన్ని గ్రామాల నా నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి ఇదే విధమైన హెచ్చరికలు జారీ చేసి గాడిలో పెడితే తప్ప మరొక ప్రత్యామ్నాయం లేదు.

# మంత్రి నాదెండ్ల చొరవతో తీరిన గిరిజనుల దాహార్తి

**- ఇంటింటికీ త్రాగునీరు సరఫరా చేస్తున్న అధికారులు**

**-పులిరాముడిగూడెంలో త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారంగా ఆర్వో ప్లాంట్**

**ఏలూరు, ప్రభాతవార్త :** ఇటీవల జిల్లా పర్యటనలో భాగంగా రెండురోజులపాటు గిరిజన ప్రాంతాలలో పర్యటించి వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మరియు జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్. తన పర్యటనలో భాగంగా ఈనెల 23వ తేదీన బుట్టాయిగూడెం మండలం పులిరాముడిగూడెం పర్యటించగా అక్కడి ప్రజలు తమకు త్రాగునీటి సమస్య ఎక్కువగా ఉందని, పరిష్కరించాలని కోరారు. ఈ విషయంపై మంత్రి స్పందిస్తూ వెంటనే ఆ ప్రాంత గిరిజనల త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం తీసుకోవాలని, అంతవరకూ ట్యాంకర్ల ద్వారా త్రాగునీరు సరఫరా చేయాలని, ఐ.టి.డి. ఏ. ప్రాజెక్ట్ అధికారిని, ఆర్ డబ్ల్యూ ఎస్ అధికారులను మంత్రి మనోహర్ ఆదేశించారు.

మంత్రి ఆదేశాలతో జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఆర్ డబ్ల్యూ ఎస్ అధికారులు ముందుగా వెంటనే ఇంటింటికి రక్షిత త్రాగునీటిని ప్రతీరోజు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారంగా గ్రామ పంచాయతీ ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు 2. 50 లక్షల రూపాయలు మంజూరు చేసింది. త్వరలోనే పనులు ప్రారంభించాలని మంత్రి మనోహర్ అధికారులను ఆదేశించారు. అంతేకాక గిరిజన ప్రాంతాలతో పాటు జిల్లాలో త్రాగునీటి సమస్య పరిష్కారానికి రూ. 971. 80 లక్షల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. వీటిలో గ్రామ పంచాయతీలకు 15వ ఫైనాన్స్ కింద 501.43 లక్షలు, మండల ప్రజా పరిషత్తులకు 270.37 లక్షల నిధులు ఉన్నాయి. వాటి ద్వారా హ్యాండుపంపుల మరమ్మత్తులు, రక్షిత మంచినీటి పథకాల మరమ్మత్తులు కొనసాగుతున్నాయి. పోలవరం నియోజకవర్గ గిరిజన ప్రాంతాల్లో వాటర్ ట్యాంకుల ద్వారా తాగునీరు అందించేందుకు 15వ కమిషన్ గ్రాంట్ కింద 41.55 లక్షలు, అలాగే మండల ప్రజా పరిషత్ ఫైనాన్స్ నిధుల కింద 20 లక్షల రూపాయల నిధులు మంజూరయ్యాయి.

గతంలో ఎంతోమంది మంత్రులు, ప్రజాప్రతినిధులు వచ్చి తమ సమస్యలను తెలుసుకుని హామీలు ఇచ్చి వెళ్లడమే గాని, పరిష్కరించలేదని, ఇప్పుడు కూడా అలాగే అనుకున్నామని, కానీ ఇచ్చిన హామీని వెనువెంటనే అమలు చేసి, తమ గ్రామంలో త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే కాక, గిరిజన ప్రాంతాలలో త్రాగునీటి సమస్యకు లక్షలాది రూపాయలు మంజూరు చేసిన జిల్లా ఇంచార్జ్ మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్ అసలు,సిసలైన ప్రజాప్రతినిధి అని, వారికి తమ గ్రామ ప్రజలు జీవితాంతం రుణపడి ఉంటామని పులిరాముడుగూడెం ప్రజలు తమ కృతజ్ఞతలను తెలియజేస్తున్నారు.



# నిర్వాసితులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీరని అన్యాయం

**వేలేరుపాడు, ప్రభాత వార్త :** పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేస్తున్న నిర్వాసితులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీరని అన్యాయం చేస్తున్నాయని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. మండలంలోని మల్లారంలో సీపీఐ 17వ మండల మహాసభను రామవరం సర్పంచ్, ఉప సర్పంచ్ పిట్టా ప్రసాద్, కంగాల రమాదేవి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న వనజ మాట్లాడుతూ ముందుగా జమ్మూ కాశ్మీర్ రాష్ట్రం పహాల్గాంలో జరిగిన దుర్ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉండి తగు సహాయం అందించాలన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వలన నష్టపోతున్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలన్నారు. పోలవరం ప్రాజెక్టుకు సర్వం త్యాగం చేస్తున్న




నిర్వాసితుల విషయంలో మానవతా దృక్పథంతో ఆలోచించి న్యాయం చేయాలన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉండాలన్నారు. పోడు భూములకు పట్టాలు ఇచ్చి ఆదివాసీలను ఆదుకోవాలన్నారు. పెద్దవాగు ప్రాజెక్టు మరమత్తులు చేపట్టడం వలన సుమారు 15 వేల ఎకరాల భూమికి నీరు అందుతుందని వెంటనే ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. జీవో నెంబర్ 3 ను అమలు చేసి గిరిజనులకు న్యాయం చేయాలన్నారు. పేద ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పట్టించుకోని పాలన సాగిస్తున్నారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయకుండా ప్రైవేట్ వ్యక్తులకు దారాదత్తం చేయటానికి ముందుంటున్నారని పాలకులను దుయ్యబట్టారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన అనేక హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక విలవిలలాడిపోతున్నారని ముందుగా వారిని ఆదుకోవాలన్నారు. భిన్నత్వంలో ఏకత్వంగా జీవిస్తున్న దేశ ప్రజలను విభజించి పాలించాలని ప్రభుత్వాలు చూస్తున్నాయన్నారు. అందరూ ఐక్యతతో పోరాటాలు సాగించి పాలకుల కుట్రలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ అన్ని సౌకర్యాలతో ఉపాధి హామీ పథకం అమలు చేయాలని, నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని, ముంపులేని గ్రామాల్లో కనీస వసతులు ఏర్పాటు చేయాలని తీర్మానించారు.

# పండ్లలో రసాయనాలు వినియోగిస్తే చర్యలు తప్పవు

## -పళ్లవ్యాపారులకు అధికారుల హెచ్చరికలు

**తణుకు, ఏప్రిల్ 30(ప్రభాత వార్త):** అరటి, మామిడి పళ్లు మాగబెట్టేందుకు రసాయనాలు వినియోగిస్తే చర్యలు తప్పవని జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్ ఎ.సుందరరామరెడ్డి హెచ్చరించారు. పళ్లు త్వరితగతిన ముగ్గిపోయేలా ప్రమాదకరమైన రసాయానాలు వాడుతున్నారని వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంతో తణుకు సంతమార్కెట్లో పళ్లు హెూల్సేల్ మార్కెట్లో బుధవారం అధికారులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సుందరరామరెడ్డి మాట్లాడుతూ పళ్లు త్వరితగతిన రంగు రావడానికి కృత్రిమంగా ముగ్గిపోవడానికి ప్రమాదకరమైన రసాయనాలు వాడుతున్నారని చెప్పారు. ఇవి తినడం వల్ల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని చెప్పారు. దీనికి వ్యాపారులు మాట్లాడుతూ పంట వేసినప్పుడే రైతులు రసాయనాలు వాడుతున్నారని దీంతో మార్కెట్కు వస్తున్నాయని చెప్పారు. దీనికి తణుకు మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ రసాయనాలు వినియోగించిన పంటను తాము తీసుకోమని రైతులకు తెగేసి చెప్పాలన్నారు. కేవలం సహజసిద్ధంగా మగ్గబెట్టిన పళ్లు మాత్రమే విక్రయిస్తామని బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. మరోసారి తనిఖీల్లో పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హార్టీకల్చర్ అధికారి ప్రియదర్శిని, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# శ్రీకాశీ అన్నపూర్ణదేవి - శ్రీ విశ్వేశ్వర స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ

**ప్రభాతవార్త నరసాపురం:** నరసాపురం పట్టణంలో శ్రీ కపిల మల్లీశ్వర స్వామి వారి దేవస్థానం లో శ్రీకాశీ అన్నపూర్ణదేవి – శ్రీ విశ్వేశ్వర స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ మహెూత్సవం లో నరసాపురం మాజీ శాసనసభ్యులు శ్రీ బండారు మాధవ నాయుడు గారు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బెజవాడ సుగుణవతి జ్ఞాపకార్థం వారి కుమారుడు బెజవాడ రమేష్ మరియు కుటుంబ సభ్యులు సహకారంతో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకులు మంచిలి దుర్గాప్రసాద్, గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బండారు పటేల్ రాజా నాయుడు, కొండేటి శ్రీను, సింగంశెట్టి తాతాజీ, నడిపూడి కృష్ణ, కూరెళ్ళ అర్జునరావు, చాగంటి నరేంద్ర, బెజవాడ బాబీ, తోట జగదీష్, పులపర్తి దత్తు, పులపర్తి శ్రీధర్, అనుపోజు బాబ్జి కూటమి నాయకులు పాల్గొన్నారు.



# శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట

జీలుగుమిల్లి, ఏప్రియల్-30, ప్రభాతవార్త : మండలంలోని రాచన్నగూడెంలో శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి సుప్రభాత సేవ, కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన వందలాదిమంది ఆడపడుచులు ఈ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి విచ్చేసి అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయం వద్ద పెద్ద ఎత్తున అన్న సమారాధన కార్యక్రమం జరిగింది. అంతకుముందు అమ్మవారిని పోలవరం నియోజకవర్గ వైకాపా కన్వీనర్ తెల్లం రాజ్యలక్ష్మి, వైకాపా నాయకులు వీరంకి వెంకటేశ్వరరావుతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా గ్రామ సర్పంచ్ సున్నం వరలక్ష్మి, పి అంకంపాలెం ఎంపీటీసీ నాలి శ్రీనివాసరావు, పేరు బోయిన దాము, వనమా రామకృష్ణ, అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొని ఈ మహెూత్సవ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.



# శాఖ గ్రంథాలయంలో చదవడం అంటే ఎంతో ఇష్టం కార్యక్రమం

**పెనుమంట్ర, ఏప్రిల్-30, ప్రభాతవార్త :** మండలంలోని మార్టేరు గ్రంథాలయం నందు వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా 3వ రోజు బుధవారం శాఖా గ్రంథాలయంలో చదవడం అంటే మాకు ఇష్టం, పోమ్స్, తెలుగు నీతి కథలు గురించి రిటైర్డ్ ఇంగ్లీష్ టీచర్ పి సువర్ణ అవగాహన కల్పించడం జరిగిందని గ్రంథ పాలకుడు పి టి ఎస్ కుమార్ బుధవారం తెలిపారు. ఈ వేసవి విజ్ఞాన శిబిరాన్ని మానవతా మరియు గ్రంథాలయ సిబ్బంది సంయుక్తంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులు కే జన్మిత,. ప్రవీణా, బి ఆశ సరియు,. బి నైనశ్రీ వినమ్, ఎస్ రమేష్,, వి సాయి, టి కృష్ణ, పి ఈశ్వర్, ఏ నాని, ఎస్ మోహన్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.





# 400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

## -10 లీటర్ల సారా స్వాధీనం

**చాట్రాయి, ఏప్రిల్ 30, ప్రభాతవార్త** చాట్రాయి మండలం జనార్దనవరం గ్రామములో జరిపిన దాడులలో 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 10 లీటర్ల నాటు సారాని స్వాదిన పరచుకొని బెజవాడ శ్రీనివాస రావుపై కేసు నమోదు చేసినట్లు ఏలూరు జిల్లా అసిస్టెంట్ ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.పాండు రంగారావు తెలియచేశారు. ఈ దాడులలో ఈ.యస్.టి.యఫ్ సబ్-ఇన్స్పెక్టర్ కే.యండి. అరీఫ్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# మన్యం బంద్ ను జయప్రదం చేయండి

**వేలేరుపాడు, ఏప్రిల్ 30, ప్రభాత వార్త :** ఏజెన్సీ స్పెషల్ డిఎస్సి తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని, షెడ్యూల్ ఏరియా ఆదివాసి ప్రాంతంలో 100% రిజర్వేషన్ నియామక చట్టం చేయాలని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలని మే 02 వ తేదీన రాష్ట్ర మన్యం బంద్ పిలుపును మండలం లో విజయవంతం చేయాలని ఆదివాసి గిరిజన సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి ధర్ముల రమేష్ జిల్లా ఉపాధ్యక్షులు మడివి దుర్గారావు పిలుపునిచ్చారు. మండలంలోని వాణిజ్య, వ్యాపార సంస్థలు, హెూటల్స్, ప్రభుత్వ కార్యాలయాలు బంద్ కు స్వచ్ఛందంగా సహకరించాలని కోరారు.



# మే డేను జయప్రదం చేయండి

**పెనుమంట్ర, ఏప్రిల్-30, ప్రభాతవార్త:** పెనుమంట్ర మండల సిఐటియు కమిటీ ఆధ్వర్యంలో మేడే కార్యక్రమం జయప్రదం చేయాలని పెనుమంట్ర మండల సిఐటియు కార్యదర్శి కోడి శ్రీనివాస్ ప్రసాద్ పిలుపు నిచ్చారు. బుధవారం పెనుమంట్రలో ఓ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్ లు రద్దు అయ్యే వరకు పోరాడుదాం అని అన్నారు. 20వ తారీఖున జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని అన్నారు. మేడే స్ఫూర్తితో కార్మికులు పోరాడి సాధించుకున్న 8 గంటల పని దినాన్ని హక్కులను కాపాడుకోవాలని అన్నారు. ప్రతి కార్మికుడు దీక్షపూని వాడవాడల మన ఎర్రజెండాను మేడే జెండాను ఎగరవేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కె సుబ్బరాజు, అంగన్వాడి కార్మికులు సాయి మహాలక్ష్మి, మంగతాయారు, కొరణశీల శాంతి భవాని తదితర కార్మికుల పాల్గొన్నారు.





# ప్రధానమంత్రిమోడీ పర్యటన విజయవంతం చేయాలి

**మొగల్తూరు ఏప్రిల్ 30 (ప్రభాతవార్త):** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అమరావతి పునర్నిర్మాణ పనులు ప్రారంభించేందుకు మే రెండవ తేదీన జరుగుతున్న సభకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విచ్చేస్తున్న సభను విజయవంతం చేయాలని బుధవారం స్థానిక మండల కార్యాలయం నందు ఎంపీడీవో సిహెచ్ త్రిశూలపాణ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొగల్తూరు మండలం నుండి ఆరు ప్రత్యేక బస్సులు అమరావతి వెళ్లేందుకు ఏర్పాటు చేశామని ప్రతి బస్సుకు కావలసిన ఫస్ట్ ఎయిడ్ మంచినీరు ఆహారం మొదలగు సౌకర్యములు కల్పిస్తున్నట్లు తెలిపారు మోడీ పర్యటనకు వస్తున్న అభిమానులకు ఉదయం టిఫిన్ స్నాక్స్ భోజనం ప్రతి బస్సు నెంబర్ను బట్టి అందించేందుకు చూడాలని ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా తగిన పర్యవేక్షణ చేయాలని సూచించారు ప్రతి బస్సులో ఎక్కే అభిమాని పేరు సెల్ నెంబర్ ఆధార్ కార్డు రికార్డు నిర్వహించాలని ఆయన అధికారులకు సూచించారు మే రెండవ తేదీ ముత్యాలపల్లి గ్రామంలో శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద నుండి బస్సులు బయలుదేరుతాయని నర్సాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ జెండా ఊపి మోడీ పర్యటన బస్సులను ప్రారంభిస్తారని ఆయన తెలియజేశారు ఈ సమావేశం ఈ ఓ ఆర్ డి మేడిది నవీన్ కిరణ్ వెలుగు ఏ పీఎం ప్రభుదాసు సీనియర్ గ్రామ కార్యదర్శులు ముచ్చర్ల నాగేశ్వరరావు (చిన్న) ఎం సత్యనారాయణ మహిళా పోలీస్ సిబ్బంది కార్యాలయ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు



# స్వామివారికి ఏనుగు అంబారి ఉత్సవం





**ప్రభాతవార్త నరసాపురం:** పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో శ్రీ ఆదికేశవ ఎంబర్ మన్నారు స్వామి వారి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు మరియు తిరు నక్షత్ర ఉత్సవాలలో భాగంగా ఈరోజు శ్రీ ఎంబర్ మన్నారు స్వామి వారి తిరువీధుల్లో శేష వాహనంపై దర్శనమిచ్చారు. తిరు నక్షత్రం ఉత్సవాలు అనగా మే 2 తేదీన రామానుజ స్వామివారు జన్మించిన రోజు అని ఈ ఉత్సవాలు 11 రోజులు చేస్తారని తెలిపారు ఈ ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. రామానుజుల స్వామివారిని దర్శించుకుంటే సర్ప దోషాలు తొలగుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. ఈ కార్యక్రమంలో స్థానాచార్యులు వి.వెంకట చార్యులు, ప్రధాన అర్చకులు పెద్దింటి మోహన్ రామాచార్యులు, కార్య నిర్వహణ అధికారి ఆర్ వి వి ఎస్ రామచంద్ర కుమార్,అర్చకులు మరియు భక్తులు పాల్గొన్నారు



## అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా పల్లెనిద్ర..



లింగపాలెం ఏప్రిల్ 30 ప్రభాతవార్త.... లింగపాలెం యడవల్లి పంచాయతీ లో నిన్న రాత్రి పల్లి నిద్ర కార్యక్రమంలో పాల్గొన్న ధర్మాజీ గూడెం ఎస్సై ఎంకన్న బాబు, చింతలపూడి సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ గ్రామస్తులతో మాట్లాడుతూ యువత అసాంఘిక కార్యక్రమాల్లో పాల్గొనకుండా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని వారు గ్రామస్తులకు తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పంచాయితీ వార్డు సభ్యులు కట్టుబోయిన రమేష్ పాల్గొన్నారు.


## 152 వ ట్రై సైకిల్ అందజేత..



లింగపాలెం ఏప్రిల్ 30 ప్రభాతవార్త :బొప్పన రాధమ్మ ఆర్థిక సహాయంతో లింగపాలెం మండలం ఆసన్నగూడెం గ్రామంలో యాక్సిడెంట్ వల్ల కాలు కోల్పోయిన యర్రా బ్రహ్మయ్యా అను వారికి బొప్పన రాదమ్మ ఆర్థిక సహాయంతో 182 వ ట్రై సైకిల్ గా అందించటం జరిగిందిఈకార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు మామిడిపల్లి శ్రీను,ప్రధాన కార్యదర్శి & మాజీ సర్పంచ్ యర్రా శ్రీను,సీనియర్ నాయకులు పొదిల జేమ్స్,యలమర్తి బలరాం,కుప్పాల నారాయణ,పొన్నూరు వెంకటేష్,యలమర్తి వెంకటేష్,యర్రా కిషోర్తదితరులు పాల్గొన్నారు

## రోడ్లపై పశువులు విచ్చలవిడిగా తిరగడం పట్టించుకోని అధికారులు

మొగల్తూరు ఏప్రిల్ 30 (ప్రభాతవార్త) రహదారిపై పశువులు విచ్చలవిడిగా తిరగడం వల్ల వాహనదారులకు ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయి ఈ ప్రభావం వల్ల తరచూ అనేక ప్రమాదాలు జరగడం సర్వసాధారణం అయిందని మొగల్తూరు రహదారిపై పశువులను నివారించేందుకు అధికారులు తీసుకుంటున్న చర్యలు నామమాత్రంగా ఉన్నాయని ప్రజలు విమర్శిస్తున్నారు రహదారిపై పశువులు వలన అతి వేగంగా వెళ్లే వాహనదారులు చాలా ఇబ్బందులు ఏర్పడుతున్నాయి దీనిని వెంటనే ప్రభుత్వం స్పందించి ఉన్నత అధికారులతో మాట్లాడి రహదారిపై పశువులను తిరగనివ్వకుండా కట్టడి చేయాలని అధికారులు పశువుల యజమానుల తో మాట్లాడి పశువులను



కట్టడి చేయాలని అధికారులు సూచించాలని ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు

## బెట్టింగ్ వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు అవగాహన కార్యక్రమం



**చింతలపూడి.. ప్రభాత వార్త :** చింతలపూడి పట్టణంలోని పలు ప్రాంతాల్లో బెట్టింగ్ లు అంటే అప్పులు అబద్ధాలు అరెస్టులు అనే శీర్షికతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన చింతలపూడి ఇన్స్పెక్టర్ చింతలపూడి సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీ సిహెచ్. రాజశేఖర్, ఎస్ఐ కుటుంబరావు మరియు వారి పోలీస్ సిబ్బంది సంయుక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ బెట్టింగ్ వ్యసనం ఎలా వ్యక్తిగత, కుటుంబ, సమాజ జీవనంపై తీవ్ర ప్రభావం చూపుతోందో అనే విషయాలపై వివరంగా ప్రజలకు అవగాహన కల్పించారు.బెట్టింగ్ చేస్తే ఓడేది మన జీవితమే అనే సందేశంతో యువతలో చైతన్యం కల్పించే ప్రయత్నం చేశారు.బెట్టింగ్ కు బానిసలవుతున్న వారిని గుర్తించి వారికి మానసిక మద్దతు, సలహాలు అందించేందుకు పోలీస్ శాఖ సన్నద్ధంగా ఉందని తెలియ చేసినారు.ప్రజలు సమాచారం అందించాలంటే డయల్ 112 కు లేదా జిల్లా ఎస్పీ వాట్సాప్ నెంబర్ 9550351100 ను ఉపయోగించ వచ్చని సూచించారు.చట్ట విరుద్ధంగా బెట్టింగ్, గ్యాంబ్లింగ్ లలో పాల్గొన వద్దని, ఇలాంటి కార్యకలాపాల్లో పాల్గొనడం పట్ల చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్స్పెక్టర్ హెచ్చరించారు. బెట్టింగ్ అనేది ఒక వ్యసనమే కాదు అది జీవితాల్ని నాశనం చేసే సామర్థ్యం కలిగిన శత్రువు. ఇది అప్పులకు, మోసాలకు, చివరికి అరెస్టులకు దారి తీస్తుంది. అందుకే ప్రతి ఒక్కరూ ఈ మానసిక వ్యాధిని సమాజం నుండి తరిమికొట్టేందుకు ముందడుగు వేయాలి అని, పోలీసు శాఖ ప్రజల భద్రతకే కాదు మార్గదర్శకత్వానికీ మరియు నిబంధనల ఆచరణ కు చింతలపూడి పోలీస్ అధికారులు ఎప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటారని ఇన్స్పెక్టర్ ప్రజలకు హామీ ఇచ్చినారు

## తెలుగుజాతి చరిత్రలో శ్రీశ్రీ కవితా మహా ప్రస్థానం

### - సాహిత్యాభిమాని సత్యనారాయణ

భీమవరం ఏప్రిల్ 30 ప్రభాతవార్త : మహాకవుల కలం నుండి జాలువారిన ఎన్నో సాహితీ ఖండాలు తెలుగుజాతి చరిత్రలో నిలిచాయని, వారిలో శ్రీశ్రీ కవితా మహాప్రస్థానం ఒకటని సాహిత్యాభిమాని, రిటైర్డ్ ప్రిన్సిపల్ డా పి సత్యనారాయణ, రచయిత కలిగోట్ల గోపాలశర్మ అన్నారు. మహాకవి శ్రీశ్రీ జయంతోత్సవ కార్యక్రమాన్ని శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో భీమవరం జె ఎల్ బి మున్సిపల్ హైస్కూల్లో నిర్వహించారు. వారు మాట్లాడుతూ శ్రీరంగం శ్రీనివాసరావు శ్రీశ్రీగా లోకంలో పేరుగాంచి అభ్యుదయ రచయితల సంఘం వ్యవస్థాపక అధ్యక్షునిగా విరసం అధ్యక్షునిగా ఎన్నో సాహిత్య పోకడలను జాతికి అందించిన శ్రీశ్రీ యుగాంతం వరకు చిరస్మరణీయుడని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, హెచ్ ఎం పీబీ శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీశ్రీ తెలుగు సినీ ప్రపంచంలో రచించినటువంటి గీతాలు దరిద్రపై నిలిచి పోతాయని,



సాహిత్యంలో కార్మికుల జీవితాలను వారి కష్టాలను రచనా రూపంలో రచించి కార్మిక కర్షక ఒక మహాకవిగా శ్రీశ్రీ నిలిచారని అన్నారు. శ్రీశ్రీ భీమవరం పలుమార్లు విచ్చేసి అనేక తెలుగు సాహిత్య కార్యక్రమంలో పాల్గొన్నారని, అభినవ బోజ గన్నాబత్తుల పెదతాత శ్రీశ్రీని ఘనంగా సత్కరించారని, ఆ విధంగా ఆయనను దర్శనం చేసుకుని అదృష్టవంతులుగా నిలిచామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుజాత, రాణి తదితరులు పాల్గొన్నారు.

## అమాయకులపై ఉగ్రవాదుల మారణకాండ అత్యంత హేయం


భీమవరం ఏప్రిల్ 30 ప్రభాతవార్త : పహల్గాంలో ఉగ్రవాదుల నరమేధాన్ని నిరసిస్తూ భీమవరం నాచువారి సెంటర్ లో ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ భీమవరం, న్యూజెన్, బ్లోసమ్స్, కాపు వనిత క్లబ్ – మహిళ సంఘాలు ఆధ్వర్యంలో శాంతియుత క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. మహిళ సంఘాల సభ్యులు ఆరేటి రాణి, గంధం శ్రీదేవి, అల్లం వాణీ, రూప వాణి, శీతల్, సుబత్ర, ఆండాళ్, భవాని, ప్రశాంతి, సరోజ, చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని ప్రేరేపిస్తున్న పాకిస్తాను బుద్ధి చెప్పాలని, ఉగ్రవాదాన్ని కూకటి వేళ్ళతో పెకలించాలని అన్నారు. అమాయకులపై ఉగ్రవాదుల మారణకాండ అత్యంత



హేయమని అన్నారు. ఇటువంటి దుశ్చర్యకు పాల్పడిన వారిపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, దాడిలో మృతి చెందిన వారి కుటుంబాలకు సంతాపం తెలిపారు. అనంతరం ఉగ్రవాద దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళు లర్పించారు.

## శిక్షణ పొందితే అక్షర విజయాల అందుకోగలరు!

భీమవరం ఏప్రిల్ 30ప్రభాతవార్త శారీరిక మానసిక దృఢత్వం పెంపొందించుకుంటే అన్ని రంగాలలో విజయాలు సాధించగలరని భీమవరం ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి మురళీకృష్ణ రాజు అన్నారు. కళాశాల పీపుల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇన్నర్ ఇంజనీరింగ్(పి ఏ ఐ ఈ) పేరిట నిర్వహించిన ఉత్కర్షయోగ, మేధా యోగ, ప్రజ్ఞాయోగ వంటి అంశాలపై భీమవరంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఐదు నుండి 17 సంవత్సరాల వయసు మధ్య ఉన్న విద్యార్థులకు వేసవి శిక్షణ అందించారు. శిక్షణలో ప్రధానంగా విద్యార్థులు మనసును ప్రశాంతంగా ఆహ్లాదకరంగా నిలుపుకొని లక్ష్యాలు సాధించగలమని ఆత్మవిశ్వాసం పెంపొందించుకునే విధంగా శిక్షణ జరిగిందని పి ఏ ఐ ఈ కోఆర్డినేటర్, ఇంజనీరింగ్ కెమిస్ట్రీ హెడ్ డాక్టర్ పి భవాని పేర్కొన్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీం సహకారంతో విద్యార్థులకు నాలుగు రోజులపాటు నిర్వహించిన శిక్షణ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు కళ్ళకు గంతలు కట్టుకొని బోర్డుపై వ్రాసిన అక్షరాలను సైతం తిరిగి



రాయగలిగే స్థాయికి మనసును మానసిక పరిణతిని పెంపొందించుకోగలిగారని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ట్రైనర్ సాయికిరణ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు చేస్తున్న యోగా మానసిక క్రియలను వారి తల్లిదండ్రులు కూడా స్వయంగా వీక్షించి ఆర్ట్ ఆఫ్ లివింగ్ బృందాన్ని అభినందించారు. పి రమేష్ రాజు, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు

## పిఎం సూర్య ఘర్ సోలార్ ఎనర్జీ బ్రాంచ్ ఆఫీస్ ప్రారంభించిన ఎమ్మెల్యే




జంగారెడ్డిగూడెం, ప్రభాతవార్త: చింతలపూడి పట్టణం పాత బస్టాండ్ లో గల కేతుపల్లి కాంప్లెక్స్ లో నూతనంగా ఏర్పాటు చేసిన పి ఎం సూర్య ఘర్ సోలార్ ఎనర్జీ బ్రాంచ్ ఆఫీస్ ను శాసన సభ్యులు సొంగా రోషన్ కుమార్ ప్రారంభించారు. ఆయనతో పాటు మాజీ ఏఎంసి చైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి, జనసేన పట్టణ అధ్యక్షులు చీదరాల మధుబాబు, బీజేపీ పట్టణ అధ్యక్షురాలు విజయ కుమారి,కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీ అయ్యప్ప స్వామి వారి దేవస్థానంకు అధిక సంఖ్యలో భక్తులు

జంగారెడ్డిగూడెం, ప్రభాతవార్త: మండలంలోని గుర్వాయిగూడెంలో శ్రీ అయ్యప్ప స్వామి వారి దేవస్థానంలో బుధవారం సందర్భంగా స్వామివారికి పంచామృత అభిషేకములు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## వీర వెంకట సత్యనారాయణ స్వామి ఆలయ శంకుస్తామనలో పాల్గొన్న 'బొరగం'



జంగారెడ్డిగూడెం, ప్రభాతవార్త: బుట్టాయగూడెం మండలం కుమ్మరగట్టు వినాయకుడి గుడి దగ్గర శ్రీ రమా సహిత వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవాలయం భూమి పూజా కార్యక్రమంలో పోలవరం తెలుగుదేశం పార్టీ ఇంచార్జీ,రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు పాల్గొన్నారు. విరి వెంట ఆలపాటి దుర్గారావు, కొండేపటి రామకృష్ణ, రమణ, తదితరులు పాల్గొన్నారు.

## హౌస్ అరెస్టును ఖండించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు..



. లింగపాలెం ఏప్రిల్ 30 ప్రభాతవార్త.... కాంగ్రెస్ పార్టీ ఏపీ సి సి అధ్యక్షురాలు షర్మిల రెడ్డిని విజయవాడ తన స్వగృహం నందు హౌస్ అరెస్ట్ చేయడం పట్ల లింగంపాలెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాదాల బాబురావు నాయకులు. చే బత్తుల వెంకటరత్నం.ఉప్పె రాజకుమార్. సురేష్. మండల కేంద్రమైన లింగపాలెం లో ఖండించారు.

## టివి లకు దూరంగా ఉండండి.

అత్తిలి – ఏప్రిల్30 ( ప్రభాత వార్త ): వేసవి సెలవులలో విద్యార్థులు టివి , చరవాణిలకు దూరంగా ఉంటూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని అత్తిలి గ్రంథాలయాధికారి డి . కృష్ణారావు కోరారు. అత్తిలి గ్రంథాలయంలో వేసవి శిక్షణ లో భాగంగా పుస్తక పఠనం , నీతి కథలు చెప్పటం , ఆంగ్ల భాష మాట్లాడటం పై శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయంలో అమూల్యమైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు . రిసోర్స్ పర్సన్ కె. సతీష్ ,వి. లక్ష్మణరావు , గంధం శేష వేంద్రరావు, ఎం.శ్రీదేవి ,వి . పార్వతి తదితరులు పాల్గొన్నారు

## గుమ్మంపాడు లో చందనోత్సవం .



అత్తిలి – ఏప్రిల్ 30 ( ప్రభాత వార్త ):అత్తిలి మండలం గుమ్మంపాడు శివారు శ్రీహరి ప్రహ్లాదపురం లోగల సుబ్రహ్మణ్యేశ్వర గో మహలక్ష్మి సమేత నారికేళ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో అక్షర తృతీయ సందర్భంగా చందనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామి వారి చందనాన్ని వలిచి నిజరూప దర్శనం అనంతరం స్వామి వారికి చందనాన్ని పూశారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ప్రహరీ సేవను నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ పులవర్తి గిరిజ , అర్చకుడు శ్రీహరి గోపాల్ , ఆలయ గురువు రవీంద్ర ఫణి గోపాల్ , పూర్ణిమ , మూలకపాటి విశ్వభారతి. ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## మేడే వేడుకలకు గ్రామీణ వికాస శ్రామికులు ఎంపిక

మొగల్తూరు ఏప్రిల్ 30 (ప్రభాత వార్త) అమరావతిలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో గురువారం జరిగే కార్మికుల దినోత్సవం వేడుకలకు మొగల్తూరు మండలం నుండి ముగ్గురు గ్రామీణ వికాస శ్రామికులు ఎంపిక అయినట్లు మొగల్తూరు ఎంపీడీవో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం మండల ప్రోగ్రాం ఆఫీసర్ సిహెచ్ త్రిశూలపాణ తన కార్యాలయం నందు ఏర్పాటు చేసిన సమావేశంలో మండలంలోని రామన్నపాలెం కేపీ పాలెం సౌత్ కేపీ పాలెం నార్త్ పంచాయతీల నుండి ఒక్కొక్క శ్రామికుడును అమరావతికి పంపించినట్లు రాష్ట్రంలో కార్మికుల దినోత్సవం రాష్ట్ర రాజధానిలో ఘనంగా నిర్వహించడం ఇదే మొదటిసారి అని ఆయన తెలియజేశారు

## వైఎస్ఆర్సిపి పార్లమెంట్ మచిలీపట్నం పరిశీలకులుగా జెట్టి గురునాథరావు



జంగారెడ్డిగూడెం ప్రభాత వార్త : వైయస్సార్సీపి పార్లమెంటు నియోజకవర్గం పరిశీలకులను నియమించింది. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు కేంద్ర కార్యాల యం వెలువరించింది. పార్టీ రీజినల్ కోఆర్డినేటర్లకు అనుసంధానంగా పరిశీలకులు పనిచేసేలా నియమించారు. ఏలూరు పార్లమెంట్ పరిశీలకుడిగా ఎమ్మెల్సీ వంకా రవింద్రనాథ్,నరసాపురం పార్లమెంటు పరిశీలకుడిగా కాకినాడ జిల్లా పత్తిపాడుకు చెందిన నేత ముదునూరు మురళి కృష్ణం రాజును నియమించారు. చింతలపూడి నియోజకవర్గం జంగారెడ్డిగూడెంనాకు చెందిన పార్టీ రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాధ రావును మచిలీపట్నం పార్లమెంటు పరిశీలకునిగా నియమించారు. గురునాథ రావు గత అసెంబ్లీ ఎన్నికల్లో పోలవరం నియోజకవర్గంలో పార్టీ పరిశీలకునిగా సేవలందించారు. గుర్నాథరావును మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గం పరిశీలకునిగా పార్టీ నియమించడం పట్ల జంగారెడ్డిగూడెంలో పార్టీ అభిమానులు,కార్యకర్తలు,నాయకులు పలువురు గురునాథ రావును బుధవారం కలిసి అభినందనలు తెలిపారు.

## ఇరగవరం - భీమవరం బస్సు సర్వీసులు .

అత్తిలి – ఏప్రిల్ 30 ( ప్రభాత వార్త ):ఇరగవరం మండలం లోని గ్రామాల ప్రయాణికుల సౌకర్యార్థం తణుకు నుండి ఇరగవరం, కంతేరు, ఆలమూరు, లంకలకోడేరు, వీరవాసరం మీదుగా భీమవరం ప్రతి రోజు మూడు ట్రిప్పులు నడుపుతున్నట్లు, ఈ అవకాశం ను ఇరగవరం మండలం గ్రామాల ప్రయాణికులు వినియోగించు కోవాలని డిపో మేనేజర్ సప్పా గిరిదర్ కుమార్ తెలిపారు.బస్సు సమయములు తణుకు లో 5-15, 12-30, 17-00 ,భీమవరం లో 7-15, 14-45, 19-15. ఈ సమయాల గోడ పత్రికలను ఇరగవరం, కొత్తపాడు, కంతేరు గ్రామాలలో ముఖ్య కూడలి లలో ఏర్పాటు చేసి ఆ గ్రామాల సర్పంచ్, సెక్రటరీ లను గ్రామాలలో



ప్రజలందరికి తెలిచేయమని తణుకు బస్సు స్టేషన్ మేనేజర్ దయాకర్ స్వయంగా కలసి చెప్పారు.

## ఇటుకల లోడు ట్రాక్టర్ బోల్తా, ఒకరి మృతి

తణుకు, ఏప్రిల్ 30(ప్రభాత వార్త): తణుకు పట్టణ పరిధిలోని జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఇటుకల లోడుతో వెళుతున్న ట్రాక్టర్ స్థానిక పాత టోల్గేట్ వద్ద అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్పై ప్రయాణిస్తున్న పెనుగొండ మండలం వదలి గ్రామానికి చెందిన నక్కా ఏసు (42) మృతి చెందగా మరో ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెనుగొండ మండలం వదలి గ్రామానికి చెందిన కార్మికులు తూర్పుగోదావరి జిల్లా ఆలమూరు నుంచి తాడేపల్లిగూడెం ఇటుకల లోడుతో వెళుతున్న ట్రాక్టర్ పాత టోల్గేటు వద్దకు వచ్చేసరికి అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఇటుకల కింద ఇరుక్కుపోయిన ఏసు ఘటనా స్థలంలోనే మృతి చెందగా ట్రాక్టర్పై ప్రయాణిస్తున్న సీహెచ్ నాగబాబు, తొంట దుర్గాప్రసాద్, మద్దే ఏసులు గాయపడ్డారు.



గాయపడిన క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఏసు మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తణుకు పట్టణ ఏఎస్సై రంగారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సింహాచలం ఘటన ప్రభుత్వ వైఫల్యం



తణుకు, ఏప్రిల్ 30(ప్రభాతవార్త): సింహాచలం ఘటన పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమని చంద్రబాబు పరిపాలనలో అమాయక ప్రాణాలు బలికావాల్సిందేనని మరొక్కసారి రుజువుచేశారని మాజీమంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు విమర్శించారు. తణుకు వైఎస్సార్సీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భగవత్ స్వరూపాన్ని తనివితీరా చూడాలనే ఉద్దేశ్యంతో ఆలయాలకు వస్తున్న భక్తుల ప్రాణాలను కూటమి ప్రభుత్వం హరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సింహాచలం అప్పన్న స్వామి చందనోత్సవాన్ని తిలకించేందుకు వెళ్లిన భక్తులు భద్రతాలోపంతో అసువులు బాసారని దుయ్యబట్టారు. ప్రతి ఏడాది అప్పన్నస్వామికి చందనోత్సవం నిర్వహిస్తారని అయితే నాణ్యతాలోపంతో నిర్మాణంచేసిన గోడతోపాటు భక్తుల సౌకర్యార్థం కట్టుదిట్టమైన రక్షణచర్యలు తీసుకోకపోవడంతో ఏడుగురు భక్తులు గోడ కూలి శిధిలాల కింద ఉండి చనిపోయారని అన్నారు. అందినకాడికి దోచుకునే తత్వంతో అభివృద్ధి పనుల్లో సైతం నాణ్యత లోపిస్తుందని విమర్శించారు. సనాతన ధర్మం అంటూ హంగామా సృష్టించే వారు ఇప్పుడు ఏమి చెబుతారని, సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలంటే హడావుడి చేయాల్సిన అవసరం లేదని, మీకు సనాతన ధర్మం అనే అర్హత లేదని విమర్శించారు. అప్పన్నస్వామి దర్శనానికి రూ. 300 టికెట్ తీసుకుని వచ్చిన భక్తుల ప్రాణాలను నిర్లక్ష్యంగా వ్యవహరించి తీసేశారని అన్నారు. గత పాలనలో చంద్రబాబు ప్రచార పిచ్చితో పుష్కరాల్లో 29 మందిని బలితీసుకోగా ఇటీవల తిరుపతిలో తొక్కిసలాటలో అమాయక భక్తులు మరణించగా తాజాగా జరిగిన సింహాచలం ఘటనలో ఏడుగురు భక్తులు అసువులుబాశారని అన్నారు. ఆలయ ఈవోతోపాటు కాంట్రాక్టర్ను ఇతర బాధ్యులందరిపై హత్యాయత్నం కేసులు నమోదుచేయాలని, మృతుల కుటుంబసభ్యులకు రూ. కోటి, క్షతగాత్రులకు రూ. 25 లక్షలు నష్టపరిహారంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## రైతుల ప్రకృతి వ్యవసాయం చేయాలి - ఎంపీటీసీ నాలి శ్రీను

జీలుగుమిల్లి, ఏప్రిల్-30, ప్రభాతవార్త: ప్రజల ఆరోగ్యం కోసం రైతులంతా ప్రకృతి వ్యవసాయం వైపు ప్రయాణించాలని మండలంలోని పి అంకంపాలెం ఎంపీటీసీ నాలి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ప్రకృతి వ్యవసాయంపై జరిగిన గ్రామసభలో ముఖ్య అతిథిగా నాలి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయటం వల్ల ప్రజలందరికీ చక్కటి ఆరోగ్యాన్ని ఇవ్వడమే కాకుండా, భూమి మరింత సారవంతంగా ఉ ంటుందన్నారు. అలాగే ఈ ఖరీఫ్ సీజన్ లో జీలుగు జనుము బదులు నవధాన్యాలు కిట్స్ ప్రతి రైతు కూడా భూములు వెయ్యాలని అన్నారు. వీటి వల్ల భూమి మెరుగైన సారవంతమైన నేలకు తయారవుతుందని అన్నారు. తద్వారా పంటలు అధిక



దిగుబడులు వస్తాయని రైతులందరికీ తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో దినేష్ కుమార్, మట్ట నాగలక్ష్మి, కిషోర్ ఐసిఆర్పిలు శిరీష, సర్పంచ్ బుద్ధ జగ్గారావు, తోట బాలు, పత్తి సుబ్బారావు పెద్ద లక్ష్మయ్య గనిశెట్టి నాగు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల ప్రకృతి వ్యవసాయం చేయాలి

### ఎంపీటీసీ నాలి శ్రీను

జీలుగుమిల్లి, ఏప్రిల్-30, ప్రభాతవార్త:ప్రజల ఆరోగ్యం కోసం రైతులంతా ప్రకృతి వ్యవసాయం వైపు ప్రయాణించాలని మండలంలోని పి అంకంపాలెం ఎంపీటీసీ నాలి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ప్రకృతి వ్యవసాయంపై జరిగిన గ్రామసభలో ముఖ్య అతిథిగా నాలి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయటం వల్ల ప్రజలందరికీ చక్కటి ఆరోగ్యాన్ని ఇవ్వడమే కాకుండా, భూమి మరింత సారవంతంగా ఉ ంటుందన్నారు. అలాగే ఈ ఖరీఫ్ సీజన్ లో జీలుగు జనుము బదులు నవధాన్యాలు కిట్స్ ప్రతి రైతు కూడా భూములు వెయ్యాలని అన్నారు. వీటి వల్ల భూమి మెరుగైన సారవంతమైన నేలకు తయారవుతుందని అన్నారు. తద్వారా పంటలు అధిక దిగుబడులు వస్తాయని రైతులందరికీ తెలియజేయడం




జరిగినది. ఈ కార్యక్రమంలో దినేష్ కుమార్, మట్ట నాగలక్ష్మి, కిషోర్ ఐసిఆర్పిలు శిరీష, సర్పంచ్ బుద్ధ జగ్గారావు, తోట బాలు, పత్తి సుబ్బారావు పెద్ద లక్ష్మయ్య గనిశెట్టి నాగు తదితరులు పాల్గొన్నారు.

**ప్రభాతవార్త నరసాపురం:** పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం ఆది కేశవ ఎంబరమన్నారు స్వామి ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ , సీనియర్ న్యాయవాది పుప్పాల వెంకట కృష్ణారావును హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ భవాని ప్రసాద్ పరామర్శించారు. ఇటీవల కృష్ణారావు తల్లి చంద్రావతి అనారోగ్యంతో మృతి చెందారు ఈ విషయం తెలుసుకున్న భవాని ప్రసాద్ పట్టణంలోని కోవెల వీధిలో నివాసం ఉంటున్న కృష్ణారావు ఇంటికి వచ్చి కుటుంబ సభ్యుని పరామర్శించారు జస్టిస్ భవాని ప్రసాద్ కు స్వయనా చంద్రవతి కి మేనల్లుడు వరుస కానున్నారు
ప్రభాతవార్త నరసాపురం



# రజనీకాంత్ చెప్పిన మాటే నన్ను సక్సెస్ చేసిందనుకుంటా..వెంకటేశ్



విక్టరీ వెంకటేశ్ తన సినీ ప్రస్థానం, వ్యక్తిగత అభిరుచులపై ఎప్పుడూ ఆసక్తికరంగా స్పందిస్తుంటారు. విభిన్నమైన కథలను ఎంచుకుంటూ, కుటుంబ ప్రేక్షకులకు దగ్గరగా ఉంటూ తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో, తన కెరీర్‌ను, ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేసిన ఓ కీలక విషయాన్ని ఆయన పంచుకున్నారు. సూపర్ స్టార్ రజనీకాంత్ తనకు ఇచ్చిన ఓ అమూల్యమైన సలహా గురించి వెంకటేశ్ వెల్లడించారు. తాను చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టిన తొలినాళ్ల నుంచి రజనీకాంత్‌తో తనకు మంచి అనుబంధం ఉందని వెంకటేశ్ గుర్తుచేసుకున్నారు. రజినీకాంత్ తన తండ్రి రామానాయుడుతో కూడా సినిమాలు చేశారని చెప్పారు. ఆ సమయంలో రజనీకాంత్ తనకు ఒక ముఖ్యమైన మాట చెప్పారని వెల్లడించారు. సినిమా విడుదల సమయంలో నీ పోస్టర్లు వేశారా, భారీ కటౌట్లు పెట్టారా అనే విషయాల గురించి ఎక్కువగా ఆలోచించవద్దు. పోస్టర్‌లో నీ ముఖం సరిగ్గా కనిపిస్తుందా లేదా అని కూడా పట్టించుకోవాల్సిన పనిలేదు. నువ్వు చేయాల్సిందల్లా మంచి కథలు ఎంచుకుని, మంచి సినిమాలు చేయడం. అవే నిన్ను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్తాయి అని రజనీకాంత్ హితవు పలికినట్లు వెంకటేశ్ వివరించారు. రజనీకాంత్ చెప్పిన ఆ మాటలనే తాను స్ఫూర్తిగా తీసుకున్నానని వెంకటేశ్ పేర్కొన్నారు. అప్పటినుంచి ప్రచారం, పోస్టర్లు, కటౌట్ల వంటి ఆర్భాటాలకు తాను పెద్దగా ప్రాధాన్యం ఇవ్వలేదని స్పష్టం చేశారు. కేవలం మంచి కథలను ఎంచుకోవడం, నాణ్యమైన చిత్రాలు చేయడంపైనే నా పూర్తి ఏకాగ్రత ఉంటుంది. అదే నన్ను ఈ రోజు ఈ స్థాయిలో నిలబెట్టిందని నేను గట్టిగా నమ్ముతున్నాను అంటూ తన విజయ రహస్యాన్ని పంచుకున్నారు. తాను మొదటి నుంచి ఆధ్యాత్మిక భావనలకు అధిక ప్రాధాన్యత ఇస్తానని, ఈ విషయంలో రజనీ కాంత్‌తో తనకు సారూప్యత ఉందని కూడా వెంకటేశ్ ఈ సందర్భంగా తెలిపారు.

తెర

# పహల్గాం దాడి మృతులకు ఫిలిం ఛాంబర్ నివాళి!

ఇటీవల పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. పాకిస్తాన్ ఉగ్రవాదులు చేత కానీ వారిలాగా అమాయకులపై విరుచుకుపడ్డారు. దీంతో దేశ వ్యాప్తంగా ఈ ఘటనపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి భారతీయుడి రక్తం మరిగిపోతుంది. పాకిస్తాన్ ఉగ్రవాదులను కట్టడి చెయ్యాలంటూ దేశావ్యాప్తంగా నిరసనలు మొదలయ్యాయి. ఇప్పటికే అధికారులు ఉగ్రవాదులను కట్టడి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. భారత సైనికులు రంగంలో దిగారు. ఉగ్రవాదుల వేట మొదలు పెట్టారు. ఇకపోతే కశ్మీర్ ఉగ్రదాడిలో చనిపోయిన వారికి ఫిలిం ఛాంబర్ ఆధ్వర్యంలో నివాళి జరిగింది. ఈ క్రమంలో ఎంఎఎ మాజీ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ అండ్ సీనియర్ నటుడు మురళి మోహన్ మాట్లాడుతూ, ఈ ఉగ్రదాడి చాలా దురదృష్టకర మైన పరిణామం అన్నారు. ప్రశాంతకరమైన భారతదేశంలో ఇలాంటి దాడులు జరగడం చాలా బాధాకరం అన్నారు. ఈ దాడికి ప్రపంచం మొత్తం కూడా బాధకు గురయ్యింది అన్నారు. మన దేశంలో మంచి మంచి పర్యాటక ప్రదేశాలు వున్నా, పక్క దేశాల వారు రావడానికి ఇష్టం చూపించట్లేదు అన్నారు. దానికి కారణం మనలో మనకే తేడాలు అన్నారు. ఆ తేడాలు పక్కన పెట్టి అందరం ఒకటిగా ఉందాం అన్నారు. భారతీయులంతా ఒక్కటిగా ఐక్యమత్యంగా ఉందాం అని పిలుపునిచ్చారు. ఉగ్రవాదులను కట్టడి చెయ్యడానికి సిద్ధమైన అధికారులకు అండగా ఉందాం అని అన్నారు. టిఎఫ్టిసి కార్యదర్శి ప్రసన్న మాట్లాడుతూ, జరిగిన ఘటనను తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదులపై నిప్పులు చెరిగారు. ఉగ్రవాదులను కట్టడి చెయ్యడం కోసం ఉన్న ప్రోగ్రాంలన్ని క్యాన్సిల్ చేసుకుని ప్రధాని నరేంద్ర మోడీ ఇదే పనిగా పెట్టుకుని ముందుకు సాగుతున్నందుకు ప్రసన్న ఆయనకు కృతజ్ఞతలు చెప్పారు. అలాగే ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడుకి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి థాంక్స్ చెప్పారు. ఇక తెలుగు ఫిల్మ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ వల్లభనేని అనిల్ కుమార్ మాట్లాడుతూ, ఉగ్రవాదాన్ని తీవ్రంగా ఖండించారు. ఉగ్రదాడిలో ప్రాణాలు విడిచిన అమాయకులకు సానుభూతి ప్రకటించారు. బాధితులకు తెలుగు చిత్ర పరిశ్రమ, తెలుగు ఫిల్మ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఎప్పుడు కూడా అండగా ఉంటుంది భరోసా ఇచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి దాడులు జరగకుండా అవగాహన కల్పిస్తాం అంటూ హామీ ఇచ్చారు. ఈ ఘటనని సీరియస్‌గా తీసుకొని ముందుకు వెళుతున్న ప్రధాని నరేంద్ర మోడీకి, రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్య మంత్రులు చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఎంఎఎ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ మాదల రవి మాట్లాడుతూ, ఉగ్రదాడిపై విరుచుకుపడ్డారు. చనిపోయిన 26 మంది కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ఉగ్రవాదులను కట్టడి చేసేందుకు సిద్ధమైన అధికారులకు మన దేశంలో ఉన్న 140 కోట్ల జనాలు సహకరించాలని కోరారు. ఇందుకు మొత్తం తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో భరత్ భూషణ్ దామోదర్ ప్రసాద్, మురళి మోహన్, ప్రసన్న కుమార్, అనుపమ రెడ్డి మాదల రవి, వల్లభనేని అనిల్, శ్రీధర్, తుమ్మలపల్లి రామకృష్ణ, మాణిక్, ప్రకాష్, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.




# 'త్రీ రోజెస్' సీజన్ 2 గ్లింప్స్



ఈషా రెబ్బా, హర్ష చెముడు, ప్రిన్స్ సిసిల్, హేమ, సత్యం రాజేశ్, కుషిత కల్లపు ప్రధాన పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ త్రీ రోజెస్. ఆహా ఓటీటీలో సూపర్ హిట్టయిన ఈ సిరీస్‌కు ఇప్పుడు సీజన్ 2 రాబోతోంది. ఈ సిరీస్ ను మాస్ మూవీ మేకర్స్ బ్యానర్‌పై ఎస్ కేఎన్ నిర్మిస్తున్నారు. డైరెక్టర్ మారుతి షో రన్నర్‌గా వ్యవహరిస్తున్నారు. రవి నంబూరి, సందీప్ బొల్ల రచన చేయగా, కిరణ్ కె కరవల్ల దర్శకత్వం వహించారు. త్రీ రోజెస్ సీజన్ 2 నుంచి యాక్ట్రెస్ కుషిత కల్లపు గ్లింప్స్ రిలీజ్ చేశారు. కుషిత కల్లపు క్యారెక్టర్ బోల్డ్, ఫియర్స్, గ్లామరస్‌గా ఉండి ఆకట్టుకుంటోంది. త్రీ రోజెస్ సీజన్ 2 కు ఆమె క్యారెక్టర్ వన్ ఆఫ్ ది అట్రాక్షన్ కాబోతోంది. తెలుగు అమ్మాయిలను ఎంకరేజ్ చేస్తున్న ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్ ఈ సిరీస్‌లో కుషితకు కీలకమైన క్యారెక్టర్ ఇచ్చారు. కుషితకు సోషల్ మీడియాలో మంచి ఫాలోయింగ్ ఉంది. త్రీరోజెస్ సీజన్ 2లో ఆమె క్యారెక్టర్ వైవిధ్యంగా ఉంటూ, యూత్‌ను బాగా ఆకట్టుకునేలా వైరల్ కంటెంట్‌తో ఉండనుంది. ఇప్పటికే త్రీ రోజెస్ సీజన్ 2 నుంచి రిలీజ్ చేసిన హీరోయిన్ ఈషా రెబ్బా గ్లింప్స్‌కు మంచి రెస్పాన్స్ వస్తోంది. త్వరలోనే త్రీ రోజెస్ సీజన్ 2 ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్‌కు రెడీ అవుతోంది.

# 'కిష్కింధపురి' ఫస్ట్ గ్లింప్స్ రిలీజ్




యాక్షన్ హాల్క్ బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హైలీ యాంటిసిపేటెడ్ మూవీ కిష్కింధపురి. రీసెంట్‌గా విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ సంచలనం సృష్టించింది. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై డైనమిక్, ప్యాషినేట్ సాహు గారపాటి నిర్మిస్తున్నారు, శ్రీమతి అర్చన సమర్పిస్తున్నారు. ఈ చిత్రానికి కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వం వహించారు. అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటిస్తున్న కిష్కింధపురి ఒక యూనిక్ ప్రపంచంలో సెట్ చేయబడింది, అద్భుతమైన హార్రర్‌మిస్టరీ ఎక్స్ పీరియన్స్ అందిస్తుంది. ఈ చిత్రం ఫస్ట్ గ్లింప్స్ ఇప్పుడు విడుదలైంది. బెల్లంకొండ శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్ ఒక హాంటెడ్ హౌస్‌లోకి వెళ్ళడంతో కథ మొదలౌతోంది. కొన్ని తలుపులు తెరవడానికి వీలు లేదు అని టీజర్ సూచిస్తుంది. బెల్లంకొండ శ్రీనివాస్ అహం మృత్యువు అనే డైలాగ్‌ని ఇంటెన్స్‌గా చెప్పే టెర్రిఫిక్ మూమెంట్‌లో ట్రైలర్ ముగుస్తుంది. ఫస్ట్ గ్లింప్స్ స్పైన్ చిల్లింగ్ ప్రివ్యూను అందిస్తుంది. ఈ మాన్సూన్‌లో ఈ చిత్రం థియేటర్లలోకి వస్తుందని మేకర్స్ ప్రకటించారు. బెల్లంకొండ శ్రీనివాస్ అహం మృత్యువు అని ప్రకటించే ఒక అద్భుతమైన మూమెంట్‌లో పవర్ ఫుల్ ఇంపాక్ట్ చూపించారు. ఇది వెన్నులో వణుకుపుట్టించి. ఈ గ్లింప్స్ టెక్నికల్‌గా విజువల్ వండర్‌గా ఉంది. దర్శకుడు కౌశిక్ పెగల్లపాటి గ్రిప్పింగ్ కథనం, చిన్మయ్ సలాస్కర్ అద్భుతమైన సినిమాటోగ్రఫీ, సామ్ హాంటింగ్ స్కోర్‌తో అదిరిపోయింది. షైన్ స్క్రీన్స్ బ్యానర్ నిర్మాణ విలువలు గ్రాండ్‌గా ఉన్నాయి, అతీంద్రియ అంశాల డెప్త్‌ని ప్రజెంట్ చేసే విఎఫ్ఎక్స్ వర్క్ టాప్ క్యాలిటీతో ఆకట్టుకుంది. ఈ చిత్రానికి ప్రొడక్షన్ డిజైన్‌ను మనీషా ఎ దత్ నిర్వహిస్తున్నారు, డి.శివ కామేష్ ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. నిరంజన్ దేవరమానే ఎడిటర్. ఈ ప్రాజెక్ట్ క్రియేటివ్ హెడ్ జి. కనిష్క, సహ రచయిత దరాహాస్ పాలకొల్లు, స్క్రిప్ట్ అసోసియేట్ కె బాల గణేష్.

నటీనటులు: బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్

సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం-కౌశిక్ పెగల్లపాటి నిర్మాత - సాహు గారపాటి, బ్యానర్ - షైన్ స్క్రీన్స్ సమర్పణ-శ్రీమతి అర్చన, సంగీతం: సామ్ సిఎస్ ప్రొడక్షన్ డిజైన్-మనీషా ఎ దత్, ఆర్ట్ డైరెక్టర్- డి శివ కామేష్, ఎడిటర్- నిరంజన్ దేవరమానే, సహరచయిత- దరహాస్ పాలకొల్లు, స్క్రిప్ట్ అసోసియేట్: కె బాల గణేష్ స్టంట్స్- రామ్ క్రిషన్, నటరాజ్, జాషువా కోడైరెక్టర్- లక్ష్మణ్ ముసులూరి క్రియేటివ్ హెడ్ - కనిష్క.జి ప్రొడక్షన్ కంట్రోలర్ సుబ్రహ్మణ్యం, ఉప్పల పాటి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్- టి సందీప్ పీఆర్వో వంశీ శేఖర్.

# 'లెవెన్' గ్రిప్పింగ్ ట్రైలర్



నవీన్ చంద్ర హీరోగా నటించిన బైలింగ్వల్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ ఎలెవెన్. సుందర్ సి వద్ద కలకలప్పు2, వంద రాజవతాన్ వరువేన్, యాక్షన్ వంటి చిత్రాలకు అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేసిన లోకేశ్ అజ్ల్స్ దర్శకత్వం వహించారు. ఎఆర్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై అజ్మల్ ఖాన్, రేయా హరి నిర్మించిన లెవెన్, విమర్శకుల ప్రశంసలు పొందిన సిలా నేరంగలిల్ సిలా మణిధర్గల్, సెంబి చిత్రాల విజయం తర్వాత వారి మూడవ వెంచర్. ఈ చిత్రం ఈ వేసవిలో అద్భుతమైన సినిమా ఎక్స్‌పీరియన్స్‌ని అందించడానికి సిద్ధంగా ఉంది. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై హ్యూజ్ బజ్ క్రియేట్ చేశాయి. ఉలగనాయకన్ కమల్ హాసన్ ఈ సినిమా ట్రైలర్‌ని లాంచ్ చేశారు. ఒక మ్యాసీవ్ ఫైర్ యాక్సిడెంట్‌తో మొదలైన ట్రైలర్ అవుట్ అండ్ అవుట్ థ్రిల్లింగ్ ఎక్స్ పీరియన్స్ ఇచ్చింది. లాస్ట్ ఇయర్ వైజాగ్‌లో వరుసగా ఎనిమిది హత్యలు జరిగాయి. సీరియల్ కిల్లింగ్స్ అనే ఇంటెన్స్ డైలాగ్‌తో పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా నవీన్ చంద్ర ఆ కేసుని పరిశోధించిన తీరు నెవర్ బిఫోర్ ఎక్స్ పీరియన్స్ ఇచ్చింది. సైకో కిల్లర్ విత్ అన్‌బిలివబుల్ ఐక్యూ అనే డైలాగ్ సైకో కిల్లర్ క్యారెక్టర్ చుట్టూ సస్పెన్‌ని మరింతగా పెంచింది. నవీన్ చంద్ర ఇంటెన్స్ పెర్ఫార్మెన్స్, సీరియల్ కిల్లింగ్ బ్యాగ్ డ్రాప్, డైరెక్టర్ లోకేశ్ అజ్ల్స్ గ్రిప్పింగ్ టేకింగ్ ట్రైలర్‌ని నెక్స్ట్ లెవెల్‌కి తీసుకెళ్ళాయి. సిలా నేరంగలిల్ సిలా మణిధర్గల్‌లో నటించిన రేయా హరి, ఎలెవెన్‌లో కథానాయికగా నటించింది. అభిరామి, రవివర్మ, కిరీటి దామరాజు ట్రైలర్‌లో కీలక పాత్రలలో ఆకట్టుకున్నారు. డి.ఇమ్మాన్ బీజీఎం, కార్తీక్ అశోకన్ సినిమాటోగ్రఫీ టాప్ క్లాస్‌లో వున్నాయి. జాతీయ అవార్డు గ్రహీత శ్రీకాంత్ ఎన్.బి. ఎడిటింగ్ రేసీగా వుంది. రుచిర ఎంటర్టైన్మెంట్స్ ప్రముఖ డిస్ట్రిబ్యూటర్ ఎన్ సుధాకర్ రెడ్డి ఈ సినిమా థియేట్రికల్ హక్కులను సొంతం చేసుకున్నారు.



మెహ్రీన్ పిర్జాదా నయా లుక్

# రెగ్యులర్ షూటింగ్‌లో 'శర్వా 38'

చార్మింగ్ స్టార్ శర్వా, బ్లాక్ బస్టర్ మేకర్ సంపత్ నంది ప్రతిష్టాత్మక పాన్ ఇండియా ప్రాజెక్ట్ శర్వా38 కోసం ఫస్ట్ టైమ్ కలిసి వర్క్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని శ్రీ సత్య సాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కెకె రాధామోహన్ నిర్మించారు. లక్ష్మీ రాధామోహన్ సమర్పిస్తున్నారు. 1960 బ్యాక్ డ్రాప్‌లో రూపొందుతున్న ఈ టైటిల్ ఫస్ట్ స్పార్క్ అనే పవర్ ఫుల్ కాన్సెప్ట్ వీడియో ద్వారా రివిల్ చేశారు. దర్శకుడు సంపత్ నంది విధి, పోరాటం, మార్పు అనే కథను నరేట్ చేస్తుండగా ఈ వీడియో సినిమా ఎసెన్స్ చూపిస్తుంది. శర్వా ఆ కథను ఆసక్తిగా వింటూ, ధైర్యం, యుద్ధాలతో నిండిన ఒక ప్రపంచాన్ని ఊహించుకుంటాడు. కీలక ఘట్టంగా ఒక ఖడ్గం ప్రయాణం మొదలవుతుంది. అలా భోగి టైటిల్ రివిల్ అవుతుంది. ఈ టైటిల్ కొత్త శక్తి, తిరుగుబాటును ప్రజెంట్ చేస్తోంది. వీడియోలో ప్రజెంట్ చేసినట్లుగా శర్వా నెవర్ బిఫోర్ పాత్రలోకి అడుగుపెడుతున్నారు. ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో నిర్మించిన భారీ సెట్‌లో గ్రాండ్ స్కేల్‌లో ప్రారంభమైయింది. వీటిలో కొన్ని భాగాలను కాన్సెప్ట్ వీడియోలో ప్రజెంట్ చేశారు. ఈ విజన్‌ని జీవం పోయడానికి ప్రొడక్షన్ టీం ఆరు నెలలు డెడికేషన్‌తో వర్క్ చేసి, దాదాపు 20 ఎకరాల భూమిని బ్రెత్ టేకింగ్ బ్యాక్ డ్రాప్‌గా మార్చింది. ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. 1960ల ఉత్తర తెలంగాణ, మహారాష్ట్ర ప్రాంతంలో వింటేజ్ సెట్టింగ్‌తో భోగి టెక్నికల్‌గా నెక్స్ట్ లెవల్‌లో ఉండబోతోంది. కిరణ్ కుమార్ మన్నె ఆర్ట్ డైరెక్టర్ కాగ, సినిమాటోగ్రాఫర్, సంగీత దర్శకుడు, ఎడిటర్‌ను త్వరలోనే అనౌన్స్ చేస్తారు. భోగి తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది.



నటీనటులు: చార్మింగ్ స్టార్ శర్వా, అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి, సాంకేతిక సిబ్బంది: రచయిత, దర్శకత్వం: సంపత్ నంది, నిర్మాత: కేకే రాధా మోహన్, బ్యానర్: శ్రీ సత్యసాయి ఆర్ట్స్, సమర్పణ: లక్ష్మీ, రాధా మోహన్ ఆర్ట్ డైరెక్టర్: కిరణ్ కుమార్ మన్నె పీఆర్వో: వంశీ శేఖర్.

ఈ చిత్రం సినిమా గ్రేట్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించబోతోంది.

# ఐబిఎం ప్రొడక్షన్ హౌస్ తొలి చిత్రం!

వరలక్ష్మీ పప్పుల ప్రజెన్స్‌లో కనకదుర్గారావు పప్పుల నిర్మాతగా భాను దర్శకత్వంలో సరికొత్త ప్రేమకథతో ఒక చిత్రం రాబోతోంది. యువతను విపరీతంగా ఆకట్టుకునే ప్రయత్నమే ఈ చిత్రం. ఇప్పటివరకు సందేశం, సామాజిక స్పృహతో సినిమాలు చేసిన దర్శకుడు భాను మొట్టమొదటి సారిగా తన పంథాను మార్చుకొని ఒక స్వచ్ఛమైన ప్రేమ కథను డైరెక్ట్ చేశారు. నలభై తొమ్మిది రోజులు నాన్ స్టాప్‌గా షూటింగ్ జరుపుకున్న ఈ మూవీ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. జూన్‌లో ఈ సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. యువతను విపరీతంగా ఆకట్టుకునే ఐదు అద్భుతమైన సాంగ్స్ ఈ సినిమాలో ఉన్నాయి. ఒక పెద్ద సంగీత కుటుంభం నుండి మ్యూజిక్ డైరెక్టర్ ఈ సినిమాతో పరిచయం కాబోతున్నారు, అలాగే ఒక కొత్త టాలెంటెడ్ రైటర్ ఈ చిత్రానికి సంభాషణలు అందిస్తున్నారు. ఈ చిత్రంలో నటించే ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో తెలియను న్నాయి. డెబ్భై ఐదు చిత్రాల్లో చైల్డ్ ఆర్టిస్‌గా చేసిన ఒక అబ్బాయి, పదహారణాల తెలుగు అమ్మాయి ఈ సినిమాలో హీరో హీరోయిన్లుగా నటించారు. ఈ చిత్రానికి నిర్వాహణ మర్రి రవికుమార్. ఐబిఎం ప్రొడక్షన్ హౌస్ సంస్థలో నిర్మాత కనకదుర్గారావు పప్పుల ఎక్కడా రాజీ పడకుండా సినిమాను గుడ్ ప్రొడక్షన్ వాల్యూస్‌తో నిర్మించారు. త్వరలో ఈ చిత్ర టైటిల్ మరియు ఫస్ట్ లుక్‌ను యూనిట్ సభ్యులు విడుదల చేయబోతున్నారు.



# మనసు తేలికైతే పని సులువు!



ఇంట్లో అమ్మానాన్నతో మాత్రమే కాదు, అన్నా, చెల్లి, అక్కా, తమ్ముడు ఇంకా వదిన ఇలా ఎవరితోనైనా కలిసిపోవాలి. వారితో సంతోషాలను పంచుకోవాలి. చదువుతున్నా, లేదా ఉద్యోగం చేస్తున్నా ఇంట్లో వాళ్లతో కలిసి మెలిసి ఉండాలి. వారితో రోజువారీ వ్యవహారాల్లో ఏం జరుగుతుందో తెలుసుకోవాలి. ఏం చేయగలమో చూడాలి. అంతేగాని ఏదో నామానాన నేను అన్నట్లుగా మన పని చూసుకోవడం. తినడం, పడుకోవడం, ఆఫీసుకు వెళ్లడం. అలా చేయడం వల్ల సమాజంలో ఎలా ఉండాలి అన్న ఆలోచన భయపెడుతుంది. అలా కాకుండా ఇంట్లో చిన్నా, పెద్దవారితో కలిసి మాట్లాడటం, బయటికి వెళ్లడం, కుదిరినప్పుడు వారితో కలిసి పనులు చేయడం వంటివి చేస్తుంటే ఇంట్లోనే కాదు ఆఫీసులో కూడా అంతే ఉత్సాహంగా కొలీగ్స్‌తో కలిసిపోయి పనులు చేయవచ్చు. అలా చేయడం వల్ల రోజంతా హాయిగా అనిపిస్తుంది. ఆఫీస్‌కు వెళ్లాలన్న ఉత్సాహం పెరుగుతుంది. కెరీర్‌పరంగా అభివృద్ధికి దోహదం చేస్తుంది. మనసు ఎంత ప్రశాతంగా ఉంటే అంత చురుగ్గా పనులు చేయగలం. ఇలాంటప్పుడే కొత్తకొత్త ఆలోచనలు వస్తుంటాయి. ఇలాంటి క్రియేటివిటీ చేసే పనికి అవసరం. మనసు ప్రశాంతంగా ఉండాలంటే మనవారితోనే కాదు బయటివారితోనూ స్నేహంగా మెదలాలి. కలుపుగోలుగా ఉంటే మంచి ఆలోచనలు వచ్చి వాటిని ఆచరణలో పెడితే మనలోని నైపుణ్యాలు, ప్రత్యేకతలతో పనిలో మెరుగుదల కనిపిస్తుంది. మంచి పేరు పొందే అవకాశం ఉంటుంది. ఇది కెరీర్ అభ్యున్నతికి దోహదం చేస్తుంది. కొలీగ్స్‌తో స్నేహంగా ఉంటూనే వారి కంటే మరింత మెరుగ్గా పని చేయాలన్న పోటీతత్వాన్ని పని ప్రదేశంలో పెంచుకుంటే చక్కటి అవుట్‌పుట్‌ను సంస్థకు అందించవచ్చు. అయితే నా కంటే వాళ్లు బాగా చేస్తున్నారన్న అసూయ, ద్వేషాలకు తావు లేకుండా అవతలి వారిని ప్రశంసిస్తూ, బెస్ట్‌గా నిరూపించుకోవడం వల్ల పని ప్రదేశంలో ఆరోగ్యకరమైన పోటీతత్వం నెలకొంటుంది. ఇది మనమున్న గ్రూప్‌కు, సంస్థకు మేలు చేస్తుంది. ఎలాంటి ఉద్యోగమైనా పనులు పూర్తిచేయడం అనుకున్నంత సులభం కాదు. ఎందులో ఉండే ఒత్తిళ్లు అందులో ఉంటాయి. వాటిని అధిగమించినప్పుడే పని కష్టమైనదైనా ఇతరుల సహకారంతో సులభంగా పూర్తి చేయవచ్చు. ఇది సాధ్యం కావాలంటే ఇతరులతో సఖ్యంగా ఉంటే వారి సహకారం అందుతుంది. గ్రూప్‌లో ఉన్న వారితో కలిసి ఉండటం వల్ల పని విషయంలో ఏ విషయంలో ఒకరి అభిప్రాయాలు ఒకరు పంచుకోవడం. ఒకరి ఆలోచనలో ఒకరికి చెప్పుకోవడం వల్ల పనిలో లోపాల్ని సరిచేసుకోవచ్చు. పాజిటివ్‌గా వాటిని స్వీకరించవచ్చు. అప్పుడే ఎలాంటి ఒత్తిడి లేకుండా పనిని పూర్తిచేయగలుగుతాం.

ఉద్యోగుల మధ్య మంచి సంబంధాలు నెలకొనాలంటే సంస్థలు తమ వంతుగా కృషి చేస్తే మంచి వాతావరణం ఏర్పడుతుంది. ఉద్యోగులకు కొన్నిసార్లు ఉత్సాహపరిచే కార్యక్రమాలు ఏర్పాటు చేస్తే వారు పని ఒత్తిడిన అధిగమించి హుషారుగా ఉండగలుగుతారు. ఆటలు, పాటలు, డిబేట్స్ వంటి ఇందుకు దోహదం చేస్తాయి.

**చెలి చిట్కా**

★ కర్పూరం దగ్గుకు, కలరాకు బాగా పనిచేస్తుంది.

★ గాట్లు, దెబ్బలు, కోతలకు తేనె పూస్తే త్వరగా గాయాలు నయమవుతాయి.

# అల్లా అచ్చా కరేగా!




అల్లా అచ్చా కరేగా! ఎంతటి మహనీయుడైనా చేసే అజ్ఞానపు పని అంటూ ఉంటే తన గురువును గూర్చి రాయటమే. ఇది సాయిబాబా విషయంలో అందరకూ అనుభవమవుతున్న యదార్థ విషయం. సాయిబాబా గత శతాబ్దపు విలక్షణమూర్తి. ఈ శతాబ్దిలో గూడా మహామహిమాన్వితులుగా విశ్వఖ్యాతిని, భక్తి ప్రేమలను పొందిన కారుణ్యమూర్తి, ప్రజల మనిషి. మనిషికి ఎన్ని జన్మలో అన్ని కథలను తన చుట్టూ అల్లుకున్నాడు. అల్లింప చేసుకున్నాడు. అదంతా ఒక సాలెగూడు లాంటిదే. ఆ గూటిలో ఒక్కొక్కదారం ఒక్కొక్క జన్మ. ఆ జన్మలో మనమందరమూ ఉంటాము. అయితే తన స్వభావానికి తగిన కథ అది చూపే మార్గాన్ని పాటిస్తే చాలు. సాయినాథుని అసాధారణ లక్షణాలలో ఒకటి అందరకూ ఎల్ల వేళలా అందుబాటులో ఉండటం. రాత్రింబవళ్లు అందరిపై శ్రద్ధ చూపేవాడాయన. ఈ శ్రద్ధను మానవులకే పరిమితం చేయలేదు. సర్వప్రాణులకు, తన ప్రేమను పంచి ఇచ్చాడు. గురువులకు, దైవానికి సేవ చేసే శిష్యులున్నారు, భక్తులున్నారు. కానీ సాయి వైఖరే వేరు. సేవకుడంటే, శిష్యుడంటే సాయిలాగా ఉండాలనే ముద్ర ఎన్నటికీ చెరిగిపోదు ప్రజల మనస్సు నుండి. మహారాజంతటి సంపాదనతో భిక్ష మెత్తుకు తిరిగే సాయి చేష్టల నుండి అమృత బిందువులను సేవించవచ్చు. చిరిగిన కఫ్నీని, కుట్టుకుని వేసుకునే పేదరికంతో బ్రతికినా చాలు అదీ భగవానుడు ఇచ్చిందనే తృప్తే ఉంటే ఈ విశాల విశ్వమూ మనదే అవుతుంది అని రుజువు చేసిన యుగపురుషుడు సాయి. తన జీవితం ద్వారా ఒకరిపట్ల మరొకరు ద్వేషం పెంచుకోనట్లు, ఒకరినొకరు ప్రేమించుకోవటానికి దోహదం చేసిన మతాతీతుడు. సాయి భగవంతుడే. భగవంతుని అవతారాల్లో దేని పరమార్థం దానికుంది. కానీ, సాయి అవతారంలోని పరమార్థం విశ్వాన్ని శుభ్ర మార్గంలో నడపటం ఒకటి మాత్రమే. నేడు ఈ విశాల విశ్వంలో ' శ్రీ సచ్చిదానంద సమర్థ సద్గురు సాయినాథ్ మహారాజుకు జై' అనే ధ్వని వినిపించని క్షణం ఉండదు. శ్రద్ధ, సబూరిలుంటే అడుగడుగునా కాదు, అణువణువునా దర్శనమిస్తాడు సాయి.

**నమామీశ్వరం సద్గురుం సాయినాథం!**

**- ఎం.పి.సాయినాథ్**

# సెలవులు వికాసానికి నెలవులు



**ఎన్.బి.సుధాకర్‌రెడ్డి**
**సైకాలజిస్టు**

**ప్రశ్న :** మాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. పాప ఏడు, బాబు అయిదవ తరగతి చదువుతున్నారు. ఒక విధంగా చెప్పాలంటే పూర్తిచేసిపై తరగతులకు వెళుతున్నారు. వేసవి సెలవులు ఇచ్చారు. కాబట్టి వారిద్దరిని మా పల్లెకు పంపుదామని భావిస్తున్నాను. అక్కడ మా అత్త, మామ ఉన్నారు. సెలవుల్లో మా ఆడపడుచు, మరిది పిల్లలు కూడా అక్కడికి వెళుతున్నారు. అయితే మా వారు అందుకు సమ్మతించలేదు. ఆయన ఒక ఉన్నత స్థాయి ప్రభుత్వ ఉద్యోగి. నేను డిగ్రీ కళాశాలలో బాటనీ లెక్చరర్‌గా పనిచేస్తున్నాను. మా ఆడపడుచు భర్త, మా మరిది చిన్న ఉద్యోగులు. పైగా పల్లెటూరులో చదువు సాము రాని వారు ఎక్కువగా ఉంటారని, అలాంటి వారి మధ్య రెండు మూడు వారాలు గడిపితే మా పిల్లలు పాడైపోతారని మా వారి వాదన. పల్లెలో మా పిల్లలకు వారి తాతయ్య ఈత, సైకిల్ నేర్పుతానని చెప్పారు. అయితే ఆ రెండు మేమున్న నగరంలోనే నేర్పించవచ్చని మా వారు అంటున్నారు. మా పిల్లలు ఇద్దరు పల్లెకు పోవాలని ఉత్సాహపడు తున్నారు. పల్లెలో బూతులు నేర్చుకుంటారని, ఉన్న మతి పోతుందని మా వారు అంటున్నారు. ఇక్కడే ఉంచుకుని పై తరగతి పుస్తకాలు చదివిస్తే వచ్చే ఏడాది మంచి మార్కులు వస్తాయని అంటున్నారు. మా ఇద్దరి వాదన విన్న పిల్లలు కొంత బాధపడి, వారి నాన్నను బ్రతిమిలాడితే మనసు కరిగి వారం రోజులు అనుమతి ఇచ్చారు. అయితే వారితో పాటు నేను కూడా వెళ్లి వారిని బయట తిరక్కుండా చూడాలని కండిషన్ పెట్టారు. అయితే అక్కడి నుంచి మా పుట్టింటికి వెళ్లి మరో వారం ఉండి వస్తానంటే ససేమిరా అంటున్నారు. మాది మరీ చిన్న పల్లెటూరు కావడమే అందుకు కారణం. మా వారి అభిప్రాయం తప్పని నా భావన. తాను పుట్టి, పెరిగిన ఊరు, అక్కడి మనుషులు, వాతావరణంపట్ల ఆయన ప్రతికూలంగా మాట్లాడటం నాకు నచ్చలేదు. దీనిపై మీ అభిప్రాయం చెప్పండి.

**- ఒక సోదరి, హైదరాబాద్**

**జవాబు :** అమ్మా! వేసవి సెలవులు పిల్లల వికాసానికి నెలవులు అన్నది నిపుణుల అభిప్రాయం. పిల్లల సమగ్ర అభివృద్ధికోసం సెలవులను వాడుకోవడం మంచిది. పిల్లలను పంజరంలో చిలుకలు లాగ పెంచకూడదు. సమాజం, ప్రకృతితో మమేకం



చేయడం ద్వారా వారిలో దాగి ఉన్న సామర్థ్యాలు, నైపుణ్యాలు బయటికి వస్తాయి. నగరాలలోని స్విమ్మింగ్‌పూల్స్ లో ఈత నేర్చుకోవడం కంటే పల్లెల్లోని బావులు, చెరువుల్లో ఈత నేర్చుకోవడం వల్ల ఎక్కువ ఆనందం, ఆత్మవిశ్వాసం సొంతం అవుతుంది. పల్లెల్లో నాగరికత తక్కువగా ఉన్నప్పటికీ సంస్కారం, అభిమానం, స్నేహస్వభావం, సేవ, సహకారంలాంటివి బాగా ఉంటాయి. మనిషి సామాజిక జీవి. సమాజంలోని అన్ని వర్గాలు, ప్రాంతాలపట్ల అవగాహన పెంచుకోవడం చాలా ముఖ్యం. ఇటీవల మనం చూస్తున్న పలు వార్తల్లో పల్లెల్లో నుంచి ఉన్నతస్థాయికి ఎదిగిన అనేక మంది కనిపిస్తున్నారు. గొర్రెల కాపరి పిల్లలు, రైతుబిడ్డలు, పేదవారు, కానిస్టేబుల్ స్థాయి నుంచి సివిల్స్ పాసైన వారె వార్తలు వెలుగుచూస్తున్నాయి. కాబట్టి పల్లెల పట్ల చులకన భావం తగదు. నిజానికి భారతదేశం పల్లెల్లో ఉంది. మన జీవనం పల్లె ప్రజలు, రైతులుపై ఆధారపడే ఉంటుంది. నగరాలలో ఉన్న కొందరు పిల్లలకు బియ్యం, పాలు, పెరుగు, నెయ్యి లాంటివి ఎలా వస్తాయో కూడా తెలియదు. కొద్దిరోజులు పల్లెల్లో ఉంటే అన్ని విషయాలు పిల్లలకు తెలుస్తాయి. పల్లెలకు వెళ్లే అవకాశం లేని వారు పట్టణాలు, నగరాలలోని వేసవి శిక్షణా శిబిరాల ద్వారా పిల్లల్లో సామర్థ్యాలు పెంచి వికాసం కల్పించడం మం చిది. పిల్లలను కేవలం చదువులకే పరిమితం చేయడం మంచిదికాదు. కాబట్టి మీ వారితో సున్నితంగా చర్చించి, ఒప్పించి, మెప్పించి పిల్లల వికాసానికి తోడ్పడండి.

**వ్యధ**

# పోషకాల పైన్‌ఆపిల్



యూరోపియన్లు ఏ పండునైనా ఆపిల్ అని పిలిచేవారట. ఇది చూడ్డానికి పైన్ చెట్టు కోన్స్‌లా కనిపించడంతో పైనాపిల్ అని పిలవడం మొదలు పెట్టారు. చిన్న పొదలాంటి మొక్కకు కాసే ఈ పైనాపిల్ పుట్టింది దక్షిణ అమెరికాలోనే అయినా తర్వాత అన్ని దేశాలకీ పాకింది. పోషకాల విలువలు తెలుసుకుని అన్ని ప్రాంతాల్లోనూ తినడం మొదలు పెట్టారు. ఇప్పుడు కోస్టారికా, ఫిలిప్పీన్స్ దేశాలు అత్యధికంగా అనాసల్ని పండిస్తూ ప్రపంచ వ్యాప్తంగా ఎగుమతి చేస్తున్నాయి. మన దేశంలోనూ వీటిని ఎక్కువ మొత్తంలో సాగు చేస్తున్నారు. మనకు కనిపించే సాధారణ పైనాపిల్‌తోపాటు ప్రపంచ వ్యాప్తంగా వందల రకాలున్నాయట. అందులో చెప్పుకోదగ్గ వెరైటీలూ చాలానే ఉన్నాయి. గులాబీ రంగులో మెత్తటి గుజ్జుతో నోరూరించే పింక్ పైనాపిల్ నోటికీ కొత్తరుచిని అందిస్తుంది. కమ్మటి వాసనలతో నోరూరిస్తుంది. పండ్లరసాలూ, స్మూతీల్లో ఎక్కువగా వాడే ఈ పింక్‌గ్లో పైనాపిల్‌ని ప్రత్యేకంగా జన్యుమార్పిడి చేసి పండించారు. పండును పసుపు రంగులోకి మార్చే ఎంజైమ్‌ను పనిచేయకుండా చేయడం ద్వారా ఈ గులాబీ రంగు పైనాపిల్ జాతిని సృష్టించారట. దీంతోపాటు ఎర్రటి రంగుల్లో ఆకర్షించే ఎన్నో రకాలున్నాయి. వాటిల్లో రెడ్ స్పానిష్ పైనాపిల్ ఆకారమూ, పరిమళమూ అందరికీ నచ్చేస్తాయి. కోస్టారికాలో పండ్ల అలంకరణ కోసం కెంపు రంగులో మెరిసే రూబీగ్లో పైనాపిల్ ఎక్కువగా పెంచుతుంటారు. ఇవే కాదు, ఐస్‌క్రీమ్‌లా తెల్లటి గుజ్జుతో ఉండే షుగర్‌లోఫ్ పైనాపిల్ బయటనుంచి మూమూలు వాటిలానే కనిపించే పండును కోయగానే మాత్రం గుజ్జు రంగు వేరుగా ఉంటుంది. నోట్లో పెట్టుకోగానే దాని తియ్యటి రుచి మరింత ఆశ్చర్యపరుస్తుంది. నిజానికి పైనాపిల్‌ని కోయడమంటే ఒక పెద్ద పని. ముక్కలు చేస్తే గానీ అసలు నోట్లో పెట్టలేం. కానీ బోగర్ అనాసని మాత్రం అడుగు తీసేసి, సీతాఫలం పండులా ఒలుచుకుంటూ తినేయొచ్చు. ఏ ముక్కకాముక్కలా వచ్చే దీన్ని స్నాక్ పైనాపిల్‌గా పిలుస్తారు. ఎన్నో ఏళ్లుగా జపాన్‌లో ఈ పండ్లను సాగు చేస్తున్నారు. అరచేతిలో ఓ అయిదారు పట్టేంత పరిమాణంలో ఉండే బుల్లి పైనాపిల్స్ తోలు తీసేసి ఉన్న పళంగా అలా తినేయొచ్చు.

---

# సీమలో రైలు మార్గం పనులు

## - తెలుగు రాష్ట్రాల మీదుగా తిరిగే రైళ్లు దారిమళ్లింపు

**గుంతకల్లు రైల్వే,ఏప్రిల్ 30,ప్రభాతవార్త** రాయలసీమలోని దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్,గుంతకల్లు/గుత్తి–ధర్మవరం సెక్షన్‌లో జరుగుతున్న రెండో దశ రైల్వే భద్రత,సాంకేతిక పనుల కారణంగా రాయలసీమ మీదుగా వివిధ ప్రాంతాల మధ్య రాకపోకలు సాగించే మరికొన్ని రైలు సర్వీసులను దారి మళ్లించి నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి.

దారిమళ్లించిన రైళ్లు : మే 10,17వ తేదీల్లో కాచిగూడ నుంచి మధురైకు బయలుదేరి, మే 4,11తేదీల్లో మధురై నుంచి కాచిగూడకు బయలుదేరే నెంబర్ 22715/16 ఎక్స్‌ప్రెస్‌లను డోన్,రేణిగుంట,తిరుపతి పాకాల మీదుగా మళ్లించారు. మే 15నుంచి 20వరకు హుబ్లీ నుంచి మైసూర్‌కు, మే 11నుంచి 17వరకు మైసూర్ నుంచి హుబ్లీలకు బయలుదేరే నెంబర్ 16591/92హంపి ఎక్స్‌ప్రెస్‌లను బళ్లారి,రామదుర్గం, చిక్ జాజూర్, యశ్వంత్‌పూర్‌ల మీదుగా మళ్లించారు. మే 12న యశ్వంత్‌పూర్ నుంచి గోరఖ్‌పూర్‌కు బయలుదేరే నెంబర్ 12592ఎక్స్‌ప్రెస్‌ను యశ్వంత్‌పూర్,చిక్ జాజూర్, బళ్లారి, గుంతకల్లు బైపాస్,రాయచూరుల మీదుగా, మే 14న హౌరా నుంచి యశ్వంత్‌పూర్‌కు బయలుదేరే నెంబర్ 22831ఎక్స్‌ప్రెస్‌ను డోన్, గుంతకల్లు, బళ్లారి మీదుగా, మే 16,12తేదీల్లో బెంగళూరు నుంచి అజ్మీర్‌కు బయలుదేరే నెంబర్ 16532 అజ్మీర్ ఎక్స్‌ప్రెస్, మే 12న అజ్మీర్ నుంచి బెంగళూరుకు బయలుదేరే నెంబర్ 16531అజ్మీర్ ఎక్స్‌ప్రెస్‌లను యశ్వంత్‌పూర్,చిక్ జాజూర్,బళ్లారి,హుబ్లీ మీదుగా మళ్లించారు. మే 14న భగత్‌కికోఠి(జోధ్‌పూర్)నుంచి బెంగళూరుకు బయలుదేరే నెంబర్ 16533ఎక్స్‌ప్రెస్‌ను బళ్లారి, రాయదుర్గం,చిక్ జాజూర్,యశ్వంత్‌పూర్‌ల మీదుగా, మే 16న సాయినగర్ షిర్డీ నుంచి చెన్నై సెంట్రల్‌కు బయలుదేరే నెంబర్ 22602ఎక్స్‌ప్రెస్‌ను గుత్తి,రేణిగుంట మీదుగా మళ్లించారు. మే 8,15తేదీల్లో బెంగళూరు నుంచి గౌహతి, మే 5,12తేదీల్లో గౌహతి నుంచి బెంగళూరులకు బయలుదేరే నెంబర్ 00635/36పార్సిల్ ప్రత్యేక రైళ్లను జోలార్‌పేట్,రేణిగుంట, గూడూరు,విజయవాడల మీదుగా మే 13న తుగ్లక్‌బాద్ నుంచి యశ్వంత్‌పూర్‌కు బయలుదేరే నెంబ00640పార్సిల్ ప్రత్యేక రైలును గుంతకల్లు బైపాస్,బళ్లారి,యశ్వంత్‌పూర్ మీదుగా మళ్లించారు.

# క్రీడాకారులకు హారిజంటల్ రిజర్వేషన్ - మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

**విజయవాడ ఏప్రిల్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు 3% హారిజంటల్ రిజర్వేషన్ కల్పిస్తుందని ఏపీ క్రీడాశాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. రాత పరీక్షలు లేకుండా ఉద్యోగాలు. మెగా డీఎస్సీ లో 421 ప్రభుత్వ పాఠశాల ఉద్యోగాలు క్రీడా కోట కింద భర్తీ చేయడం జరుగుతుందని తెలిపారు.బుధవారం ఆయన శాప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఉద్యోగాలు అందుబాటులో ఉన్న విద్యా సంస్థలు జిల్లా పరిషత్, మండల పరిషత్ మునిసిపాలిటీ మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, ఎపి రెసిడెన్షియల్ విద్యా సంస్థలు ఎపి మోడల్ స్కూల్స్ సోషల్ ట్రైబల్ వెల్ఫేర్ గురుకులాలు. ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు మే 2 -మే 31. రాత పరీక్షల అవసరం లేకుండా సీనియర్ క్రీడా విభాగం మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తోందన్నారు.

జిల్లా స్థాయి స్క్రీనింగ్ కమిటీ రాష్ట్ర స్థాయి ఫైనల్ కమిటీల ద్వారా తుది జాబితా ఆమోదించడం జరుగుతుందని తెలిపారు.

# రాష్ట్రంలో విద్యార్థులకు వ్యాపార నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యం: మంత్రి నారా లోకేష్

## యువతకు నైపుణ్యాభివృద్ధి, సాధికారతకు యునిసెఫ్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం




లోకేష్ సమక్షంలో యువతకు నైపుణ్యాభివృద్ధి, సాధికారతకు యునిసెఫ్ ప్రతినిధులతో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ఎంవోయూ చేసుకున్న దృశ్యం

**విజయవాడ,ఏప్రిల్30,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో నిరుద్యోగ యువతీ, యువకులకు నైపుణ్యాభివృద్ధితో పాటు సాధికారత కల్పించేందుకు యునిసెఫ్‌తో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా ఏపీ ప్రభుత్వం, యూనిసెఫ్ 3 ప్రధాన యువశక్తి అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడం జరిగింది. ఈ మేరకు ఉండవల్లి నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఏపీఎస్ఎస్ డీసీ, యునిసెఫ్ యువాహ్ ప్రతినిధులు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఎంవోయూపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ద్వారా యునిసెఫ్, ఏపీఎస్ఎస్ డీసీ పరస్పర సహకారంతో యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ యూత్ హబ్, పాస్‌పోర్ట్ టు ఎర్నింగ్ కార్యక్రమాలను అమలుచేయనున్నారు. ఇంటికో వ్యాపారవేత్త, స్వర్ణాంధ్ర లక్ష్య సాధనకు ఇవి ఎంతగానో తోడ్పాటును అందించనున్నాయి. యువతలో నవీన ఆవిష్కరణలు, ఇంక్లూజన్, స్థిర జీవనోపాధి అవకాశాలను పెంపొందించనున్నాయి. యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ ద్వారా పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్ అభ్యసించే 2 లక్షల మంది యువతకు వ్యాపార నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు ఉద్యోగ సృష్టి, సమస్యల పరిష్కార నైపుణ్యాలను అందించేందుకు యూనిసెఫ్ గ్లోబల్ గిశిలీబీ.సీగి ఫ్రేమ్‌వర్క్ ద్వారా శిక్షణ ఇవ్వనున్నారు. యూత్ హబ్ ద్వారా ఆంధ్రప్రదేశ్ నైపుణ్యం పోర్టల్‌తో అనుసంధానించిన బహుభాషా డిజిటల్ వేదిక ద్వారా యువతకు ఉద్యోగాలు, నైపుణ్యాభివృద్ధి, వాలంటీర్‌షిప్ అవకాశాలను కల్పిస్తారు. పాస్‌పోర్ట్ టు ఎర్నింగ్ కార్యక్రమం ద్వారా 15 నుంచి 29 సంవత్సరాల మధ్యగల యువతకు ఉచితంగా అంతర్జాతీయ స్థాయిలో డిజిటల్, ప్రొఫెషనల్ నైపుణ్య శిక్షణను అందిస్తారు. ఈ కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి, శిక్షణ విభాగం కార్యదర్శి కోన శశిధర్, ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఎండీ, సీఈవో జి.గణేష్ కుమార్, ఏపీఎస్ఎస్ డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.దినేష్ కుమార్, యునిసెఫ్ ఏపీ, కర్ణాటక, తెలంగాణ ఫీల్డ్ ఆఫీస్ సీఎఫ్ వో జిలాలిమ్ బిర్హాను టఫెస్సే, ఫీల్డ్ ఆఫీస్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ మురళీకృష్ణ మదమంచి, యూనిసెఫ్ ఇండియా అడాలసెంట్ అండ్ యూత్ డెవలప్ మెంట్ స్పెషలిస్ట్ మానస ప్రియా వాసుదేవన్, స్టాక్ హోల్మ్ డిజిటల్, ఏఐ, స్ట్రాటజీ, ఆఫీస్ ఆఫ్ ఇన్నోవేషన్ కన్సల్ టెంట్ రవితేజ బాలే, ఏపీ కర్ణాటక, తెలంగాణ యునిసెఫ్ ఫీల్డ్ ఆఫీస్ ఇన్నోవేషన్ కన్సల్ టెంట్స్ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సిఎం చంద్రబాబు దృష్టికి ఆర్డీటి ఎఫ్.సి.ఆర్.ఎ అంశం

## సిఎంని కలిసి వివరించిన ఎమ్మెల్యేలు కాలువ, పరిటాల సునీత, ఇతర ఎమ్మెల్యేలు



సీఎంకు ఆర్డిటిపై వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యేలు

**అనంతపురం, ఏప్రిల్ 30(ప్రభాతవార్త బ్యూరో)** గత కొన్ని రోజులు ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆందోళన కల్గిస్తున్న ప్రముఖ స్వచ్ఛంద సంస్థ రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్(ఆర్డీటీ) ఎఫ్.సి.ఆర్.ఏ అంశం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వద్దకు వెళ్లింది. రాష్ట్ర ప్రభుత్వ విప్ , రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు ఆధ్వర్యంలో మాజీ మంత్రి ,రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ఇతర ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్రబాబు( కళ్యాణ్ దుర్గం), దగ్గుబాటి ప్రసాద్(అనంతపురం అర్బన్), బండారి శ్రావణి (సింగనమల)లు విజయవాడలో బుధవారం ముఖ్య మంత్రిని కలి శారు. జిల్లా ఎమ్మెల్యేలు ముఖ్య మంత్రి కార్యాలయానికి వెళ్లి.. ఆర్డీటీ సంస్థకు విదేశీ నిధులు ఆగడం వలన తలెత్తే ప్రమాదం గురించి సీఎంకు వివరించారు. జిల్లాలో విద్య, వైద్యం, క్రీడలు, ఇతర సంక్షేమ, అభివృద్ధి కోసం ఆర్డీటీ ఎంతో చేస్తోందని ఎమ్మెల్యేలు కాలువ, పరిటాల సునీత, సురేంద్ర, శ్రావణి, ప్రసాద్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆ సంస్థ కార్యకలాపాలు ఆగితే వేలాది కుటుంబాలు ఇబ్బంది పడుతాయని అంతేకాకుండా 3వేల మంది ఉద్యోగాలు కోల్పోతారని కాలువ శ్రీనివాసులు తెలిపారు. చాలా కుటుంబాలు ఆర్డీటీ మీద ఆధారపడ్డారని.. ప్రస్తుతం పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య అందించే పథకం కూడా ఆగిపోతుందన్నారు. మొత్తం అన్ని అంశాలు విన్న ముఖ్యమంత్రి చంద్రబాబు..ఆర్డీటీ గురించి నాకు కూడా బాగా తెలుసునని.. నిస్వార్థంగా సేవలందించే ఆ సంస్థకు నిధులు ఆగకుండా చూస్తామన్నారు. దీనిపై కేంద్రానికి లేఖ రాయడంతో పాటు వ్యక్తిగతంగా కూడా మాట్లాడుతామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. అంతే కాకుండా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ద్వారా మీరంతా ఢిల్లీలో హోం మంత్రి అమిత్ షాని కలిసి పరిస్థితిని వివరించాలన్నారు. ఆర్డీటీని మరోసారి ఎఫ్.సి.ఆర్.ఏ కోసం దరఖాస్తు చేసుకోవడమా లేక మరో మార్గమా అన్నది చూడాలన్నారు. అప్పటి వరకు ఆర్డీటీ నిధుల వినియోగానికి ఎలాంటి ఆటంకం లేకుండా చూస్తామని ముఖ్యమంత్రి స్పష్టమైన హామీ ఇచ్చినట్టు కాలువ శ్రీనివాసులు తెలిపారు. మరోవైపు ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ ఆర్డీటీ సేవలు ఎప్పటిలానే కొనసాగుతాయని.. ఇందుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ముఖ్యమంత్రి కూడా ఈ విషయంలో చాలా సానుకూలంగా ఉన్నారని.. ఇదే అంశంపై పరిటాల శ్రీరామ్ గతంలో రెండు సార్లు ఢిల్లీ వెళ్లి మాట్లాడారన్నారు. త్వరలోనే అందరూ మంచి వార్త వింటారని ఎమ్మెల్యే సునీత అన్నారు.

# వ్యవసాయ విద్యకు పూర్తి స్థాయిలో ప్రోత్సాహం : మంత్రి అచ్చెన్నాయుడు



**విజయవాడ, ఏప్రిల్ 30,ప్రభాత వార్తప్రతినిధి:** రాష్ట్రంలో వ్యవసాయ విద్యకు ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తోందని రాష్ట్ర వ్యవ సాయ శాఖ మంత్రి కింజరపు .అచ్చెన్నా యుడు తెలిపారు. వ్యవ సాయ విద్యను నాలుగు గోడల మధ్య కాకుండా పంట పొలాల్లో నేర్చుకోవాలన్నారు. గ్రామీణ రైతాంగంతో విద్యార్థులు మమేకం కావాలని సూచించారు. గ్రామీణ జీవన విధానంపై అధ్యయనం చేయాలన్నారు. వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ, మత్స్య, ఆక్వా ఉత్పత్తుల్లో వస్తోన్న మార్పులు, సమస్యలపై దృష్టి సారించాలని కోరారు లాం క్షేత్రంలో ఆచార్య రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డైమండ్ జూబ్లి ఉత్సవాలు సందర్భంగా ఆయన కీలక ప్రసంగం చేసారు. ఈ ఉత్సవాలకు తొలిరోజు మంత్రి అచ్చెన్నాయుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారైనట్లు ఏపీ వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయంలో ఒక సమాచార పత్రంలో వివరించారు.. ఉత్సవాల్లో మంత్రి వ్యవసాయ ప్రదర్శనను ప్రారంభించారు. పైలాన్‌ను, విశ్వవిద్యాలయం సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుమారు 150 వరకు వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల స్టాళ్లు, విశ్వవిద్యాలయాల స్టాళ్లు, ప్రైవేట్ ఇండస్ట్రీ నుంచి స్టాళ్లు ఏర్పాటు చేసి వ్యవసాయ సాంకేతికతకు సంబంధించిన ఆధునిక టెక్నాలజీని పరికరాలను ప్రదర్శనలో ఉంచారు. ఉపకులపతి డాక్టర్ ఆర్ శారద జయలకీ దేవి అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థులు ప్రపంచంలో అన్ని రంగాల్లో అత్యంత ప్రతిష్టాత్మకమైన స్థానాల్లో ఉన్నారని కొనియాడారు. వ్యవసాయ శాఖ ప్రత్యేక కార్యదర్శి బి రాజశేఖర్ ,వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావు, ఎమ్మెల్యేలు ఏలూరు సాంబశివరావు, బి. రామాంజనేయులు, అలపాటి రాజేంద్రప్రసాద్, నాబార్డు మాజీ చైర్మన్ చింతల గోవిందరాజులు తదితరులు ప్రసంగించారు. మంగళవారం ఉదయం జరిగిన సాంకేతిక సదస్సు కు పలువురు సీనియర్ సైంటిస్టులు, విశ్వవిద్యాలయం మాజీ వైస్‌ఛాన్స లర్లు హాజరయ్యారు. రానున్న కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, వాతావరణ అనుకరణాల నీటిపారుదల వినియోగం, నిర్వహణ, ప్రకృతి వ్యవసాయం, వినూత్న పరిశోధనలపై దృష్టి సారించాలని సూచించారు. 1964 నుంచి ఇప్పటి వరకుసాధించిన ప్రగతి, పరిశోధనలపై చర్చించారు. వైస్‌ఛాన్స లర్ శారద జయలక్ష్మీదేవి నివేదికను సమర్పించారు. కేంద్ర వ్యవసాయ ధరల నిర్ణాయక సంస్థ నుంచి డాక్టర్ విజయపాల్ శర్మ, రైతు సాధికారిక సంస్థ వైస్ చైర్మన్ విజయకుమార్, అగ్రిమిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాస్ ఉన్నారు.

# ప్లేఆఫ్స్ నుంచి సిఎస్కే ఎస్కేప్

## లోపాలను సరిదిద్దుకోని టీమ్

## చెన్నై దుస్థితికి కారణాలెన్నో



**న్యూఢిల్లీ:** ఈ ఐపీఎల్ సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) ప్రస్థానం దాదాపుగా ముగిసినట్లే, ఐదుసార్లు చాంపియన్స్ చెన్నై సూపర్ కింగ్స్ ఈ సీజన్ లోనూ తడబాటు చూపిస్తోంది. 2023 లో చివరిసారిగా చాంపియన్‌గా నిలిచిన ఈ జట్టు గతేడాది ఐదో స్థానంలో నిలిచి, త్రుటిలో ప్లే ఆఫ్ చాన్స్ పోగొట్టుకుంది. గతేడాది జరిగిన మెగా వేలంలో కొత్తజోష్‌తో కనిపించిన సీఎస్కే ఆ జోరును ఈ టోర్నీలో చూపించడంలో విఫలమైంది. ఇప్పటికే 7 ఓటము లతో -1.302 నెట్ రన్ రేటుతో అట్టడుగున 10వ స్థానంలో నిలిచిన సీఎస్కే మిగతా 5 మ్యాచ్‌ల్లో (ఈ నెల 30న పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్‌తో సహా) పరువు కోసం బరిలోకి దిగనుంది. తొలిసారి సొంతగడ్డపై 4 మ్యాచ్‌లు ఓడిపోయింది. ఇప్పటివరకు తొమ్మిది మ్యాచ్‌లు ఆడి, కేవలం రెండింటిలోనే గెలిచింది. ఏడు మ్యాచ్‌ల్లో ఓడిపోయి, ప్లే ఆఫ్ అవకాశాలను క్లిష్టం చేసుకుంది. అద్భుతం జరిగితేనే చెన్నై ప్లే ఆఫ్స్‌కు చేరుకునే అవకాశముంది. ఈ దుస్థికి గలకారణాలను, లోపాలను అధిగమించడంలో సైతం ఘోరంగా విఫలమైంది. ఇక వేలంలో సరైన ఆటగాళ్లను తీసుకోక పోవడంతోనే సీఎస్కే ఓటమిపాలైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై తాజాగా ఆ జట్టు కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ కూడా వ్యాఖ్యానిం చాడు. టోర్నీ ఆరంభంలో సరైన ఆటగాళ్లను పిక్ చేయక పోవడం తోనే ఓటములు ఎదురయ్యాయని వాపోయాడు. కొత్త ఆటగాళ్లు సైతం సూపర్ ఫ్లాప్ అయ్యారు.ఈ సీజన్ లో దేశవాళీ సినియర్ ప్లేయర్లయిన రాహుల్ త్రిపాఠి, దీపక్ హుడా, విజయ్ శంకర్ లను తీసుకుంది. అలాగే రవిచంద్రన్ అశ్విన్ కూడా పునరాగమనం చేశాడు. వీరంతా సత్తా చాటడంలో విఫలమయ్యారు. ఏ ఒక్కరూ తమ దైన శైలిలో మ్యాచ్ విన్నింగ్స్ ఇన్నింగ్స్ ఆడలేకపోయారు. వరుస ఓటములు ఎదురైనా కొత్త ఆటగాళ్లకు అవకాశాలు ఇవ్వకపోవడం కూడా ప్రభావం చూపించింది. అంతా అయిపోయాక, షేక్ రషీద్, ఆయుష్ మాత్రే, డెవాల్డ్ బ్రివిస్ లాంటి ఆటగాళ్లను చాన్స్ లివ్వడం, వాళ్లు నిరూపించుకోవడం అంతా చూశారు. సరైన గేమ్ ప్లానింగ్ లేకపోవడంతోనే సీఎస్కే ఓటమి పాలైంది. ఇక ఈ ఐపీఎల్ సీజనులో చెపాక్ కోట దాదాపు బద్దలైనట్లే. సొంతగడ్డపై అత్యంత బలమైన జట్లలో సీఎస్కే ఒకటి, దశాబ్దానికి పైగా కొన్ని జట్లు అక్కడ విజయం సాదించలేక పోయాయి. అయితే సీజన్ లో మాత్రం ఈ రికార్డుకు చెల్లు చీటీ పడింది. 17 ఏళ్ల తర్వాత రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, 15 ఏళ్ల తర్వాత ఢిల్లీ క్యాపిటల్స్, 12 ఏళ్ల తర్వాత సన్ రైజర్స్ హైదరాబాద్ చేపాక్ లో తొలి విజయం సాదించి, చెన్నై కోటను బద్దలు కొట్టాయి. ఇక ఈ సీజన్ లో గాయాలతో సతమతమవడం కూడా జట్టును దెబ్బ తీసింది. గాయంతో రెగ్యులర్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ దూరమవ్వడం, మోకాలి గాయంతోనే తాజా కెప్టెన్ ఎంఎస్ ధోనీ ఆడటం, విదేశీ ప్లేయర్లు రచిన్ రవీంద్ర, డేవన్ కాన్వే, శామ్ కరన్ విఫలం కావడం దెబ్బ తీసింది. ఇక ఇప్పటికే ఏడు మ్యాచ్ లు ఓడిన చెన్నై, మిగతా 5 మ్యాచ్ ల్లో విజయం సాధిస్తే, ఏదైనా చిన్న అవకాశం ఉండొచ్చు. అయితే దానికి చాలా సమీకరణాలు కలిసి రావాలి. ఏదేమైనా అసలు తప్పు ఎక్కడ జరిగిందో విశ్లేషించుకుని, తర్వాత ఏడాది బలంగా రావాలని అభిమానులు కోరుకుంటున్నారు.

## బాక్సింగ్‌లో మరో 21 స్వర్ణ పతకాల కోసం భారత్‌కు అర్హత

### ఇప్పటికే ఖాయమైన 43 పతకాలు



**న్యూఢిల్లీ:** జూనియర్ ఆసియా బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో ఇండియా జైత్రయాత్ర కొనసాగుతోంది. జోర్డాన్‌లో జరుగుతున్న జూనియర్ ఆసియా చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు దుమ్ము రేపుతున్నారు. ఆరుగురు మహిళలు సహా మొత్తం ఏడుగురు బాక్సర్లు అండర్17 ఫైనల్స్‌లో అడుగుపెట్టారు. ఈ చాంపియన్‌షిప్‌లో భారత్ ఇప్పటికే 43 పతకాలు ఖాయం చేసుకుంది. తాజాగా అండర్15, అండర్17 విభాగాలలో మరో 21 మంది బాక్సర్లు స్వర్ణం కోసం అర్హత సంపాదించి తలపడనున్నారు. అలాగే అండర్ 17 మహిళల కేటగిరీలో అహాన శర్మ (50కిలోలు), ఖుషీచంద్ (44-46కిలోలు), జనత్ (54కిలోలు), సిమ్రన్‌జీత్ కౌర్ (60కిలోలు), హరిస్కా (63కిలోలు), అన్షిక (80+కిలోలు) ఫైనల్లో ప్రవేశించారు. పురుషుల అండర్ 17 కేటగిరీలో దేవాన్ష్ (80కిలోలు) పసిడి పతక పోరుకు చేరాడు. అలాగే అండర్-17లో మరో ఏడుగురు బాక్సర్లు ఫైనల్‌కు అర్హత సాధించారు. ఇందులో ఆరుగురు మహిళా బాక్సర్లు కూడా ఉన్నారు. దీంతో అండర్-17, అండర్ 15 కేటగిరీలో మొత్తం 21 మంది బాక్సర్లు బంగారు పతకాల వేటలో ఉన్నారు. అండర్-17 మహిళల కేటగిరీలో అహానా శర్మ (50 కేజీలు), అక్మరల్ అమంటైవా (కిర్గిస్తాన్)పై నాకౌట్ విజయం సాధించి ఫైనల్లోకి అడుగుపెట్టింది. ఖుషి చాంద్ (44-46 కేజీ) 3-2తో ఒలెక్సాండ్రా చెరెవాటా (ఉక్రెయిన్)పై గెలవగా, జన్నత్, సిమ్రన్జీత్ కౌర్, హర్సికా, అన్షిక తమ ప్రత్యర్థులపై తిరుగులేని విజయాలు సాధించి టైటిల్ ఫైనల్‌కు అర్హత సాధించారు. మెన్స్ అండర్-17లో దేవాన్ష్ (80 కేజీ) 4-1తో ఎనుగుయెన్ ట్రోంగ్ టియెన్ (వియత్నాం)ను ఓడించి ఫైనల్లోకి ప్రవేశించాడు.




## ఇంగ్లండ్ మహిళా టీమ్ కెప్టెన్‌గా సీవర్ బ్రంట్

**న్యూఢిల్లీ:** ఇంగ్లండ్ మహిళల క్రికెట్ జట్టుకు కొత్త సారధిగా ఆల్ రౌండర్ నాట్ సీవర్ బ్రంట్ ఎంపికైంది. ఇటీవల కాలం లో ఇంగ్లండ్ జట్టు స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేక పోవడం తో నాయకత్వ మార్పు అనివార్యమైంది. తొమ్మిదేళ్లుగా హీథ ర్ నైట్ ఇంగ్లండ్ కెప్టెన్‌గా వ్యవహరిస్తుండగా, గత ఏడాది టీ20 ప్రపంచ కప్‌లో ఆ జట్టు గ్రూప్ దశలోనే ఇంటిదారి పట్టింది. ఇక ఆస్ట్రేలియాతో మూడు ఫార్మాట్లలో కలిపి 16 మ్యాచ్‌లు ఆడినా ఒక్క దాంట్లోనూ విజయం సాధించలేక పోయింది. దీంతో ఇంగ్లండ్ వేల్స్ క్రికెట్ బోర్డు హీథర్ నైట్ స్థానంలో మూడేళ్లుగా జట్టుకు వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న సీవర్ బ్రంట్‌కు పగ్గాలు అప్పగించింది. మూడు ఫార్మాట్లలోనూ బ్రంట్ ఇంగ్లండ్ మహిళల జట్టును నడిపించనుంది. కాగా 2013లో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన బ్రంట్ ఇంగ్లండ్ జాతీయ జట్టు తరపున మూడు ఫార్మాట్లలో కలిపి 259 మ్యాచ్‌లు ఆడింది. ఈ సంర్భంగా సీవర్ బ్రంట్ మాట్లాడుతూ ఇంగ్లండ్ మహిళల క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గా ఎంపిక కావడం గర్వంగా భావిస్తున్నట్లు సీవర్ పేర్కొంది. జట్టును విజయవంతంగా నడిపించేందుకు తన వంతు కృషి చేస్తానని వెల్లడించింది. జట్టు మెరుగైన ప్రదర్శనతో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేసింది.

## బ్యాడ్మింటన్ టోర్నీలో నాకౌట్ అవకాశం కోల్పోయిన భారత్



**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక ప్రపంచ మక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత్ దిగ్గజాలు వైఫల్యం చెందారు. చైనాలో జరుగుతున్న ఈ మెగా ఈవెంట్‌లో భారత్ జట్టు వరుసగా రెండో పరాజయాన్ని చవిచూసి నాకౌట్ దశకు చేరుకునే అవకాశాన్ని కోల్పోయింది. ఈ టోర్నీలో క్వార్టర్స్ ఆశలను సజీవంగా నిలుపుకోవాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో భారత్‌కు చుక్కెదురైంది. డెన్మార్క్‌లో జరిగిన గ్రూప్ డి తొలి లీగ్ మ్యాచ్‌లో 1-4తో ఓడిన భారత్ ప్లేయర్లు ఇండోనేషియా జట్టుతోనూ అదే వైఫల్యాలను కొనసాగించారు. దీంతో తాజాగా జరిగిన రెండో లీగ్ మ్యాచ్‌లోనూ 1-4తో ఓటమి పాలయ్యారు. వరుసగా రెండు మ్యాచ్‌ల్లో నెగ్గిన డెన్మార్క్, ఇండోనేషియా జట్లు గ్రూప్ డి నుండి నాకౌట్ దశకు అర్హత పొందాయి. ఇండోనేషియాతో జరిగిన పోటీలో మిక్స్‌డ్ డబుల్స్ తొలి మ్యాచ్‌లో ధ్రువ్ కపిలతనీ-షా క్రాస్టో ద్వయం 10-21, 21-18, 21-19తో రెహాన్‌గ్లొరియాతో జరిగిన హోరాహోరీ పోరులో గెలిచి భారత్‌కు 10 ఆధిక్యం ఇచ్చారు. కానీ తర్వాత జరిగిన 4 గేమ్‌లలో భారత షట్లర్లు ఒక్క మ్యాచ్ కూడా గెలుచుకోలేదు. అలాగే మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు 12-21, 13-21తో పుత్రి కుసుమ వర్ధిని చేతిలో ఓటమిపాలైంది.

కాగా పురుషుల సింగిల్స్‌లో మూడో మ్యాచ్‌లో హెచ్ఎస్ ప్రణయ్ 21-19, 14-21, 12-21తో జొనాథన్ క్రిస్టీ జోరుకు తలవంచాడు. మరోపక్క మహిళల డబుల్స్‌లో శ్రుతి-ప్రియామిశ్రా జంట 10-21, 9-21తో ల్యానీ నరటియా-సితి ఫాదియా జంట చేతిలో ఓటమి పాలైంది. ఐదో మ్యాచ్‌లో హరిహరన్-రూబన్ 20-22, 18-21తో షోహిబుల్-డానియల్ చేతిలో పరాజయం పాలయింది.పురుషుల డబుల్స్‌లో హరిహరన్ రుబాన్ 20-22, 18-21తో ఫిక్రీమార్టిన్ ద్వయం జోరు ముందు నిలువలేకపోయింది.

# నేటి నుంచి మారుతున్న రూల్స్ ఇవే..

## ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణ

**ముంబై, ఏప్రిల్ 30:** దేశీయ మార్కెట్లు బుధవారం స్వల్ప నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు ఉన్నప్పటికీ, భారత్-పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు సూచీలపై ప్రభావం చూపించాయి. ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించడంతో ట్రేడింగ్ ఆద్యంతం సూచీలు తీవ్ర ఊగిసలాటకు గురై చివరికి స్వల్పంగా నష్టపోయాయి. ఉదయం 80,370 పాయింట్ల వద్ద ఉత్సాహంగానే ప్రారంభమైన సెన్సెక్స్ ఆరంభంలో కాసేపు లాభాల్లో పయనించింది. ఇంట్రాడేలో 80,525.61 గరిష్ట స్థాయికి చేరింది. అయితే ఆ జోరు ఎంతో సేపు కొనసాగలేదు. ఇన్వెస్టర్ల లాభాలు స్వీకరణతో ఒత్తిడికి గురైన సూచి ఒక దశలో 79,879 కనిష్ట స్థాయికి పడిపోయింది. చివరికికాస్త తేరుకుని సెన్సెక్స్ 46.14 పాయింట్లు నష్టపోయి 80,242.24 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా అత్యల్పంగా 1.75 పాయింట్లు తగ్గి 24,334.20 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ 47 పైసలు పెరిగి రూ.84.49గా




కొనసాగింది. మారుతి సుజుకీ, హెచ్‌డిఎఫ్‌సి లైఫ్, భారతీ ఎయిర్‌టెల్, ఎస్‌బిఐ లైఫ్ ఇన్సూరెన్స్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ వంటి షేర్లు రాణించాయి. బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఫైనాన్స్, ట్రెంట్, టాటా మోటార్స్, ఎస్‌బిఐ వంటి షేర్లు ఒత్తిడికి గురయ్యాయి. రియాల్టీ సూచి 2శాతం పెరగ్గా, మీడియా, ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సూచీలు 2శాతం మేర నష్టపోయాయి.

**ముంబై, ఏప్రిల్ 30:** మే 1 నుండి అనేక పెద్ద మార్పులు జరగ బోతున్నాయి. ఇది మీ జేబుపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. బ్యాంకు ఖాతా నుండి ఎటిఎం లావాదేవీలు, వంట గ్యాస్ ధర వరకు ప్రతిదీ దానితో ముడిపడి ఉంది. అందువల్ల ఈ కొత్త నియమాల గురించి మీరు ముందుగానే తెలుసుకోవడం ముఖ్యం. తద్వారా మీరు తరువాత ఎటువంటి సమస్యలను ఎదుర్కోవాల్సిన అవసరం లేదు. ఈ మార్పులు మీ లావాదేవీలు, సేవలను నేరుగా ప్రభావితం చేస్తాయి. ఏటీఎం ఉపసంహరణ పరిమితి, బ్యాంక్ ఛార్జీలు, గ్యాస్ సిలిండర్ ధరలలో మార్పులు వంటివి. ఈ మార్పుల గురించి తెలుసుకుందాం. మే 1, 2025 నుండి ఏటీఎం నుండి డబ్బు విత్‌డ్రా చేయడంపై ఉచిత



లావాదేవీలపై పరిమితి ముగుస్తుంది. ఇప్పుడు మీరు ఏటీఎం నుండి డబ్బు తీసుకునే ప్రతిసారీ రూ.19 చెల్లించాలి. గతంలో ఈ రుసుము రూ. 17 ఉండేది. దీనితో పాటు, మీరు బ్యాలెన్స్ చెక్ చేస్తే, దీనికి కూడా రూ.7 రుసుము చెల్లించాలి. అయితే గతంలో రుసుము రూ.6 ఉండేది. మే 1, 2025 నుండి రైల్వే టిక్కెట్ బుకింగ్ నియమాలలో కొన్ని మార్పులు ఉంటాయి. ప్రయాణికులు కొత్త వ్యవస్థ ప్రకారం సిద్ధంకావాలి. ఇక నుంచి వెయిటింగ్ టిక్కెట్లు జనరల్ కోచ్‌లలో మాత్రమే చెల్లుతాయి. మీరు స్లీపర్ కోచ్‌లో వెయిటింగ్ టికెట్‌తో ప్రయాణించలేరు.

దేశంలోని 11 రాష్ట్రాల్లో 'వన్ స్టేట్ వన్ ఆర్ఆర్‌బి' పథకం మే 1, 2025 నుండి అమలు చేయబడుతుంది. దీని అర్థం ప్రతి రాష్ట్రంలో అన్ని ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు కలిసి ఒక పెద్ద బ్యాంకుగా ఏర్పడతాయి. దీనివల్ల బ్యాంకింగ్ సేవలు మెరుగుపడతాయి. కస్టమర్లకు గతంలో కంటే ఎక్కువ సౌలభ్యం లభిస్తుంది. ఈ మార్పు ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, బీహార్, గుజరాత్, జమ్మూ కాశ్మీర్, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, రాజస్థాన్‌లలో అమలు అవుతాయి. నెలా మొదటి తేదీన ఎల్పిజి సిలిండర్ ధరలను సమీక్షిస్తారు. ఈసారి కూడా మే 1న గ్యాస్ సిలిండర్ ధరను సమీక్షిస్తారు. మే 1 నుండి మీరు ఎఫ్‌డి, సేవింగ్స్ ఖాతా వడ్డీ రేట్లలో కూడా మార్పులను చూడవచ్చు.

## రోజూ 13,698 వాహనాల విక్రయం!

**ముంబై, ఏప్రిల్ 30:** వార్షిక ప్రాతిపదికన వృద్ధి 2-4 శాతానికి పరిమితమైనా, దేశీయ, విదేశీ మార్కెట్లలో అమ్మకాల దన్నుతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్యాసింజర్ల వాహనాల విక్రయాలు 50 లక్షల మార్కును తాకే అవకాశం ఉందని క్రిసిల్ రేటింగ్స్ ఒక నివేదికలో వెల్లడించింది. అంటే రోజూ 13,698 వాహనాలు విక్రయిస్తారని అంచనా వేసింది. తద్వారా వరుసగా నాలుగో యేడాది రికార్డు అమ్మకాలు సాధించినట్లవుతుందని క్రిసిల్ రేటింగ్స్ పేర్కొంది. సాధారణం కన్నా మెరుగైన వర్షపాతం ఉంటుందనే అంచనాలతో గ్రామీణ ప్రాంతాలు కోలుకుంటే ఎంట్రీ-స్థాయి కార్లకు డిమాండ్ మెరుగుపడొచ్చని వివరించింది. ప్యాసింజర్ వాహనాల వృద్ధి ఈ ఆర్థిక సంవత్సరం 2-4శాతానికి పరిమితం కావచ్చు. కానీ కొత్త ఉత్పత్తులతో యుటిలిటీ వాహనాల (యువి) వృద్ధి 10 శాతం స్థాయిలో దూసుకెళ్తుంది. మొత్తం అమ్మకాల పరిమాణంలోను, కొత్తగా వచ్చే మోడల్స్ లోనూ యువిల వాటా 68-70 శాతంగా ఉండనుంది అని క్రిసిల్ రేటింగ్స్ సీనియర్ డైరెక్టర్ అనుజ్ సేథి తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో మొత్తం ప్యాసింజర్ వాహనాల అమ్మకాల్లో దేశీయ మార్కెట్ వాటా 85 శాతంగా ఉండగా, మిగతా వాటా ఎగుమతులది ఉంది. కొత్త మోడల్స్ ప్రవేశపెట్టినా, బ్యాటరీ ఖరీదు తగ్గినా అధిక రేట్లు, ఒక మోస్తరు ఛార్జింగ్ మౌలిక సదుపాయాలు, రేంజ్‌పరమైన అనుమానాల కారణంగా ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాల వృద్ధి 3-3.5శాతానికి పరిమితం కావచ్చు. పట్టణ ప్రాంత యూజర్లు దీన్ని రెండో కారు కింద ఒక ఆప్షన్‌గా




మాత్రమే పరిగణించ వచ్చు. లో బేస్ కారణంగా గతేడాది ఈవీ సెగ్మెంట్ రెట్టింపయి నప్పటికీ ఆ తర్వాత వృద్ధి నెమ్మదించింది. టెస్లా సహా గ్లోబల్ ఈవీ మోడల్స్ రావడం వల్ల ప్రీమియం సెగ్మెంట్లో పోటీతీవ్రతరమవుతుంది. కస్టమర్ల అంచనాలు పెరిగిపోతాయి. కాబట్టి దేశీయ తయారీ సంస్థలు వేగవంతంగా కొత్త టెక్నాలజీలకు అప్‌గ్రేడ్ కావాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అయితే ప్రస్తుతం భారీ టారిఫ్‌లు ఉన్నందున దిగుమతులు వెల్లువెత్తకపోవచ్చు. రాబోయే రోజుల్లో వడ్డీ రేట్ల తగ్గింపు వేగం, ఈవీల వినియోగం, సరఫరావ్యవస్థపరమైన షాక్‌లు మొదలైనవి చిప్‌లు, బ్యాటరీ సెల్స్ లభ్యతపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

## అక్షయ తృతీయ రోజు భారీగా పెరిగిన పసిడి ధరలు

**ముంబై, ఏప్రిల్ 30:** అక్షయ తృతీయ వేళ బంగారం ధరలు భారీగా పెరిగాయి. దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధరపై రూ.1,050 పెరిగి రూ.99,450కి చేరుకుంది. 99.9 స్వచ్ఛత కలిగిన మేలిమి బంగారం అంతకుముందు ధరపై రూ.1000 తగ్గి రూ.98,400కు పడిపోయింది. అయితే, అక్షయ తృతీయకు ఒక్క రోజు ముందు మళ్లీ పూర్వస్థితికి చేరుకుంది. 99.5 స్వచ్ఛత కలిగిన బంగారంపై ఏకంగా రూ.1,100 పెరిగింది. దీంతో 10 గ్రాముల ధర రూ.99 వేలకు చేరుకుంది. అంతకు ముందు ముగింపు సమయానికి ఈ ధర రూ.97,900గా ఉంది.

గతేడాది డిసెంబర్‌లో 10 గ్రాముల బంగారం ధర రూ. 78,950గా ఉండేది. ఈ ఏడాది ఇప్పటి వరకు రూ. 20,500 (26 శాతం) పెరిగింది. మరోవైపు, వెండి ధర కూడా భారీగా పెరిగింది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.